RNI.No. APTEL/2014/57702 Estd.: 2000 www.voodayam.com /voodayam /Voodayam




# వుదయం

Simultaneously published from Guntur, Hyderabad, Adilabad, Khammam, Karimnagar & Warangal




సంపుటి : 11 ‖ సంచిక : 253 ‖ గుంటూరు ‖ శుక్రవారం, మార్చి 07, 2025 ‖ VOODAYAM Telugu Daily ‖ వెల : రూ. 1.00 ‖ పేజీలు : 12

# మెట్రోకు గ్రీన్ సిగ్నల్

**కేంద్ర మంత్రితో చర్చలు ఫలప్రదం**

**సీఎం చంద్రబాబు**

**ఏపీకి సహకరిస్తున్నారంటూ కేంద్ర మంత్రికి ధన్యవాదాలు తెలిపిన చంద్రబాబు**

**ఏపీకి కేంద్రమంత్రి సహకరిస్తున్నారన్న చంద్రబాబు**

**మెట్రో రైలు ప్రాజెక్టులపై చర్చలు ఫలప్రదమయ్యాయని వెల్లడి**

**సామాజిక, ఆర్థిక, అభివృద్ధి ప్రాజెక్టుల గురించి చర్చించినట్లు వెల్లడి**



**దిల్లీ**

ఆంధ్రప్రదేశ్‌కు సహకరిస్తున్నందుకు కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్ట్ పెట్టారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన కేంద్ర మంత్రి ఖట్టర్‌తో సమావేశమయ్యారు. అనంతరం ఆయన సామాజిక మాధ్యమంలో ఈ విషయాన్ని తెలియజేశారు. విశాఖ, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టులపై చర్చలు ఫలప్రదం అయ్యాయని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. దిల్లీ పర్యటనలో భాగంగా గురువారం సాయంత్రం కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో సీఎం సమావేశమయ్యారు. రాష్ట్ర సామాజిక, ఆర్థిక, అభివృద్ధి ప్రాజెక్టుల గురించి చర్చించి నట్టు సీఎం తెలిపారు. ఇది రాష్ట్ర ఆర్థిక ప్రగతికి దోహద పడుతుందని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఏపీకి సహకరిస్తున్నందుకు ఖట్టర్‌కు చంద్రబాబు ధన్యవాదాలు - మిగతా3లో



**మన దేశం అభివృద్ధి చెందాలంటే**

## ఇలా చేయాలి..

**మొదట ముంబాయిలో రెండో చర్చ విశాఖలో నిర్వహించాం**

**విశాఖలో బడ్జెట్‌పై వివిధ వర్గాల ప్రజలను కలసి వారి సలహాలు, సూచనలు తీసుకున్నాం**

**విశాఖపట్నం**

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, వివిధ వ్యాపార వర్గాలు కేంద్ర బడ్జెట్‌పై పోస్ట్ బడ్జెట్ చర్చలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. బడ్జెట్ ప్రవేశ పెట్టిన తర్వాత దేశవ్యాప్తంగా చర్చలు నిర్వహిస్తున్నామన్నారు. మొదట ముంబాయిలో రెండో చర్చ విశాఖలో నిర్వహించామన్నారు. విశాఖలో బడ్జెట్‌పై వివిధ వర్గాల ప్రజలను కలసి వారి సలహాలు, సూచనలు తీసుకున్నామని తెలిపారు. పోలవరం ప్రాజెక్ట్‌కి అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వంగా కాకుండా తమ బాధ్యతగా సహకారం అందిస్తున్నామన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ఎక్కువ మొత్తం కేటాయించినట్లు తెలిపారు. స్టీల్ ప్లాంట్‌ను పునరాభివృద్ధి చేయడానికి 11 వేల కోట్లు సహకారం అందిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అమరావతి రాజధానికి కూడా సహకారం అందిస్తున్నామని పేర్కొన్నారు. కేంద్రం, రాష్ట్రం కలిసి చేస్తున్న అన్ని ప్రాజెక్టులకు లోటు లేకుండా కేటాయింపులు చేస్తున్నట్లు తెలిపారు. సాంకేతిక సమస్యల వలన పోలవరం

## భారత్‌పై విధిస్తున్న సుంకాల మీద చర్చించేందుకు గోయల్ అమెరికా వెళ్లారు

**అమెరికా వాణిజ్య మంత్రిత్వ శాఖతో గోయల్ చర్చిస్తున్నారన్న నిర్మలా సీతారామన్**

**భారత్ ఎగుమతులను దృష్టిలో పెట్టుకొని చర్చలు జరుపుతున్నట్లు వెల్లడి**

**మనం వినియోగించుకునే వాటికే పన్నులు చెల్లిస్తామన్న ఆర్థికమంత్రి**



**ఇంటర్మీడియట్ బోర్డులో**

## సంస్కరణలు

**మంత్రి నారా లోకేష్ కీలక వ్యాఖ్యలు**

**అమరావతి**

కళాశాల విద్యార్థుల ఆత్మహత్యలపై శాసన మండలిలో వైసీపీ ఎమ్మెల్సీలు ప్రశ్నించారు. వారి ప్రశ్నలకు మంత్రి నారా లోకేష్ సమాధానం ఇచ్చారు. విద్యాసంస్థల్లో పిల్లలు ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరమని అన్నారు. పలు సమస్యలతో పిల్లలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని చెప్పారు. ర్యాగింగ్, ఒత్తిడి, ఫీజుల చెల్లింపు వల్ల ఎక్కువగా పిల్లలు ఆత్మహత్యలకు కారణాలవుతున్నాయన్నారు. పాఠశాల విద్యలోనూ మానసికంగా వేధిస్తున్నారనే అంశాలు వెలుగులోకి

## ప్రపంచం పోకడలపై అధ్యయనమే 'ప్రపంచ చరిత్ర'

**ఆ పుస్తకాన్ని ప్రతి ఒక్కరూ చదవాలి**

**నా తోడల్లుడు దగ్గుబాటి మా కుటుంబంలో విశిష్టమైన వ్యక్తి**

**దగ్గుబాటి వెంకటేశ్వరరావు రచించిన 'ప్రపంచ చరిత్ర' పుస్తకావిష్కరణలో సీఎం చంద్రబాబు**



**విశాఖపట్నం**

కొన్నివేల సంవత్సరాల మానవ పరిణామ క్రమాన్ని, ప్రపంచ చరిత్రను పుస్తక రూపంలో తెలుగులో రచించడం అద్భుత ప్రయత్నం. చరిత్రను ప్రతి ఒక్కరూ చదవాలి. దగ్గుబాటి వెంకటేశ్వరావు పుస్తకం రాస్తారని నేను అనుకోలేదు. స్వతహాగా రచయిత కానటువంటి రచయిత దగ్గుబాటి వెంకటేశ్వరరావు. ఎవరూ రాయని విధంగా పుస్తకాన్ని రాశారు. ప్రతి ఇల్లు, ప్రతి లైబ్రరీలో ప్రపంచ చరిత్ర పుస్తకం ఉండాలి. సమయం దొరికినప్పుడు నేను కూడా ఈ పుస్తకం పూర్తిగా చదువుతాను. నాటి ఆచారాలు, ఆహారపు అలవాట్లు, వ్యవసాయం వంటి అంశాలను పుస్తకంలో పొందుపరిచారు. లోతుకు వెళ్లి, సాధించాలనే తపన ఉంటేనే పుస్తకం రాయడం సాధ్యం అవుతుంది. యుద్ధాలు, సామ్రాజ్యాల ఆవిర్భావం, మత పెద్దల పెత్తనాలు, ఖండాల విభజన, బానిస వ్యవస్థ, అభివృద్ధి.. ఇలా ఏ విషయాన్ని వదిలిపెట్టకుండా ఈ పుస్తకంలో వెంకటేశ్వరావు ప్రస్తావించారు. భాష కళలు, వాస్తు, శిల్పం, భూ సంస్కరణలు, సామాజిక న్యాయం, - మిగతా3లో



**దిష్టిబొమ్మలుగా ఉంటే**

## ప్రయోజనం ఏంటి..

- ఎంపీల సంఖ్యపై అన్ని రాజకీయ పార్టీలతో కలిసి పోరాటం
- టీవీకే అధ్యక్షుడు విజయ్ ప్రకటన
- భారత రాజ్యాంగంలోని 84వ ఆర్టికల్ సవరణ మేరకు లోక్‌సభ సీట్ల పునర్విభజనను 2026 వరకు నిలుపుదల చేసారు.
- ఆ తర్వాత పునర్విభజనపై కేంద్రం దృష్టిసారించే అవకాశం ఉంది

## గట్టిగా గళం వినిపించండి

- పార్లమెంట్ సమావేశాలు ఆరంభం కానున్న తరుణంలో వైఎస్సార్‌సీపీ ఎంపీలకు వైఎస్ జగన్ దిశా నిర్దేశం
- పోలవరం ప్రాజెక్టు ఎత్తు. విశాఖ స్టీల్ ప్లాంట్..మిర్చికి మద్దతు ధర. వన్ నేషన్ వన్ ఎలక్షన్, రాష్ట్రంలో కొత్త మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ.. ఇంకా పలు అంశాలపై సమావేశంలో చర్చ



**తాడేపల్లి**

ఈనెల 10వ తేదీ నుంచి పార్లమెంటు మలి విడత బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో పార్టీకి చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్యాంప్ ఆఫీస్‌లో సమావేశమయ్యారు. ఉభయ సభల సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహం, ప్రస్తావించాల్సిన అంశాలపై పార్టీ ఎంపీలకు వైఎస్ జగన్ దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని, రాష్ట్ర సమస్యలపై పార్లమెంటు ఉభయ సభల్లో పార్టీ ఎంపీలు గట్టిగా గళం వినిపించాలని సమావేశంలో వైఎస్ జగన్ ఆదేశించారు. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడడం కోసం పార్లమెంటు ఉభయ సభల్లో లేవనెత్తాల్సిన అంశాలపై



**ఉదయనిధిపై కొత్త కేసులు**

## నమోదు చేయొద్దు

- సనాతన ధర్మంపై ఆయన చేసిన వ్యాఖ్యలకు గానూ కొత్త కేసులు ఏవీ నమోదు చేయొద్దని సర్వోన్నత న్యాయస్థానం తాజాగా ఆదేశాలు
- 'సనాతన ధర్మం'పై ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే.
- వివిధ రాష్ట్రాల్లో తనపై నమోదైన బహుళ ఎఫ్ఐఆర్‌లను ఏకీకృతం చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు

# సంపాదకీయం

## యుఎస్‌కు దూరమవుతున్న మిత్రదేశాలు

ప్రపంచమంతా ప్రస్తుతం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ గురించే చర్చించుకుంటున్నది. బుల్లితెరపై ఒక హాస్యనటుడిగా పని చేసి, అనేక మంది ప్రజల అభిమానం సంపాదించుకుని అవినీతి వ్యతిరేక ఉద్యమం ద్వారా ప్రజలకు మరింత చేరువై, అవినీతి రహిత పాలన అందిస్తానని, రాజ్యాంగాన్ని మారుస్తానని వాగ్దానం చేసి, 2019 ఎన్నికల్లో ఉక్రెయిన్ అధ్యక్షుడైన వ్లాదిమీర్ జెలెన్ స్కీ పరిపాలనపై పూర్తి స్థాయిలో దృష్టి సారించలేకపోయారు. కోవిడ్ నుంచి ఉక్రెయిన్ కోలుకునేలోగా ఉక్రెయిన్‌ను రష్యా యుద్ధం ముంచెత్తింది. నాటోలో చేరాలనే జెలెన్ స్కీ వాదం రష్యాకు కోపం తెప్పించింది. నాటో దేశాలు ఉక్రెయిన్ భూభాగాల్లోకి వస్తే అది అంతిమంగా రష్యా సార్వభౌమత్వానికి విఘాతం లా మారుతుందని రష్యా అధ్యక్షుడు పుతిన్ భావించారు. జెలెన్ స్కీ అప్పటి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, నాటో కూటమిని నమ్ముకుని రష్యాతో యుద్ధానికి దిగడం వ్యూహాత్మక తప్పిదమని చెప్పాలి. అయినప్పటికీ రష్యాను ఎదుర్కోవడంలో జెలెన్ స్కీ సాహసోపేతంగానే పోరాడిన విషయం విదితమే. కోవిడ్ సమయంలో ప్రజలకు అండగా నిలబడ్డారు. యుద్ధ సమయంలో స్వయంగా మిలిటరీ దుస్తులు ధరించి ప్రత్యక్షంగా యుద్ధరంగంలోకి దిగారు. అమెరికా నుండి లక్షల కోట్ల రూపాయల ఆర్థిక, ఆయుధ సహాయం పొంది, శత్రుభయంకరమైన బలమైన రష్యాతో దీటుగా యుద్ధరంగంలోకి దిగి, ఒకానొక సమయంలో రష్యా భూభాగాల్లోకి తన సైన్యాన్ని చొప్పించి, పుతిన్‌ను సైతం ముచ్చెమటలు పట్టించిన జెలెన్ స్కీ అమెరికా రాజకీయ ముఖచిత్రం మారడంతో, ట్రంప్ మధ్యవర్తిత్వంతో శాంతి ఒప్పందం కుదుర్చుకోక తప్పని పరిస్థితుల్లో వైట్‌హౌస్‌కు రావడం జరిగింది. ఉక్రెయిన్ దేశంలోని రేర్ ఎర్త్ మినరల్స్ కోసం డీల్ కుదుర్చుకోవాలని ఉబలాటపడిన ట్రంప్‌కు జెలెన్ స్కీ సంధించిన ప్రశ్నలు చిక్కుముడిగా మారిపోయాయి. శాంతి ఒప్పందం అటకెక్కింది. ఇప్పటి వరకు బిలియన్ డాలర్ల సహాయం చేసినందుకు ఉక్రెయిన్‌లో నిక్షిప్తమైన ఖనిజ సంపదలో 50% వాటా తమదే నంటూ ట్రంప్ పట్టుబట్టినా, ఉక్రెయిన్‌కు రష్యా నుండి భద్రత విషయంలో హామీ ఇవ్వకుండా ఎలాంటి ఒప్పందం చేసుకోబోనని జెలెన్ స్కీ ట్రంప్ మొహం పైనే తమ అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టినట్టు చెప్పారు. ట్రంప్ షరతులను అంగీకరించి, రష్యాతో సంధి కుదుర్చుకుని, జెలెన్ స్కీ ఒక కమెడియన్‌గా మారిపోతారని భావించిన వారి అంచనాలను తల్లక్రిందులు చేస్తూ, శ్వేతసౌధంలో జెలెన్ స్కీ ట్రంప్‌పై తిరుగుబాటు బావుటా ఎగరవేసి ప్రపంచ దృష్టిలో అమెరికాను ధిక్కరించిన హీరోగా చరిత్ర సృష్టించాడు. నాటో కూడా జెలెన్ స్కీ వైపే నిలబడింది. యూరోపియన్ యూనియన్‌లోని పలు దేశాలు ఉక్రెయిన్ వైఖరిని సమర్థించాయి. ఉక్రెయిన్ రక్షణ వ్యవస్థ బలోపేతానికి బ్రిటన్ ఏకంగా 3 బిలియన్ డాలర్ల సహాయం ప్రకటించడం ట్రంప్‌కు ఎదురుదెబ్బ కాగలదు. తన విశాలవాదంతో, మూర్ఖంగా ప్రవర్తిస్తున్న ట్రంప్‌కు యూరోపియన్ దేశాలు ఎదురు తిరుగుతున్నాయి. మెక్సికో నాది, పనామా నాది, గ్రీన్‌లాండ్ నాది,- కెనడా నాది అంటూ తనకు తానే స్వయంగా ప్రకటించుకున్న డొనాల్డ్ ట్రంప్‌కు క్రమేపీ మిత్రదేశాలు కూడా దూరమైపోతున్నాయి. యూరప్ నుంచి 30 దేశాలు, ఉత్తర అమెరికా నుంచి అమెరికా, కెనడాలు నాటో సభ్యదేశాలుగా ఉన్నాయి. మరచిపోయిన ప్రత్యర్థిగా ఉన్న రష్యాకు అనుకూలంగా ఐక్యరాజ్య సమితిలో అమెరికా ఓటేయడం మిత్రదేశాలుగా ఉన్న యూరప్ దేశాలను నిందించడం, తటస్థ వైఖరి అవలంబిస్తున్న భారత్‌కు ఎందుకు సహాయం చేయాలని గర్జించడం అమెరికాకు తగనిది. ట్రంప్ పాలనలో అమెరికా ఎటు వైపు పయనిస్తుందో ఎవరికీ అవగాహన కావడం లేదు. క్లీన్ ఎనర్జీ విషయంలో కూడా విభేదించి, వాతావరణ మార్పులకు సంబంధించిన పారిస్ ఒప్పందంనుంచి మరోసారి వైదొలగడం ట్రంప్ హానికి పరాకాష్ట. ఇప్పటికే అమెరికా డబ్ల్యూహెచ్ఓ నుండి వైదొలగింది, సమీప భవిష్యత్తులో నాటోలో ఉంటుందో లేదో తెలియదు, ఐక్యరాజ్య సమితిలో ఉంటుందో లేదో తెలియదు. పనామా కాలువ విషయంలో ట్రంప్ పోకడ అభ్యంతరకరం. ఒకప్పుడు స్పానిష్ పాలనలో ఉండి, తర్వాత కొలంబియాలో ఒక ప్రావిన్స్‌గా ఉన్న పనామా 1903లో కొలంబియా నుండి స్వాతంత్ర్యం ప్రకటించుకుని ప్రత్యేక దేశంగా అవతరించింది. పసిఫిక్, అట్లాంటిక్ మహాసముద్రాలను కలుపుతూ పనామా కాలువ నిర్మాణం జరిగింది. ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా ఖండాలను కలిపే పనామా కాలువ నిర్మాణం ఫ్రెంచివారు ప్రారంభించగా, అమెరికా దశాబ్దకాలం కష్టించి, పనామా కాలువ నిర్మాణం పూర్తిచేసింది. అప్పటి అమెరికా అధ్యక్షుడు థియోడర్ రూజ్‌వెల్ట్ హయాంలో పూర్తయిన పనామా కాలువ నిర్మాణానికి అమెరికా కృషి ఫలితమే. పనామా కాలువను అమెరికా నిర్మించినా, జిమ్మీ కార్టర్ పనామా కాలువను పనామా దేశానికి 48 ఏండ్ల క్రితం అప్పగించారు. ఈ కారణంగా పనామా కాలువపై అమెరికాకు ప్రస్తుతం ఎలాంటి అధికారం లేదు. ఇతర దేశాల మాదిరిగానే అమెరికా కూడా తన వాణిజ్య అవసరాల కోసం పనామా కాలువను ఉపయోగించుకోవచ్చు. ట్రంప్ ఆరోపిస్తున్నట్లుగా పనామా కాలువలో చైనా జోక్యం లేదని చైనా, యూరోపియన్ యూనియన్, యుఎస్‌కు పనామా కాలువతో సంబంధం లేదని ప్రస్తుత పనామా అధ్యక్షుడు జోస్ రౌల్ ములినో ఖచ్చితంగా చెప్తున్నారు. పనామా జలమార్గాన్ని వాణిజ్య అవసరాల కోసం వినియోగించే దేశాల్లో అమెరికాది ప్రథమ స్థానం, తర్వాత స్థానాల్లో చైనా, జపాన్‌లున్నాయి. పనామా కాలువను ఆక్రమించుకోవడానికి ప్రస్తుత ట్రంప్ ప్రయత్నించడం క్షంతవ్యం కాదు. యూరోపియన్ యూనియన్ పట్ల విముఖత, బ్రిక్స్ దేశాల పట్ల ఆగ్రహం ట్రంప్ అసహనాన్ని సూచిస్తున్నది. ప్రపంచ దేశాల వాణిజ్య వ్యవహారాలన్నింటిలో డాలరేతర జరగాలని అమెరికా శాసించడం విజ్ఞత కాబోదు. ప్రతి దేశం ఇతర దేశాలకు దీటుగా, ఆర్థికంగా ఎదగాలని కోరుకోవడంలో తప్పులేదు. 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' అనే ట్రంప్ తన నినాదాన్ని సాకారం చేసుకోవడానికి ప్రయత్నించడాన్ని కూడా తప్పుపట్టలేము. అయితే తన ఖజానా నింపుకోవడానికి ఇతరుల జేబులు కొట్టడమే అభ్యంతరకరం. భయపెట్టి ఇతర దేశాల సంపద కొల్లగొట్టి, ఎదురు తిరిగిన దేశాల భరతం పట్టాలనే ధోరణి సమంజసం కాదు. ఇతర దేశాలను ఆక్రమించాలనుకోవడం, ఇతర దేశాల వస్తువులపై అధిక శాతం సుంకాలు విధించడం, ఇతర దేశాల అభివృద్ధిని నాశనం చేయాలనుకోవడం అమెరికా దివాలా కోరుతనానికి నిదర్శనం. ట్రంప్ విధానాలతో విసుగెత్తిపోయిన అమెరికా మిత్రదేశాలు కూడా అమెరికాకు దీటైన ప్రత్యామ్నాయంగా ఎదగాలని ఆశించడం అత్యాశ కాబోదు. ఇప్పటికే అమెరికా డాలర్ ప్రపంచ వాణిజ్యవిపణిని శాసిస్తున్న నేపథ్యంలో చాలా దేశాల కరెన్సీ విలువ దారుణంగా తగ్గిపోతున్నది.

డాలర్ ప్రభావంతో భారత కరెన్సీ చాలా సంవత్సరాలుగా పతనంలో పయనిస్తున్నది. ఇది అభివృద్ధికి చిహ్నం కాదు. అమెరికా డాలర్‌కు ప్రత్యామ్నాయంగా బ్రిక్స్ దేశాలు స్వంత కరెన్సీ రూపకల్పనకు ప్రయత్నాలు చేయడం ట్రంప్‌కు రుచించడం లేదు. అమెరికా అధ్యక్షుడు ఉక్రెయిన్-రష్యాల మధ్య సాగుతున్న యుద్ధాన్ని నివారించలేకపోవడం హర్షించదగ్గ విషయమే. అయితే ఇందుకు అనుసరిస్తున్న పద్ధతి ఆక్షేపణీయం. ట్రేడ్ డీల్ పేరుతో ఉక్రెయిన్‌లోని రేర్ ఎర్త్ మినరల్స్ కొల్లగొట్టాలనుకోవడం, ఉక్రెయిన్ భద్రతకు హామీని ఇవ్వకపోవడం సరైన చర్య కాదు. జెలెన్ స్కీ కూడా ఆవేశంతో దౌత్య నియమాలను ఉల్లంఘించి, శ్వేత సౌధానికున్న విలువను దిగజార్చడానికి యత్నించడం అనుచితం. ఎవరు ఔనన్నా కాదన్నా ఉక్రెయిన్‌కు అండగా నిలబడనున్నానని, అమెరికా సహకారం లేనిదే జెలెన్ స్కీ సాధించేదేమీ ఉండదు. ఉక్రెయిన్ యుద్ధాన్ని సాగదీయాలనుకుంటే, ఇప్పటికే 20% భూభాగాలను కోల్పోయిన ఉక్రెయిన్ పూర్తిగా రష్యావశమయ్యే సూచనలు అధికంగా ఉన్నాయి. ఇదే సందర్భంలో అవకాశం ఉన్న ఉక్రెయిన్ బలహీనతను ట్రంప్ అవకాశంగా తీసుకోవడం సమంజసంగా లేదు. తన స్వంత బలం మీద ఆధారపడకుండా ఇతర దేశాల ఆయుధ బలంపై ఆధారపడుతూ యుద్ధం చేసిన జెలెన్‌స్కీ ఉక్రెయిన్ ప్రజల దృష్టిలో ట్రంప్‌ను, పుతిన్‌ను ధిక్కరించిన హీరోగా మిగలవచ్చు.

రష్యాతో ఇంకా యుద్ధాన్ని కొనసాగిస్తే, రాగల పరిణామాలు భయంకరంగా మారే అవకాశాలున్నాయి. పరిస్థితులు విషమిస్తే జెలెన్ స్కీని పోగొట్టుకున్నవారే దేశానికి పరిస్థితులు ఉత్పన్నం కావచ్చు.

# యోగా పితామహుడు యోగానంద

పరమహంస యోగానంద (1893 జనవరి 5- 1952 మార్చి 7) భారతీయ సన్యాసి, యోగి, ఆధ్యాత్మిక గురువు. యోగానంద అమెరికాలో స్థిరపడ్డ ప్రధాన ఆధ్యాత్మిక గురువుల్లో ప్రథముడు. తన చివరి 32 సంవత్సరాలు అమెరికాలో గడిపాడు3. శ్రీయుక్తే శ్వర్ గిరికి ముఖ్య శిష్యుడిగా, యోగాభ్యాసాన్ని పాశ్చాత్యులకు పరిచయం చేసి ఆయన భౌతిక వాదాన్ని, భారతీయుల ఆధ్యాత్మి కతను సమన్వయ పరచడంలో ప్రధాన పాత్ర పోషించాడు. అమెరికాలో ఆయన యోగా ఉద్యమంపై వేసిన ముద్ర, లాస్ ఏంజిలస్ లో ఆయన నెలకొల్పిన యోగా సంస్కృతి, ఆయనకు పాశ్చాత్య దేశాల్లో యోగా పితా మహుడిగా గౌరవ స్థానాన్ని సంపా దించి పెట్టాయి. 1927 లో అప్పటి అమెరికా అధ్యక్షుడు కాల్విన్ కూలిడ్జ్ చేత వైట్ హౌస్ ఆతిథ్యాన్ని అందుకున్న ప్రథమ భారతీయ ప్రముఖుడు కూడా ఆయనే. లాస్ ఏంజిలస్ టైమ్స్ అనే పత్రిక ఆయన్ను 20వ శతాబ్దపు మొట్టమొదటి సూపర్ స్టార్ గురువు అని అభివర్ణించింది. యోగానంద 1893, జనవరి 5 న ఉత్తరప్రదేశ్ లోని గోరఖ్‌పూర్లో ఒక సాంప్రదాయ బెంగాలీ కాయస్థ కుటుంబంలో జన్మించాడు. జన్మ నామం ముకుందలాల్ ఘోష్. చిన్న వయసు నుంచే ఆధ్యాత్మికతలో వయసుకు మించిన ఆసక్తిని, పరిణతిని కనబరిచేవాడు. పాఠశాల చదువు పూర్తయిన తర్వాత ఇల్లు వదలి వారణాసిలోని మహామండల్ సన్యాసాశ్రమం చేరాడు. 17 ఏళ్ళ వయసులో, 1910 సంవత్సరంలో శ్రీయుక్తేశ్వర్ గిరిని తన గురువుగా కను గొన్నాడు. యోగానంద శ్రీయుక్తేశ్వర్ గిరి శ్రీరాంపూర్ ఆశ్రమం లోనూ, పూరీ ఆశ్రమంలోనూ ఒక దశాబ్దం పాటు (1910–1920) శిక్షణ పొందా డు. 1914 లో కలకత్తాలోని స్కాటి ష్ చర్చి కళాశాల నుండి ఇంట ర్మీడియట్ పరీక్షలో ఉత్తీర్ణుడై 1915, జూన్ లో బి. ఎ డిగ్రీకి సమానమైన డిగ్రీని పొందాడు. కళాశాల వదిలిపెట్టిన కొన్ని వారాలకు సాంప్రదాయికంగా సన్యాసాన్ని స్వీకరించాడు. శ్రీ యుక్తేశ్వరి గిరి ఆదేశానుసారం తన సన్యాస నామాన్ని స్వచ్ఛందంగా స్వామి యోగానంద గిరిగా మార్చు కున్నాడు. 1917 లో యోగానంద బాలుర కోసం పశ్చిమ బెంగాల్ లోని దిహికలో ఒక పాఠశాల ప్రారం భించాడు. ఆ పాఠశాల అమెరికాలో యోగానంద స్థాపించిన సెల్ఫ్ రియ లైజేషన్ ఫెలోషిప్ కు భారత దేశం లో అనుబంధ పాఠశాల అయి న యోగదా సత్సంగ సొసైటీగా మారింది. అమెరికన్ యూనిటేరియన్ అసోసియేషన్ నుంచి బోస్టన్ లో జరిగే ప్రపంచ మత ఉదారవాదుల సభకు భారతదేశ ప్రతినిధిగా హాజరు కావాలని ఆహ్వానం అందింది. అందుకు గురువు శ్రీయుక్తేశ్వర్ గిరి అనుమతి కూడా వచ్చింది. 1920 లో బోస్టన్‌కు చేరుకున్న ఆయన తన ఉపన్యా సాలతో ఖండాంతర పర్యాటన చేశాడు. అంతర్జాతీయ మత సభల్లో ప్రసంగించాడు. ఆయన 1920 నుంచి 1952లో మరణించే దాకా అక్కడే ఉన్నాడు. సనాతన భారతదేశపు ఆధ్యాత్మిక బోధనలు, యోగాతత్వం, ధ్యాన సాంప్రదా యాలను ప్రచారం చేయడం కోసం సెల్ఫ్ రియలైజేషన్ ఫెలోషిప్ అనే సంస్థను ప్రారంభించాడు. యోగా నంద తర్వాతి నాలుగు సంవత్సరా లు బోస్టన్ లో గడిపాడు. 1924 లో సందేశాలిస్తూ ఖండాంతర పర్యటన లు చేశాడు. చివరికి 1925లో లాస్ ఏంజిలస్ లో స్థిరపడ్డాడు. అమెరి కాలో ఎక్కువ భాగం గడిపిన హిందూ ఆధ్యాత్మిక గురువుల్లో యోగానంద ప్రథముడు. తర్వాత 25 సంవత్సరాల పాటు అక్కడే ప్రాంతీయంగా మంచి గుర్తింపు పొందడమే కాక తన ప్రభావాన్ని విశ్వవ్యాప్తం చేశాడు. ఒక సన్యాసి సాంప్రదాయాన్ని ఏర్పాటు చేసి శిష్య పరంపరకు శిక్షణ ఇవ్వడం ప్రారంభించాడు. అక్కడక్కడ పర్యటిస్తూ బోధనలు చేశాడు. కాలిఫోర్నియాలోని పలు ప్రాంతాల్లో తమ సంస్థ కోసం ఆస్తు లు కొన్నాడు. వేలాది మందిని క్రియా యోగంలోకి ప్రవేశింప జేశాడు. 1935లో భారత దేశానికి వచ్చిన ఆయన, మహాత్మా గాంధీని కలిసి ఆయనను క్రియాయోగంలో ప్రవేశ పెట్టాడు. ఆనందమయి మా, నిరాహార యోగిని గిరిబాల, భౌతిక శాస్త్రవేత్త సి. వి. రామన్, లాహిరీ మహాశయుల శిష్యులను కొంత మందిని కలిశాడు. తిరిగి లండన్ వెళ్ళి, యోగా తరగతులు నిర్వహించాడు. చారిత్రాత్మక స్థలాలు దర్శించాడు. అక్కడ నుంచి 1936 అక్టోబరున అమెరికాకు వెళ్ళి, అమెరికన్ శిష్యులను కలుసుకుని తన బోధన లు, రచనా కార్యక్రమాలు తిరిగి కొనసాగించాడు. 1952 కల్లా ా=ఖీ భారతదేశం లో, అమెరికాలో కలిపి 100కి పైగా కేంద్రాలు నెలకొల్పారు. ప్రస్తుతం అమెరికాలో ప్రతి ప్రధాన నగరం లోనూ కేంద్రాలున్నాయి. ఆయన బోధించిన సరళ జీవనం, ఉన్నత మైన ఆలోచన అనే విధా నం వివిధ నేపథ్యాలు కలిగిన పలు వురు జిజ్ఞాసువులను ఆకట్టుకుంది. 1946 లో ఆయన రాసిన ఒక యోగి ఆత్మకథ విమర్శకుల ప్రశంసల నందుకుని ఇప్పటిదాకా 40 లక్షల ప్రతులకుపైగా అమ్ముడు పోయింది. హార్పర్ కోలిన్స్ సంస్థ 20వ శతాబ్దపు అత్యంత ప్రజాదర ణ పొందిన 100 పుస్తకాల్లో ఈ పుస్తకాన్ని చేర్చింది. ఈ పుస్తకం క్రమం తప్పకుండా అనేక పున ర్ముద్రణలు జరుపుకుని అనేక లక్షల మంది జీవితాలను మార్చినదిగా పరిగణించ బడుతోంది. 1946 లో ఆయన అమెరికాలో మారిన వలస చట్టాల ప్రకారం పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకోగా, 1949లో అంగీకరించ బడి అధికారికంగా అమెరికా పౌరుడయ్యాడు. 1952 మార్చి 7 న యోగానంద అమెరికాలో భారత రాయబారి వినయ్ రంజన్ సేన్ గౌరవార్థం లాస్ ఏంజిలెస్ లోని బిల్ట్‌మోర్ హొటల్లో ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నని, తన ఉపన్యా సం ముగించి, తాను రాసిన మై ఇండియా నుంచి కొన్ని వాక్యాలు చదివాక, తన చూపును ఆజ్ఞా చక్రంపై కేంద్రీకరించాడు. వెంటనే ఆయన శరీరం నేలమీద పడి పోయింది. ఆయన అనుచరులు తమ గురువు మహాసమాధి చెందినట్లు ప్రకటించారు. 1946 లో ఆయన ఆత్మకథను ఆటోబయోగ్రఫీ ఆఫ్ ఎ యోగి అనే పేరుతో ఆంగ్లంలో రాశాడు. ఈ పుస్తకం 50 పైగా భాషల్లోకి అనువాదమైంది. తెలుగులో ఒక యోగి ఆత్మకథ పేరుతో అనువదించారు. 1999 లో జరిపిన సర్వేలో ఈ పుస్తకం 20 వ శతాబ్ద పు అత్యుత్తమ ఆధ్యాత్మిక గ్రంథా ల్లో ఒకటిగా, స్థానం పొందింది. యోగదా సత్సంగ సొసైటీ ఆఫ్ ఇండియా 1917 లో యోగానంద భారత దేశంలో స్థాపించిన సంస్థ. దీన్నే 1920 లో సెల్ఫ్ రియలైజేషన్ ఫెలోషిప్ పేరుతో అమెరికాకు విస్తరించారు. ా=ఖీ/ ాూ ప్రధాన కార్యాలయం లాస్ ఏంజిలెస్ లో ఉంది. ఈ సంస్థకు ప్రపంచ వ్యాప్తంగా 500 కి పైగా దేవాల యాలు, కేంద్రాలు ఉన్నాయి. 175 దేశాల నుంచి ఈ సంస్థలో సభ్యులు ఉన్నారు. భారత దేశంలో ాూ 100 కి పైగా కేంద్రాలు, ఆశ్రమాలను నడుపుతోంది. నవంబరు 15, 2017 న భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, జార్ఖండ్ గవర్నరు ద్రౌపది ముర్ము, ముఖ్య మంత్రి రఘుబర్ దాస్‌తో కలిసి రాంచీలోని యోగదా సత్సంగ శాఖను సందర్శించారు. పరమహంస యోగానంద జ్ఞాపకంగా 1977 లో భారత ప్రభుత్వం ఆయన పేరున తపాలా బిళ్ళను విడుదల చేసింది.

మార్చి 7, 2017 నాడు భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, యోగదా సత్సంగ సొసైటీ ఆఫ్ ఇండియా 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మరో స్మారక తపాలా బిళ్ళను విడుదల చేశారు.

# స్మార్ట్‌ఫోన్ ప్రాణమిత్రుడైన శత్రువా!

స్మార్ట్ ఫోన్ లేని వాడు నేటి డిజిటల్ యుగపు మనిషే కాదు అనే విపరీతమైన రోజులు వచ్చాయి. ఇంటర్నెట్ వాడకపోతే మానసిక దిగులు పెరుగుతుంది. వాట్సాప్, ఫేస్‌బుక్‌లు చూడకపోతే ముద్ద దిగడం లేదు. స్మార్ట్ ఫోన్ జేబులో లేక పోతే క్షణం గడవడం లేదు. స్మార్ట్ ఫోన్‌ను ఇంట్లో మరచిపోతే ఊపిరి ఆగినంత పని అవుతుంది. అన్నింటి కన్నా స్మార్ట్ ఫోన్ మిన్న అయిపోయింది. ఇటీవల విదేశీ విశ్వవిద్యాలయం చేసిన సర్వేలో ఆసక్తికరమైన, ప్రమాదకరమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి. తమ ఆప్త మిత్రుల కన్న స్మార్ట్ ఫోన్ మిన్న అని 37 శాతం మంది అభిప్రాయపడగా, తమ తల్లిదండ్రుల కన్న స్మార్ట్ ఫోన్ ముఖ్యమని 29 శాతం యువత తెలుపడం మన స్మార్ట్ ఫోన్ బలహీనతను స్పష్టం చేస్తున్నది. మూడు నెలల పిల్లాడు సహితం స్మార్ట్ ఫోన్ బొమ్మ చూపకపోతే ముద్ద మింగడం లేదు. మన ముఖ్యమైన విధులను సహితం పక్కన పెట్టి స్మార్ట్ ఫోన్ సామాజిక మాధ్యమ సాగరంలో ఈదుతున్నాం. నేడో రేపో స్మార్ట్ ఫోన్ సొరచేపగా మారి మన భవిష్యత్తును మింగేయ చూస్తున్నది. స్మార్ట్ ఫోన్ ఎంత మాయ చేస్తున్నది ? నాతో నేను మాట్లాడడమే ఎప్పుడో మానేసా. అమ్మనాన్నలతో ముచ్చట్లు లేవు, స్నేహితులు పలుచబడుతున్నారు. ఒంటరితనం మానసిక వ్యాధిగా మారుతున్నది. చికాకు పెరుగుతున్నది. అన్నం తినాలని పించదు. మైదాన ఆటలు అంతరించి పోతున్నాయి. ఏకాగ్రత మంటగలుస్తున్నది. మానవ సంబంధాలు పలుచబడి పోతున్నాయి. భార్య సహితం పరాయి స్త్రీగా మిగిలిపోతున్నది. భార్యను భర్తకు, తల్లిని పిల్లకు, తండ్రిని కొడుక్కు, విద్యార్థిని చదువుకు దూరం చేస్తున్నది. తల్లితండ్రులు అవసరాలను తీర్చే యంత్రాలుగా మారిపోయారు. స్మార్ట్ ఫోన్ ప్రమాదకరంగా మారి మానసిక, సమయ ఒత్తిడిని పెంచుతూ, ఆదుర్దా, నిరాశ, అనవసర ఆవేశాలకు ఆజ్యం పోస్తున్నది. మన సాధారణ ప్రవర్తనను కొన్ని మాసాల్లో మార్చివేయగల అతి తెలివిగల ఎలక్ట్రానిక్ సాధనంగా స్మార్ట్ ఫోన్ ఫోజులు కొడుతున్నది. ముఖ్యమైన పనిలో నిమగ్నమైన మరు క్షణమే ఫోన్ రింగ్ లేదా సామాజిక మాధ్యమ అలెర్ట్స్ మన దృష్టిని లాగేసుకుంటున్నాయి. "ఆలిని వదలగలను కాని నా అందాల ఫోన్ సుందరిని వదలలేను" అనే అకాలాలు వచ్చాయి. మనీ పర్సు కూడా అవసరం లేదంటూ స్మార్ట్ ఫోన్ కాలర్ ఎగరేస్తున్నది, మనిషిని కట్టు బానిసను చేస్తున్నది. మన స్మార్ట్ ఫోన్ హిత శత్రువును జేబులో, టేబుల్ మీద, కప్ బోర్డులో లేదా చాలా దూరంగా పెట్టి మీ పనులు చేయడం ప్రారంభించండి. మీకే అర్థం అవుతుంది, ఏది మనకు విజయాన్ని, అధిక ఉత్పాదకతను పెంచుతుందో లేదా ఏది వైఫల్యాలను అంటకడుతుందో తెలుస్తుంది. స్మార్ట్ ఫోన్ జేబులో ఉన్నపుడు పని అసలే జరగదు. జేబుపై పెడితే 25 శాతం జరుగుతుంది. డ్రాలో వేస్తే 40 శాతం ఫలితాలు నమోదు అవుతాయి. దూరం పెడితే మన సామర్థ్యానికి తగిన గరిష్ట ఉత్పాదకత రికార్డు అవుతుంది, విజయాలను వెంట వెంటనే బహుకరిస్తుంది. అనగా ఫోన్ దూరం అయిన కొద్దీ విజయాలు మనకు దగ్గరవుతాయి. విధి నిర్వహణ లేదా చదుకునే సమయాల్లో స్మార్ట్ ఫోన్/సందేశాలు/కాల్స్ అందనంత దూరంగా, ఆఫ్ చేసి పెట్టండి. సన్నిహిత వాట్సాప్ గ్రూపుల మినహా ఇతర అనవసర గ్రూపుల నుండి తొలగిపోదాం. వార్తల యాప్‌లను సాయంత్రం వరకు దూరం పెడదాం. అతి ముఖ్యమైన కాల్స్ మాత్రమే చేద్దాం లేదా రిసీవ్ చేసుకుందాం. విడియో గేమ్స్, ఆడియో వ్యర్థ సమాచారాలకు దూరంగా ఉందాం. మనకు అత్యవసరం అనుకున్నపుడు మాత్రమే అవసర సమాచారం కోసం గూగులమ్మ తలుపులు తెరుద్దాం. ప్రతి అనవసర ప్రకటనలు లేదా సూచనలకు సమాధానాలు ఇవ్వవద్దు. అవసరమైన ఆడియో లేదా వీడియోలను మాత్రమే ఉపయోగిద్దాం. సామాజిక మాధ్యమాలు మన మెదడును తినేస్తున్నాయి. మనల్ని బుద్ధిహీనులుగా మారుస్తున్నాయి.

స్మార్ట్ ఫోన్ సాధనానికి స్వల్ప విరామమిచ్చి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేయడం, వ్యాయామానికి సమయం ఇవ్వడం, స్నేహితులతో అప్పుడప్పుడూ మాట్లాడడం, అమ్మనాన్నల ఆప్యాయతను రుచి చూడడం, భార్యతో కాలక్షేపం చేయటం, ఏకాగ్రతతో చదవడం లాంటివి చేసి చూడండి, మీకే తెలుస్తుంది మీ మనసు ఎంత తేలిక అవుతుందో, మానసిక ఒత్తిడి దిగిపోతుందో. అందరికీ రోజుకు 1440 నిమిషాలు, 86,400 సెకన్ల సమయం మాత్రమే ఉంది. మీరు దీనిలో ఎంత సమయం స్మార్ట్ ఫోన్ వినియోగానికి వెచ్చిస్తున్నారో అంచనా వేయండి. కొంత మంది 500 నుండి 600 నిమిషాల వరకు ఫోన్‌తోనే సంసారం తేస్తున్నారు. వీరికి అపజయాలు నిర్ధారణ అయినాయి. ఫోన్‌ను పక్కన పెట్టి పనిపై ఏకగ్రత పెంచండి. ఫోన్లో వ్యాసాలు/పుస్తకాలు చదవండి, విద్య విషయాలు సేకరించండి, ఆధునిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకొండి. స్మార్ట్ ఫోన్ అంటే అందరికీ ఇష్టమే, కాని అది మన భవిష్యత్తును పాతాళంలోకి నెట్టకుండా చూసుకొండి. ఫోన్ యాప్ ఆవిష్కర్తలు చాలా తెలివైన వారు. మన ఏకాగ్రతకు తెలియకుండానే గాలం వేసి లాగేసుకోగలవు. స్మార్ట్ ఫోన్ పై పరిమిత ప్రేమను పెంచుకోండి. మన ఉత్పాదకత మన ధ్యాస మీదనే ఆధారపడుతుంది. మన ధ్యాసను ఫోన్ ధ్వసం చేసి మనల్ని చేతగాని వాడిగా మారుస్తుంది. మన ధ్యాసను మన అదుపులో పెట్టుకోవడానికి స్మార్ట్ ఫోన్‌కు పని వేళల్లో తాత్కాలికంగా విడాకులు ఇవ్వండి. జీవితాలను విజయ తోరణాలతో నింపేయండి. స్మార్ట్ ఫోన్ సాధనాన్ని స్మార్ట్‌గా వాడండి, స్మార్ట్‌గా సమాజంలో/చదువుల్లో/విధి నిర్వహణలో పేరు తెచ్చుకోండి.

# పుస్తకాలే అయన ప్రాణం.. పుస్తకాలయాలే ఆయన లోకం...

పుట్టడం, గిట్టడం సహజం. జీవించినంతలో సమాజానికి ఉపయోగపడే పనులు చేయడం మానవ ధర్మం. కొంతమంది మాత్రమే తమ జీవితంలో ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేసి తమ జీవితాన్నే ఫణంగా పెట్టి మానవ జాతిలో చిరస్థాయిగా తరతరాలుగా నిలిచిపోతారు . అలాంటి వాటిలో…అయ్యంకి వెంకట రమణయ్య ముఖ్యులు. గ్రంథాలయోద్యమం అనగానే గుర్తుకు వచ్చే పేరు ఆయనదే. "పుస్తకాలే ప్రాణంగా…పుస్తకాలయాలే లోకం"గా జీవించిన వ్యక్తి. గ్రంథాలయోద్యమ పితా మహుడుగా, జీవితాంతం గ్రంథాలయాల అభివృద్ధి కోసం, అద్వితీయంగా, అనన్యంగా, అహర్నిశలూ, బహుముఖ సేవలందించిన గొప్ప వ్యక్తి అయ్యంకి. అయ్యంకి వెంకట రమణయ్య (1890–1979) గ్రంథాలయోద్యమ కారుడు, ఆయుర్వేదం, ప్రకృతి వైద్యంలో సిద్ధహస్తులు, పత్రికా సంపాదకులు. గ్రంథాలయ సర్వస్వము అనే పత్రికను నిర్వహించారు. అయన గ్రంథాలయ ఉద్యమంలో జీవితాంతం విశేష కృషి సల్పి గ్రంథాలయ పితా మహుడుగా పేరు గాంచారు. ఆయన తూర్పు గోదావరి జిల్లా రామచంద్రపురం తాలూకా అనపర్తి నియోజక వర్గంలోని బిక్కవోలు మండంలో గల కొంకుదురు గ్రామంలో 1890 జూలై 24న జన్మించారు. అయన తల్లిదండ్రులు వెంకటరత్నం, మంగమాంబ. తండ్రి వెంకతరత్నం గారు నీటిపారుదల శాఖలో ఉద్యోగి. 1907లోప్రముఖ జాతీయ నాయకుడు, స్వాతంత్ర్య సమర యోధుడు బిపిన్ చంద్రపాల్ రాజమండ్రి లో భారత స్వాతంత్ర్య సమరంలో యువకులు పాల్గొనాలని ఇచ్చిన ఉత్తేజ పూరితమైన ఉపన్యాసాలు విని, చదువుకు స్వస్తి చెప్పి దేశ సేవకు జీవితాన్ని అంకితం చెయ్యటానికి 'రక్షాబంధనం ' కట్టుకొన్నారు. దేశంలోని పలు సమస్యలకు ముఖ్యకారణం అవిద్య, అజ్ఞానం అని గ్రహించి, అందరినీ విద్యా వంతులుగా, జ్ఞాన వంతులుగా చెయ్యాలని అందుకు గ్రంథాలయాల వ్యాప్తి అవసరమని భావించి ఆ ఉద్యమ వ్యాప్తికి కంకణం కట్టుకొన్నారు. 1910 లో బందరులో "ఆంధ్ర సాహిత్య పత్రిక"ను స్థాపించి, గురజాడ, రాయప్రోలు, శ్రీశ్రీ రచనలను ప్రచురించి, ప్రజలను చైతన్య వంతం చేశారు. 1914లో ప్రథమ ఆంధ్ర రాష్ట్ర గ్రంథ భాండాగార ప్రతినిధుల మహాసభలను విజయ వాడలో నిర్వహించారు. 1919, నవంబరు-14న, చెన్నైలో తొలి "అఖిల భారత పౌర గ్రంథాలయం" ను స్థాపించి, మొదటి మహా సభను నిర్వహించారు. అలాగే 'గ్రంథాలయ సర్వస్వం' (త్రైమాసిక), 'ఇండియన్ లైబ్రరీ జర్నల్', 'కొరడా', 'ప్రకృతి', 'ది ఇండియన్ నేచురోపతి,' 'సహకారం', 'దివ్యజ్ఞాన దీపిక' వంటి పత్రికలను కూడా నడిపారు. 1911లో విజయవాడలో రామమోహన గ్రంథాలయ స్థాపనకు తోడ్పడ్డాడు. 1914లో విజయ వాడలో ఆంధ్రదేశ గ్రంథ భాండాగార, ప్రతినిధుల గ్రంథాలయ మహా సభలు జరిపి భారత దేశంలో తొలిసారిగా గ్రంథాలయ సంఘాన్ని, 1915లో సంఘ పక్షాన గ్రంథాలయ సర్వస్వం పత్రికను స్థాపించడానికి తోడ్పడ్డారు. 1919లో అఖిల భారత పౌర గ్రంథాలయ సంఘాన్ని స్థాపించి, 1924లో ఆ సంఘ పక్షాన ఇండియన్ లైబ్రరీ జర్నల్ అనే ఆంగ్ల పత్రికను ప్రారంభించారు.

1934-1948 మధ్యకాలంలో గ్రంథాలయ యాత్రలను అపూర్వమైన స్థాయిలో పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలలో కార్యదర్శులు నిర్వహించారు. వీరి మూలంగా వందల సంఖ్యలో కొత్త గ్రంథాలయాలు ఏర్పడ్డాయి. మూసి వేసినవి పునరుద్ధరించ బడ్డాయి. 1920, 1934లలో గ్రంథాలయ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆంధ్రదేశంలోని ప్రతి గ్రామం పర్యటించారు. అయ్యంకి వెంకట రమణయ్య, దేశంలో పూర్తిస్థాయిలో గ్రంథాలయాలను నెలకొల్పిన వ్యక్తిగా పేరు గడించారు. ఆంధ్రభాషాభివర్ధినీ మండలి, ఆంధ్రపరిషత్తు, కళాపీఠము, దివ్యజ్ఞాన చంద్రికామండలి అనే గ్రంథమాలలను స్థాపించి అనేక ఉత్తమ రచనలను తెలుగు పాఠకులకు అందించారు. గ్రంథాలయోద్యమంలో ఆయన సేవలను గుర్తించి, ఆయన సప్తతి మహోత్సవ సందర్భంగా, గుడివాడలో 'సరస్వతీ సామ్రాజ్య ప్రతిష్ఠాపనాచార్య' బిరుదుతో సత్కరించారు. 1919లో అఖిల భారత పౌర గ్రంథాలయ సంఘాన్ని స్థాపించిన రోజును భారత గ్రంథాలయ సంస్థ గుర్తించి నేషనల్ లైబ్రరీ డే (జాతీయ గ్రంథాలయ వారోత్సవ దినం)"గా దేశమంతటా 1968 నుంచి ప్రతి సంవత్సరం జాతీయ గ్రంథాలయ1968 నుండి, "జరుపుకొను చున్నారు. ఆయన అనేక గ్రంథాలయ యాత్రలను నిర్వహించి, "ప్రజా గ్రంథాలయమే ప్రజల విశ్వవిద్యాలయం" అని చాటి చెప్పారు. భారత ప్రభుత్వం ఆయన గ్రంథాలయ సేవలకు స్పందించి 1972 లో 'పద్మశ్రీ'తో .గౌరవించింది. గ్రంథాలయ పితామహ, గ్రంథాలయోద్ధారక, గ్రంథాలయ విశారద, సరస్వతీ సామ్రాజ్య ప్రతిష్ఠాపనాచార్య, సరస్వతీ రమారమణ, గ్రంథాలయ విశారద వంటి బిరుదులు అందుకున్నారు. 1977లో ప్రొఫెసర్ కౌలా అంతర్జాతీయ స్వర్ణపతకం పొందారు.

# నిన్నటి కథ .. కొనసాగింపు

(రెండో భాగం)

ఏదైనా సాంప్రదాయ కుటుంబం, మంచి ఉద్యోగం చేసుకుంటున్న పిల్లాడెవరైనా వుంటే చెప్పు.. నా స్థితిగతులు నీకెరికేగా..... ఔను.. జాతకంలో కొంచెం కుజ దోషం వుందట.. ఏవో పరిహార పూజలు చేయించింది మీ మరదలు.. అక్క చెప్పిందా..." అన్నాడు కాంతారావు..ఆ ఫోను లో ఆ అన్నగారి మాటలు అన్నీ విని విసురుగా ఫోను పెట్టేసారు కాంతారావు గారు.." ఏంటండీ.. ఏమన్నారు మీ అన్నయ్య? " అంది సుమతి." నీ మాట విని వాడికి ఫోన్ చేసాను... నా చెప్పుతో నన్ను కొట్టుకోవాలి. " మంచోడు మంచోడు అంటే చంకనెక్కి కూర్చున్నాడట " ఇలాంటి వాడే..." కళ్ళు నెత్తికెక్కాయి " వాడికి." కడుపు నిండిన బేరాలూ.. కడుపు నిండిన మాటలూ " వాడివి. ఏంటో ఆడపిల్ల పెళ్ళి చేయడమంటే ఆషామాషి అనుకుంటున్నావా.. నాకంటే ఏదో అదృష్టం పుచ్చి మంచి సంబంధాలు వచ్చాయి... అందరికీ అలా రావు... ఎవరైనా పెళ్ళిళ్ళ పేరయ్యని పట్టుకుని " గంతకి తగిన బొంతని " వెతుక్కోమని ఉచిత సలహా పడేసాడు." ఊరుకున్నంత ఉత్తమం లేదు.. బోడిగుండంత సుఖం లేదు" అనవసరంగా వీడికి ఫోన్ చేసి మాటలనిపించుకున్నాను " అన్నాడు కాంతారావు కోపంగా...

" అయ్యో.. అంతమాటన్నారా.. అయినా..

" జిహ్వాకో రుచి.. పుర్రెకో బుద్ధి" పోన్లెండి ఆయన బుద్ధి బయటపడింది... " తలని తన్నేవాడొకడుంటే.. తాడిని తన్నేవాడొకడుంటాడు. " ఏదో ఒకరోజు ఆయనకే తెలుస్తుంది..

" ఉంగరాల చేత్తో మొట్టేవాడు చెపితేనే మాట వింటారు కొందరు

".. మీరేం బాధ పడకండి.. " మనసుంటే మార్గముంటుంది

".. ఆ దేముడే మనకే దారి చూపిస్తాడు...

చెప్పడం మర్చిపోయా... నా చిన్నప్పటి స్నేహితురాలు పార్వతి నిన్న గుళ్ళో కనపడింది... తనకి తెలిసిన మంచి సంబంధాలు వున్నాయట.. ఈ రోజు మనింటికి వచ్చి.. చెపుతానంది.. చూద్దాం తనేం చెపుతుందో... " విత్తం కొద్దీ వైభోగం " పైగా మన దురదృష్టం " గోరు చుట్టు మీద రోకలి పోటు " లాగా పిల్లకి కుజ దోషం ఒకటీ... అది కప్పెట్టి పెళ్ళి చేయలేం కదా.. " అంది సుమతి...

మర్నాడు.. కాంతారావు ఆఫీసు నుంచి.. రాగానే.. ఆనందంతో ఎదురెళ్ళింది సుమతి.

" ఏంటోయ్.. " గాజుల కళకళ గుమ్మంలోనే ఎదురయిందీ

".... కొంపతీసి ఉదయం నేను" నక్కని తొక్కివెళ్ళినట్టున్నాను".. అన్నారు.. చమత్కారంగా..

" పోండి.. మీకెప్పుడూ వేళాకోళమే... ముందిలా కూర్చుని కాఫీ తాగుతూ... నేను చెప్పే విషయం సావధానంగా వినండి. " ఈ చెవితో విని ఆ చెవితో వదిలేయకండి" అంది. " ముద్దొచ్చినపుడే చంకకెక్కాలి " అనుకుంది సుమతి.బుద్ధి గా చేతులుకట్టుకుని.." ఆ.. ఇప్పుడు చెప్పు " అన్నాడు కాంతారావు...

" నిన్న.. నా స్నేహితురాలు పార్వతి గురించి చెప్పాను కదా.. మధ్యాహ్నం తను వాళ్ళాయనని తీసుకుని మన ఇంటికి వచ్చింది. ఆయన బేంక్ మేనేజర్ గా పని చేసి రిటైర్ అయ్యారట. పెద్దది ఆడపిల్ల కి పెళ్ళి చేసి.. కాపురానికి పంపారట. తర్వాత అబ్బాయి.. వేణుగోపాల్.. ఎమ్ బి ఏ.. చేసి.. ఏదో పెద్ద కంపెనీలో చేస్తున్నడట. నెలకి లక్ష పైగా జీతం వస్తోందట. గుళ్ళో నాతో పాటు మన వల్లిని చూసారు కదా...

పిల్ల చక్కగా" చిదిమి దీపం పెట్టుకునేలా వుంది" అనిపించిందట. వాళ్ళ వేణుకి చేసుకుంటామని అడిగారు. అప్పటికీ చెప్పాను.. " అంగట్లో అన్నీ వున్నా అల్లుడి నోట్లో శని వుంది" అన్న చందాన పిల్ల జాతకంలో కుజ దోషం గురించి కూడా చెప్పాను. వాళ్ళ కి అలాంటి పట్టింపులు ఏవీ లేవనీ... అసలు జాతకాల గురించి ఆలోచించమనీ.. పైగా పెట్టుపోతలు కూడా ఏవీ ఆశించమనీ.. చెప్పారు.

నాకైతే... " వెతకపోయిన తీగ కాలికి చుట్టుకున్నట్టు " అనిపించింది. " ఉయ్యాల్లో బిడ్డని పెట్టుకుని ఊరంతా తిరిగామేమో" మనం. ఇదిగో అబ్బాయి ఫోటో ఇచ్చి వెళ్ళారు.. చూడండి.. దొరబాబు లా వున్నాడు.. మన శ్రీవల్లి పక్కన చూడ ముచ్చటగా వుంటాడనిపించింది. ఇంతకంటే గొప్ప సంబంధం మనం తేలేము.. ఆలోచించండి.." అంది సుమతి.. సంబరంగా...

" నువ్వు చెప్పిందీ నిజమే సుమతీ... పిల్లాడు బావున్నాడు.. కుటుంబమా.. మంచి సాంప్రదాయ కుటుంబమని చెపుతున్నావు.. పైగా వాళ్ళకి ఈ జాతకాల పట్టింపు లేకపోవడం... నిజంగా మన అదృష్టం. సరే మరి.. రేపు వెళ్ళి మంచీ చెడూ మాట్లాడి వద్దాం. " అన్నాడు కాంతారావు.

**సీతా రామ రాజు సనపల**

# పక్కదారి పడుతున్న ఇంటిఅవసర గ్యాస్ సిలిండర్లు

## పట్టించుకోని సంబంధిత అధికారులు





లక్షెట్టిపేట, మార్చ్ 6 (వుదయం ప్రతినిధి): 'డెమెస్టిక్' గ్యాస్ సిలిండర్ల దందా కమర్షియల్ గా సాగుతోంది. ఇంటి వసరాలకు వినియోగించే(డొమెస్టిక్) సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు యథేచ్ఛగా పక్కదారి పడుతున్నాయి. ఈ వ్యాపారం ప్రధానంగా లక్షెట్టిపేట పట్టణ, మండల కేంద్రాల్లో కూడా జోరుగా నడుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా హోటళ్లలో, ఫాస్ట్ఫుడ్, టిఫిన్ సెంటర్లలో ఇంటి సిలిండర్లను దొంగచాటున వినియోగిస్తున్నారు. తద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతుండడంతో పాటు కొంత మంది ఏజెన్సీదారులకు తెరచాటున ఇదొక వ్యాపారంగా మారిపోయింది. అయితే డొమెస్టిక్ సిలిండర్లు దుర్వినియోగం కాకుండా నిరంతరంగా తనిఖీలు చేయాల్సిన సివిల్ సప్లయ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు ఇటీవల కాలంలో తనిఖీలు చేయడం మానేశారు. ఎప్పుడో ఒకసారి తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారు. హోటళ్లు, ఫాస్ట్ఫుడ్ సెంటర్లు, ఇతర వ్యాపారాలకు కమర్షియల్ సిలిండర్లు మాత్రమే వినియోగించాలని ప్రభుత్వ నిబంధనలున్నాయి. అయితే చాలామట్టుకు ఆ నిబంధనలను పాటించడం లేదు. ఎందుకంటే 19 కిలోలు గల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ప్రసుతం రూ. 1900 వరకు ఉంది. అదే గృహావసరాలకు వినియోగించే సబ్సిడీ గ్యాస్ సిలిండర్ 14.6 కిలోలు ఉండి దాని విలువ రూ.875 వరకు ఉంది. ఈ లెక్కన కమర్షియల్ సిలిండర్కు వెచ్చించే డబ్బులతో రెండు డొమెస్టిక్ సిలిండర్లు కొనుగోలు చేయవచ్చు. గ్యాస్ కూడా ఎక్కువగా వస్తుంది. దీంతో హోటళ్లలో, ఫాస్ట్ఫుడ్ కేంద్రాల నిర్వాహకులు ఇది తప్పని తెలిసినా డొమెస్టిక్ గ్యాస్ను వినియోగించడానికివక్ర మార్గాన్ని ఆచరిస్తున్నారు. గ్యాస్ ఏజెన్సీలను మచ్చిక చేసుకుని డొమెస్టిక్ సిలిండర్లను సబ్సిడీ లేకుండా కొనుగోలు చేస్తున్నారు. ఇటు గ్యాస్ ఏజెన్సీలకు కూడా ఒక్కో సిలిండర్పై రూ.300 వరకు లాభం రావడంతో 'డొమెస్టిక్' దందా 'మూడు పువ్వులు, ఆరు కాయలు'గా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# కేసీఆర్ చిత్రపటానికి రైతుల జలాభిషేకం

## .జైతెలంగాణ నినాదాలతో హోరెత్తిన సీతరామప్రాజెక్టు కాలువ....



చంద్రుగొండ, మార్చి06: (వుదయం ప్రతినిధి) తెలంగాణ రైతుల కష్టాలు తెలిసిన నాయకుడు కేసీఆర్ అని రైతులు, ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు ముక్తకంఠంతో నినదించారు. గురువారం భద్రాద్రికొత్తగూడెం జిల్లా, చంద్రుగొండ మండలం, బెండాలపాడు గ్రామ శివారులోని సీతరామప్రాజెక్టు కాలువకు నీళ్లు వచ్చిన సందర్భంగా రైతులు, ప్రజాప్రతినిధులు, కేసీఆర్ చిత్రపటానికి జలాభిషేకం, అనంతరం పాలాభిషేకం చేశారు. జైతెలంగాణ నినాదాలతో కాలువ చుట్టూ ప్రక్కల ప్రాంతం హోరెత్తింది. ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతుల కోసం మాజీ సిఎం కేసీఆర్ సీతరామప్రాజెక్టు నిర్మాణం తలపెట్టితే నాటి ప్రతిపక్ష కాంగ్రెస్ అడ్డంకులు సృష్టించిందని, కాలువ నిర్మాణం జరగకుండా, భూసేకరణను సైతం అడ్డుకుందన్నారు. నేడు మాత్రం మేమే ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేశామని గప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని రైతులు విమర్శించారు. కాంగ్రెస్, పార్టీ సీతరామ ప్రాజెక్టు కోసం చేసిందేమిలేదన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు కొణకండ్ల వెంకటరెడ్డి, దారా బాబు, సంగొండి రాఘవులు, నరుకుళ్ల సత్యనారాయణ, నల్లవోతు వెంకటనారాయణ, భూపతి ధనలక్ష్మి, మేడా మోహన్రావు, సూర వెంకటేశ్వరరావు, కుంజా సావిత్రి, పూసం వెంకటేశ్వర్లు, పాండ్ల అంజన్రావు, సత్తి నాగేశ్వరరావు, భూపతి శ్రీనివాసరావు, కల్లెం వెంకటేశ్వర్లు, చాపలమడుగు రామరాజు, సయ్యద్ బాద్, యాకూబ్, నరుకుళ్ల అప్పాజి, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు...



జుక్కల్ నియోజకవర్గం
శ్రీ జగద్గురు నరేంద్ర మహారాజ్ గారి ఆశీర్వాదం తీసుకున్న గౌరవ జుక్కల్ BRS పార్టీ మాజీ శాసన సభ్యులు హన్మంత్ శిందే మరియు బి ఆర్ ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# శ్రీనివాస్ దశ దిన కార్యక్రమానికి హాజరై నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు



మధిర మార్చి 6 (వుదయం ప్రతినిధి) మల్లు భట్టి విక్రమార్క వ్యక్తిగత సహాయకుడు పిఎ శ్రీనివాస్ గుండెపోటుతో దివంగతులు అవ్వటం జరిగింది . గురువారం దశ దిన ఖర్మ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని ఆయన చిత్ర పటానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు ధార బాలరాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రవికుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కర్నాటి రామారావు, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకులు చైతన్య తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

# హర్షం వ్యక్తం చేస్తున్న దేశరాజ్ పల్లి గ్రామస్తులు



కమలాపూర్ మార్చి 6 (వుదయం ప్రతినిధి) కమలాపూర్ మండలంలో కాంగ్రెస్ ప్రభుత్వం దేశరాజ్ పల్లి గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంచుకొని పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నది అందులో భాగంగా గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల యొక్క ఇందిరమ్మ ఇండ్లకు కొబ్బరికాయ కొట్టి భూమి పూజ నిర్వహించిన కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి రవీందర్ ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవం సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం పనులు ప్రారంభించడం తో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా గ్రామస్తులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ మరియు నియోజకవర్గ ఇన్చార్జ్ ఒడితల ప్రణవ్ బాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దేశిని ఐలయ్య డైరెక్టర్లు సముద్రాల కృష్ణ గట్టు శ్రీధర్ కిన్నెర కృష్ణమూర్తి మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు చరణ్ పటేల్ బొల్లం రాజిరెడ్డి మిట్టపల్లి సుభాష్ సముద్రాల రమేష్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# కనగల్ లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్త బ్రాంచ్ ప్రారంభం

## యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్త బ్రాంచ్ ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి





నల్గొండ మార్చి 06(వుదయం ప్రతినిధి): కనగల్ లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్త బ్రాంచ్ ఏర్పాటు వల్ల కనగల్ తో పాటు, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం ఆమె కనగల్ మండల కేంద్రంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్త శాఖను ప్రారంభించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కనగల్ మండల శాఖ నల్గొండ జిల్లాలో 25వ ది అని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ ఆర్. సత్యనారాయణ తెలిపారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తెలంగాణ చీఫ్ జనరల్ మేనేజర్ కారే భాస్కర రావు మాట్లాడుతూ కనగల్ మండలంలో ఉన్న అన్ని గ్రామాలకు తమ బ్యాంకింగ్ సేవలు అందజేయడానికి అత్యాధునిక సౌకర్యాలతో ఈ శాఖను ఏర్పాటు చేశామని తెలియజేశారు. ఏటీఎం. మొబైల్ బ్యాంకింగ్ ఇంటర్నెట్ బ్యాంకింగ్ వంటి సౌకర్యాలతో పాటు ఖాతాదారులు ఎస్ టి పి. ద్వారా లోన్లు పొందడం వంటి అనేక సౌకర్యాల్ని తమ బ్యాంకు కలుగజేస్తోందని మండలంలో ప్రతి ఖాతాదారులు ఈ ఆధునిక సౌకర్యాలను తమ బ్యాంకు కలగజేస్తోందని ఈ సౌకర్యాలు అన్ని మండలంలో ఖాతాదారుడు అందుకునేలా చేయటమే తమ లక్ష్యం అని అన్నారు. ఎం ఎస్ ఎం ఈ, రుణాలు వీటితో పాటుగా రైస్ మిల్లు, దాల్ మిల్లు వంటి పరిశ్రమల రుణాలు కూడా అవసరమైన ప్రతి ఒక్కరూ తమ బ్యాంకు నుంచి తీసుకోవాలని కోరారు. బ్యాంకింగ్ కరస్పాండెంట్ల ద్వారా తమ సేవలను మండలంలోని మారుమూల ప్రాంతాలకు అందజేసేలా తాము ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ ఏ. మురళీకృష్ణ, చీఫ్ మేనేజర్స్ రాజేశ్వరి, రాజేష్, రఘురాం, బి ఆర్ ఎం కోటేశ్వరరావు, నూతన బ్రాంచ్ శాఖ మేనేజర్ మోహన్, ఎల్డిఎం శ్రామిక్ కనగల్ తహసిల్దార్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు అండగా తపాలా ప్రమాద బీమా...



కోరుట్ల మార్చి 06 (వుదయం ప్రతినిధి) కథలాపూర్ మండలం కలికోట గ్రామానికి చెందిన మార్కం చిన్న గంగారాం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు అతనికి అంబారిపేట్ పోస్ట్ ఆఫీస్ లో టాటా జిఏజి ప్రమాద భీమా తీసుకున్నారు సంవత్సరానికి 520 రూపాయలతో 10 లక్షల రూపాయల బీమా తీసుకోవడంతో బీమా కింద అతని కుటుంబానికి 10 లక్షలు మంజూరు కావడం జరిగింది దీనికి సంబంధించిన చెక్కును గురువారం మృతుని కుటుంబ సభ్యులకు తపాలా సిబ్బంది కలికోట గ్రామంలో అందించారు ఈనెల 31వ తేదీ వరకు ప్రత్యేక శిబిరాల ద్వారా ప్రతి పోస్ట్ ఆఫీస్ లో ఈ బీమా చూసుకోవచ్చని తెలిపారు ఈ సందర్భంగా కరీంనగర్ పోస్టల్ బ్యాంక్ మేనేజర్ తొర్తి రాజేష్ మాట్లాడుతూ ప్రతి కుటుంబం లోని అర్హత కలిగిన (18 సంవత్సరాల నుండి 65 సంవత్సరాల మధ్య) ప్రతి ఒక్కరూ బీమా చేసుకోవాలని మరణించిన కుటుంబానికి ఆసరాగా ఉంటుందని సూచించారు పోస్టాఫీసు లో ఉన్న ప్రతి పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా జగిత్యాల పోస్టల్ ఇన్స్పెక్టర్ ఎండీ సఫీయొద్దీన్ సూచించారు ఈకార్యక్రమంలో యస్పియం గంగరాజు గ్రామ మాజీ సర్పంచ్ వేముల నారాయణ గౌడ్ బీపీయం సంపత్ పోస్టల్ సిబ్బంది గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# ఇంటర్ పరీక్షలలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

**జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**

**ప్రగతి జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని జిల్లా ఎస్ పి శరత్ చంద్ర పవర్ తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**





నల్గొండ మార్చి 06(వుదయం ప్రతినిధి): ఇంటర్ పరీక్షల సందర్భంగా ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం ఆమె నల్గొండ జిల్లా కేంద్రంలోని ప్రగతి జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని జిల్లా ఎస్ పి శరత్ చంద్ర పవర్ తో కలిసి ఆకస్మిఖంగా తనిఖీ చేశారు. ప్రగతి జూనియర్ కళాశాలకు కేటాయించిన విద్యార్థులు, గురువారం పరీక్షకు హాజరైన విద్యార్థుల వివరాలను పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటిండెంట్ తో అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని ఇంటర్ విద్యా శాఖ అధికారులు, చీఫ్ సూపరింటిండెంట్లు, డిపార్టుమెంటల్ అధికారులతో కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లకు శంఖుస్థాపన చేసిన ఎమ్మెల్యే జారె





దమ్మపేట, మార్చి06(వుదయం ప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం మొండివర్రె గ్రామపంచాయతీ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం పైలట్ ప్రాజెక్ట్ గా ఎంపికై గ్రామపంచాయతీ పరిధిలో అర్హులైన నిరుపేదలందరికీ 5 లక్షలతో పక్కాఇండ్లు నిర్మించటానికి రాష్ట్రప్రభుత్వం శ్రీకారం చుట్టిన సందర్భంలో స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ గురువారం రోజు మొండివర్రెకాలనీలో బేతం రవి నాగలక్ష్మి గారి ఇంటికి భూమిపూజ సంఖుస్థాపన చేసి పనులు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ సుబ్రహ్మణ్యం , ఏఈ జి రాము , ఎంపీడీవో రవీంద్ర రెడ్డి , పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి, దమ్మపేట సొసైటీ చైర్మన్ ఏల్లిన రాఘవరావు , మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి ,మాజీ ఎంపీపీ సోయం ప్రసాద్ , కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, గ్రామ శాఖ కార్యవర్గ సభ్యులు, స్థానిక గ్రామస్తులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు...

# మార్చి 20న జరిగే రైతు మహాసభను జయప్రదం చేయండి - దొండపాటి



మధిర,మార్చి06(వుదయం ప్రతినిధి)మార్చి 20వ తేదీన వైరా కమ్మ వారి కళ్యాణ మండపంలో జరిగే తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా మహాసభను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్, జిల్లా సి పి ఐ కార్యవర్గ సభ్యులు బెజవాడ రవి పిలుపునిచ్చారు. గురువారం మధిర మండలం మడుపల్లి గ్రామంలో పుచ్చకాయల గాంధీ అధ్యక్షత జరిగిన తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం గ్రామ శాఖ మహాసభలో వారు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలకులవైఖరి కారణంగా వ్యవసాయ రంగం పంటల ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో రైతాంగం తీవ్ర ఇబ్బందికర పరిస్థితుల్లో నెట్టి వేయబడి వ్యవసాయం సాగు సంక్షోభంలోకి కూరుకు పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.వ్యవసాయ రంగం దెబ్బ తినడంతో అన్ని రంగాలు ఆర్థికంగా దెబ్బతింటున్నాయని వారు పేర్కొన్నారు. వ్యవసాయ రంగం నిలబడాలంటే సోమనాథ కమిటీ సిఫారసులు అమలు చేయడమే శరణ్యమని వారు పేర్కొన్నారు. రైతు సంఘం జిల్లా నాయకులు మహమ్మద్ అబ్దుల్ రహీం ఊట్ల కొండలరావు, యంగల ఆనంద్ రావు, పంగి శేషగిరిరావు పెమళ్ళపలి ప్రకాష్ రావు తదితరులు పాల్గొనగా రైతు సంఘం మడుపల్లి గ్రామ శాఖ అధ్యక్షులుగా గోపాలరావు కార్యదర్శిగా ఎస్.కె సాబ్ జాన్ తో పాటు తొమ్మిది మంది కమిటీ సభ్యులను ఈ గ్రామ మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.

# బీ.ఎస్.పి మండల అధ్యక్షులుగా బుర్రి కుమార్ స్వామి . . మండల ఉపాధ్యక్షులుగా రేణికుంట్ల సునీల్ నియామకం.



భూపాలపల్లి మార్చి06(వుదయం ప్రతినిధి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పొన్నం బిక్షపతి గౌడ్ కండువా కప్పి బుర్రి కుమార స్వామి రేణి కుంట్ల సునీల్ బహుజన సమాజ్ పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించడం జరిగింది.... ఈ సందర్భంగా బిక్షపతి గౌడ్ మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలు రాజ్యాధికారం వైపు పయనించాలని రాజ్యాధికారం అందిన రోజే నిజమైన పాలకులు అవుతామని అగ్రవర్ణ కుట్రలను తిప్పికొట్టాలని అన్నారు కుమారస్వామి మాట్లాడుతూ నన్ను పార్టీలోకి ఆహ్వానించిన బీ.ఎస్.పి జిల్లా అధ్యక్షులు పొన్నం బిక్షపతి గౌడ్ కి బీ ఎ స్ పి జిల్లా ఉపాధ్యక్షులు మేకల ఓంకార్ బీ ఏ స్ పి భూపాలపల్లి నియోజకవర్గ ఇన్చార్జి వేల్పుగొండ మహేందర్ కి ధన్యవాదాలు తెలిపారు పార్టీ అభివృద్ధికి క్షేత్రస్థాయిలో పనిచేస్తానని అన్నారు

# జీవితం జీవించడానికే ఆత్మహత్యల నివారణ సామాజిక బాధ్యత......

**ఆత్మహత్యలు వద్దు జీవితం ముద్దు.......**

**ఆత్మహత్యల నివారణ కమిటీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ :పరికిపండ్ల అశోక్**



కొత్తగూడ మార్చి 06(వుదయం ప్రతినిధి ):జీవితం జీవించడానికే, ఆత్మహత్యలకు పాల్పడవద్దని, కష్టాలు ఎదురైనప్పుడు ధైర్యంతో ఎదుర్కొని ముందుకు సాగాలని ప్రముఖ సైకాలజిస్ట్ & ఆత్మహత్యలు నివారణ కమిటీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ పేర్కొన్నారు. గురువారం మండలం లోని గుంజేడు ముసలమ్మ జాతరలో ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వెల్దండి వేణు అధ్యక్షతన ఏర్పాటుచేసిన ఆత్మహత్యల నివారణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అశోక్ మాట్లాడుతూ ఆత్మహత్య ప్రయత్నం చేసుకునే వ్యక్తుల పట్ల, సమాజం స్వాంతన చేకూర్చి మానసిక ధైర్యాన్ని నింపాలని, తనకి ఎవరూ లేరనే అగాధాన్ని పూడ్చే ప్రయత్నంతో భరోసా నింపాలని, కష్టాల్లో ఉన్న వ్యక్తికి తనకు ఉన్న అన్ని దారులు మూసుకుపోయినప్పుడు, ఆత్మహత్య ప్రయత్నం అనే దారి తెరుచుకుంటుందని, ఆ ప్రమాదకర క్షణంలో మేమున్నామంటూ భరోసానిస్తే బయటపడతారని తెలిపారు. గత పది సంవత్సరాలుగా ఆత్మహత్యల నివారణకు కృషి చేస్తూ ఇప్పటివరకు 28 మందిని కాపాడటం జరిగిందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిలక మారి వెంకటేశ్వర్లు, లైన్స్ క్లబ్ మెంబర్ అనుమాల వెంకటేశ్వర్లు, పద్మశాలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సామల నరసయ్య, విద్యాసంస్థల అధినేత శ్రీనివాస్, విశ్రాంత ఆచార్యులు ముల్కా కృష్ణమూర్తి, బొమ్మ వెంకటేశ్వర్లు, భరత్, రమేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియేట్ పరీక్ష కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ





జయశంకర్ భూపాలపల్లి మార్చి 06(వుదయం ప్రతినిధి)భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియేట్ పరీక్ష కేంద్రాన్ని గురువారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకస్మిక తనిఖీ చేశారు.పరీక్ష నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించి, విద్యార్థుల హాజరు శాతం గురించి చీఫ్ సూపరింటెండెంట్ ను అడిగి తెలుసుకున్నారు. సీ.సీ కెమెరా నిఘా నడుమ నిబంధనలకు అనుగుణంగా పరీక్ష నిర్వహించాలని, నిర్ణీత సమయంలో ప్రశ్న పత్రాలను తెరిచారా లేదా పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతి, అత్యవసర వైద్య సేవల కేంద్రం ఏర్పాటు, మరుగుదొడ్లు, కళాశాలలో ఎలాంటి వ్యర్థాలు లేకుండా పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సజావుగా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. పరీక్ష పూర్తయిన వెంటనే జవాబు పత్రాలను పోలీసు బందోబస్తు మధ్య క్లోస్డ్ వాహనంలో నిర్దేశిత కేంద్రాలకు తరలించాలని సూచించారు. ఎలాంటి మాల్ ప్రాక్టీసుకు అవకాశం లేకుండా పూర్తి పారదర్శకంగా, పక్కాగా పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. సెల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్ వాచీలు వంటి ఉపకరణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించకూడదని, నిశిత పరిశీలనతో విద్యార్థులను అనుమతించాలని స్పష్టం చేశారు. వైద్య సేవల కేంద్రాన్ని పరిశీలించి మందులను పరిశీలించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. విద్యార్థులు ఏదేని అస్వస్థతకు గురైతే తక్షణ వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.ఈ తనిఖీలో భూపాలపల్లి,తహసీల్దార్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధి, ఉపాధ్యాయుల సంక్షేమానికి పోరాటాలు కొనసాగిస్తాం

**: షేక్ నాగూర్ వలి టిఎస్ యుటిఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి**



మధిర,మార్చి06(వుదయం ప్రతినిధి) ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల్లో వరంగల్- ఖమ్మం- నల్లగొండ నియోజకవర్గం నుండి ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేసిన అలుగుబెల్లి నర్సిరెడ్డికి ఓటు వేసిన ఉపాధ్యాయులు, అధ్యాపకులకు, ఎన్నికల పనిలో అలుపెరుగకుండా శ్రమించిన నాయకులు, కార్యకర్తలందరికీ టిఎస్ యుటిఎఫ్ జిల్లా కమిటీ పక్షాన జిల్లా కార్యదర్శి షేక్ నాగూర్ వలి, ప్రాంతీయ కార్యాలయం కన్వీనర్ ఏ వినోద్ రావు, మండల ప్రధాన కార్యదర్శి ఈ వీరయ్య లు ధన్యవాదాలు తెలియజేశారు.మధిర మండల అధ్యక్షుడు బి. నాగరాజు అధ్యక్షతన ప్రాంతీయ కార్యాలయం గురువారం మండల ఆఫీస్ బేరర్స్ సమావేశంలో వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీగా నర్సిరెడ్డి గత ఆరు సంవత్సరాల్లో నిజాయితీగా పనిచేశారని, ఆదర్శవంతమైన పనితీరు కనబరిచారని, అయినా మరోసారి అభ్యర్థిగా పోటీ చేసిన సందర్భంలో ఓటర్లను ఏ విధమైన ప్రలోభాలకు గురిచేయకుండా విలువలతో కూడిన ప్రచారం చేశమన్నారు. సంఘం పనిలో ఎన్నికలు ఒక భాగం మాత్రమే. ఫలితాలతో నిరాశ చెందకుండా ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధి, ఉపాధ్యాయుల సంక్షేమానికి పోరాటాలు నిరంతరం కొనసాగిస్తామన్నారు. గత యాభై సంవత్సరాలుగా ఎమ్మెల్సీ ఎన్నికలు ఉన్నప్పుడు, లేనప్పుడు, కౌన్సిల్ లో ప్రాతినిధ్యం ఉన్నప్పుడు, లేనప్పుడు కూడా ఉపాధ్యాయ ఉద్యమాలు, పోరాటాలు కొనసాగాయి. ఇప్పుడు కూడా అదే స్పూర్తితో, మరింత పట్టుదలతో కృషిని కొనసాగిస్తాము. రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమాలను నిర్వహిస్తాము అని వారన్నారు. ఈ సమావేశంలో మధిర మండల ఉపాధ్యక్షులు షేక్ ఇబ్రహీం, ఖాజా సునీత, కోశాధికారి బి చెన్నయ్య, ఎఫ్ డబ్ల్యు ఎఫ్ కన్వీనర్ మల్లరాజు, సీనియర్ నాయకులు ఎం.డి.రఫి, కార్యదర్శులు డి కవిత, డి భాస్కరరావు, కే రమేష్, బి రమేష్ బాబు, డి మహేంద్ర లు పాల్గొన్నారు.

# సామాజిక వర్గ పరిధిలో కేసుల పరిష్కార ప్రయత్నం జరగాలి.!

**- వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి. నిర్మలా గీతాంబ**

హనుమకొండ, మార్చి 06(వుదయం జిల్లా ప్రతినిధి) : కుటుంబం మరియు సమాజంలోని వ్యక్తుల మధ్య వచ్చే వివిధ తగాదాలను పరిష్కరించే ప్రయత్నం సామాజిక వర్గ స్థాయిలోనే జరగాలని, అది కుటుంబానికి మరియు సమాజానికి మేలు చేస్తుందని వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి. నిర్మలా గీతాంబ అన్నారు. వివాదాలను పోలీస్ స్టేషన్ మరియు కోర్టుల దాకా తీసుకవెళ్లినట్లయితే వ్యక్తుల మధ్య సంబంధాలు దెబ్బతింటాయని, ఇది సమాజానికి హానికరం అని అన్నారు. ఈ విషయంలో సామాజిక వర్గాలకు సంబంధించిన పెద్దలు పోషించవలసిన పాత్రను గురించి చర్చించటానికి వచ్చే శనివారం రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్ హనుమకొండకు హాజరవుతున్నారని తెలిపారు. శనివారం ఉదయం 9 గంటలకు హనుమకొండలోని కాళోజి కళాక్షేత్రంలో జరిగే ఈ కార్యక్రమానికి అన్ని సామాజిక వర్గాలకు సంబంధించిన కమ్యూనిటీ మీడియేటర్లు హాజరు కావాలని ఆమె కోరారు.




కార్యక్రమంలో వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.సాయి కుమార్, వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు తీగల జీవన్ గౌడ్ మరియు ఎం.రమేష్ బాబు, వివిధ సామాజిక వర్గాలకు చెందిన కమ్యూనిటీ మీడియేటర్లు పాల్గొన్నారు.

# బిజెపి నాయకుల విజయోత్సవ సంబరాలు





జయశంకర్ భూపాలపల్లి మార్చి06(వుదయం ప్రతినిధి) మహాదేవపూర్ మండల కేంద్రంలో బిజెపి నాయకులు గురువారం సంబరాలు జరుపుకున్నారు భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు మనోజ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై బాణా సంచాలు పేల్చి తీపి పంపకాలు జరుపుతూ సంబరాలు జరుపుకున్నారు ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు మనోజ్ మాట్లాడుతూ ఫిబ్రవరి 27వ తేదీన జరిగిన కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల, మరియు టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలలో బీజేపీ అభ్యర్థులైన చిన్నమైల్ అంజిరెడ్డి మల్కా కొమురయ్య విజయ దుందుబి మోగించిన సందర్భంగా బాణాసంచా పేల్చి, స్వీట్స్ పంపిణి చేసి విజయోత్సవ సంబరాలు జరుపుకోవడం జరిగిందని అన్నారు తెలంగాణాలో ప్రతిష్టత్మాకంగా జరిగినటువంటి కరీంనగర్, మెదక్,నిజామాబాద్, ఆదిలాబాద్, ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ మరియు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కమలనాధుల విజయానికి సహకరించిన ఉపాధ్యాయులకు, పట్టభద్రులకు, నిరంతర%శీ% శ్రమించిన బీజేపీ నాయకులకు,పచ్చిన్ ప్రభారీలకు,కార్యకర్తలకు, ధన్యవాదాలు తెలిపారు,ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటర్లు నోట్ల కట్టాలవైపు కాకుండా, దేశం కోసం, దర్మం కోసం పనిచేసే బీజేపీ వైపే ఉన్నారని,తెలంగాణాలో రానున్న స్థానిక ఎలక్షన్ లో కూడా బీజేపీ అధిక మొత్తంలో స్థానాలకు కైవసం చేసుకొని విజయ కేతానం ఎగురావేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు, ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ నాయకులు సిరిపురం శ్రీమన్నారాయణ, కన్నెబోయిన ఐలయ్య యాదవ్, రవి, వెంకటేష్, తోపాటు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపు పై విజయోత్సవ సంబరాలు



యాదాద్రి భువనగిరి /మార్చ్ 06 వుదయం పతినిధి : మోత్కూర్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్, మెదక్' నిజామాబాద్' ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ & పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థులు గెలిచిన సందర్భంగా అంబేద్కర్ చౌరస్తాలో బాణసంచ కాల్చి మిఠాయిలు పంచి విజయోత్సవ సంబరాలు నిర్వహించుకోవడం జరిగినది ఈ సందర్భంగా మోత్కూర్ పట్టణ అధ్యక్షులు చాడ మంజుల సీనియర్ నాయకులు కొనతం నాగార్జున రెడ్డి గౌరు శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి ఉపాధ్యాయులు మేధావులు పట్ట బద్రులుభారతీయ జనతా పార్టీకి అవకాశం ఇవ్వడం జరిగినది రాబోయే రోజుల్లో తెలంగాణలో కాషాయ జెండా ఎగరేస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షులు పోచం సోమయ్య పట్టణ నాయకులు చేకూరి మల్లేశం కందుకూరి ప్రకాష్ మోత్కూర్ బ్రహ్మచారి లింగాల శ్యాంసుందర్ రెడ్డి జినుకల దశరథ మధు సోమేశ్వరి పొలకం శివ ఏషాబోయిన రమణ తీగల శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

# మాదిగల ఆత్మ గౌరవ డప్పు మహా ప్రదర్శన మాదిగలకు మంత్రి వర్గంలో 2 స్థానాలు కల్పించాలి



సంగెం మార్చి06(వుదయం ప్రతినిధి): సంగెం మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గురువారం డప్పులతో ప్రదర్శన నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు దామెర కిషోర్ మాదిగ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్ పి, రాష్ట్ర నాయకులు ,వరంగల్ జిల్లా ఇన్చార్జి బిర్రు మహేందర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చాతాళ్ళ రమేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షులు కట్ల రాజశేఖర్ మాదిగ హాజరై డా. బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ప్రదర్శన చేశారు. అనంతరం మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై డాక్టర్ షమీమ్ అక్తర్ ఇచ్చిన నివేదికలో ఉన్న లోటు పాట్లని సవరించి ఈ రాష్ట్రంలో 15 లక్షలు ఉన్న మాల సామాజిక వర్గానికి 5 శాతం కేటాయిస్తే 32 లక్షల కు పైగా జనాభా ఉన్న మాదిగలకు 11 శాతం కేటాయించాల్సిన అవసరం ఉన్నది అంతేగాక ఎస్సీ వర్గీకరణను మూడు గ్రూపులుగా కేటాయించడం వల్ల ఎస్సీలలో ఉండే కింది స్థాయి కులాలకు సామాజిక న్యాయం జరగలేదు అందుకని వర్గీకరణను నాలుగు ఏబిసిడి గ్రూపులుగా కేటాయించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గంలో మాదిగలకు రెండు స్థానాలు కల్పించి సామాజిక న్యాయం చేయాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు జరగబోయే క్యాబినెట్ సమావేశాల్లో ఇట్టి ప్రతిపాదనలను అమలు అయ్యే విధంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సంగెం మండల ప్రధాన కార్యదర్శి కోడూరి రాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు గుండేటి లవ కుమార్, మెట్టుపల్లి ఏలియా, మాజీ ఎంపిటిసి మెట్టుపల్లి మల్లయ్య, గుండేటి లక్ష్మీనారాయణ, బొజ్జ సురేష్ చిర్ర గణేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ రంగంపేట గ్రామ అధ్యక్షులు ఇమ్మడి అఖిల్ మాదిగ, కొల్కనూరి రవీందర్, రవిరాజు, చిర్ర కృష్ణ మాదిగ,శివాజీ మాదిగ,రాకేష్ మాదిగ, పోషాలు,రమేష్, చిర్ర అఖిల్ మాదిగ, కట్టయ్య,సురేష్, లడ్డు, తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు





సంగెం మార్చి06(వుదయం ప్రతినిధి): మండలంలోని గవిచర్ల గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు కడుదురి కర్ణాకర్ రమ దంపతుల ద్వితీయ పుత్రిక కావ్య రాజిరెడ్డిల వివాహ వేడుకల్లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తో పాటు పరకాల మాజీ ఎమ్మెల్యే చల్ల ధర్మారెడ్డి గురువారం హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, నూతన వస్త్రాలను అందజేసి ఆత్మీయ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు,

స్థానిక మాజీ జడ్పిటిసి గూడ సుదర్శన్ రెడ్డి, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పసునూరి సారంగపాణి, మాజీ ఎంపీపీలు దోనికెల మల్లయ్య, బుక్క మల్లయ్య, మాజీ సర్పంచులు కందగట్ల నరహరి, దోనికెల రమ శ్రీనివాస్, పత్తిపాక రమేష్, సంగెం సొసైటీ చైర్మన్ వేల్పుల కుమారస్వామి, పంచాయతీ కార్యదర్శులు,

మాజీ ఎంపీటీసీలు గూడ సంపత్ రెడ్డి, రంగరాజు నరసింహస్వామి, సుతారి బాలకృష్ణ ఏఈఓ సాగర్, వేలూరి రాజశేఖర్ దంపతులు, వివిధ గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు, ప్రముఖులు, సీనియర్ నాయకులతో పాటు తదితరులు పెద్ద ఎత్తున వివాహ మహోత్సవ కార్యక్రమానికి తరలివచ్చరు.

# ఘనంగా మొరంపూడి పుల్లారావు ప్రథమ వర్ధంతి



దమ్మపేట, (వుదయం ప్రతినిధి ):భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం మందలపల్లి గ్రామంలో సిపిఎం పార్టీ నాయకులు కామ్రేడ్ మోరంపూడి పుల్లారావు ప్రథమ వర్ధంతి సభ గురువారం సిపిఎం పార్టీ కార్యాలయంలో మోరంపూడి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పిట్టల అర్జున్ ,జిల్లా నాయకులు దొడ్డ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మోరంపూడి పుల్లారావు తన జీవితమంతా రైతులు వ్యవసాయ కూలీలు కష్టజీవులు సమస్యల పరిష్కారం కోసం పనిచేసిన గొప్ప వ్యక్తిని, సిపిఎం బాటలో ఎర్రజెండా నీడలో తన నమ్మిన ఆశయం సాధన కోసం అహర్నిశలు కృషి చేశారని అన్నారు. ప్రస్తుత సమాజం ప్రజల సమస్యలు పరిష్కరించేదిగా లేదని ఆర్థిక అంతరాలు పెరిగి ప్రజలు కొనుగోలు శక్తి రోజు రోజుకు దిగజారుతుందని ,దీనికి కారణం పాలకుల అవలంబించే విధానాలే కొద్దిమంది అపర కుబేర్లుగా మారటానికి దోహదపడుతున్నాయని అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని జనంరోడ్డు ఎక్కితే తీవ్రమైన నిర్బంధాలు కు పాలకులు పాల్పడుతున్నారని అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు మోరంపుడి పుల్లారావు నమ్మిన మార్క్సిజం లెనినిజమే మానవాళి సమస్యల పరిష్కారం అని, ఆయన నమ్మిన సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్లడమే పుల్లారావుకు అర్పించే ఘనమైన నివాళి అనిపేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంట్రాతి అప్పారావు.మండల కార్యదర్శి సభ్యులు కొలిగిపోకు శ్రీనివాసరావు, .రావుల శోభన్ బాబు, మోరంపూడి కేశవ రావు, కొప్పుల శ్రీను.రాంప్రసాద్, జాన్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ మెగా లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోండి

## నారాయణపేట సిఐ శివశంకర్



నారాయణపేట టౌన్ మార్చి 06(వుదయం ప్రతినిధి) ఈనెల 8న నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్ ను ఉపయోగించుకొని సమస్యలను పరిష్కరించుకోవాలని నారాయణపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ శివశంకర్ కోరారు.జాతీయ మెగా లోక్ అదాలత్ సందర్భంగా రాజీ పడ దగిన కేసులలో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు,

కుటుంబపరమైన నిర్వాహణ కేసులు, రోడ్డు ప్రమాదాల కేసులు, చిన్న చిన్న దొంగతనాల కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్, టౌన్ న్యూసెన్స్ కేసులు, బ్యాంకు రికవరీ, టెలిఫోన్ రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ కేసులో ఇతర రాజీ పడ్డ దగిన కేసుల్లో కక్షిదారులు రాజీ పడాలని సూచించారు. రాజీ మార్గం రాజ మార్గమని చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బులను వృధా చేసుకోవద్దని, న్యాయ శాఖ ఇచ్చిన అవకాశాన్ని నారాయణపేట సర్కిల్ పరిధిలోని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా కేసుల సత్వర పరిష్కారం చేసుకోవచ్చని సీఐ తెలిపారు.

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలు భావితరాల భవిష్యత్తుకు స్ఫూర్తి...

అంబేద్కర్ విగ్రహం ఎదుట కుమారుడికి అన్న ప్రసన్న....

నీలం సురేష్ సంధ్య దంపతులను అభినందించిన ప్రముఖులు...





అన్నపురెడ్డిపల్లి, మార్చి 06: (వుదయం ప్రతినిధి)మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నీలం సురేష్, సంధ్య దంపతులు తమ కుమారుడికి గురువారం అన్న ప్రసన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ దంపతులు మాట్లాడుతూ... డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలను భవిష్యత్ తరాలకు తెలియజెప్పాలన్న ఉద్దేశంతో ఈరోజు మా కుమారుడు మోక్ష అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని, భవిష్యత్తులో కూడా మా కుమారుడు అంబేద్కర్ ఆశయాలను, అభ్యుదయ భావాలతో పెంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో బంధువులు, గ్రామస్తులు, అంబేద్కర్ సంఘం సభ్యులు , ఉపాధ్యాయులు, సామాజికవేత్తలు పాల్గొని మోక్షాను ఆశీర్వదించారు..

# తాగిన మైకంలో వాహనం నడుపుతూ అదుపుతప్పి ఇద్దరు మృతి మరి ఒకరి పరిస్థితి విషమం



చెన్నరావుపేట మార్చి06(వుదయం ప్రతినిధి): బొలెరో డ్రైవర్ తాగిన మైకంలో డ్రైవింగ్ అదుపుతప్పి ఇద్దరు మృతి 20 మందికి మధ్య గాయాలు మరో పదిమంది స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఉప్పరపల్లి గ్రామ శివారు జీడిగడ్డ తండాకు చెందిన దాదాపు 40 మంది కూలీలు నర్సంపేట మండలం ఇటుకలపల్లి గ్రామానికి మిర్చి ఏరడానికి వెళ్తున్న క్రమంలో కొనాపురం శివారు అదుపు తప్పి బోలెరో టీ జీ 24 టి 1472 నెంబర్ గల వాహనం క్రింద పడగా ఒక్కరు అక్కడికక్కడే బానోత్ సుక్య మృతి. ఎంజీఎం లో చికిత్స పొందుతూ బానోతు ఈరియా మృతి చెందగా, మిగిలిన వారిలో తీవ్ర గాయాలపాలయ్యారు భాదితులతో ఫోన్ లో మాట్లాడి నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి మృతి చెందిన భూక్యా.సక్య కుటుంబానికి అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు, గాయాల పాలైన వారిని చెన్నారావుపేట మండల ఉప్పరపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వట్టె.తిరుపతి రెడ్డి ఎమ్మెల్యే ఆదేశానుసారం ఎం జి ఎం. ఆసుపత్రికి తరలించారు మిగితావారిని స్థానిక నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి డా.కిషన్ గారితో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన కాంగ్రెస్ నాయకులు.



బయ్యారం(వుదయం ప్రతినిధి) బయ్యారం మండలంలోని రామచంద్రపురం గ్రామ పంచాయతీ లో తూర్పు శాంత- రామూర్తి (లేట్) కుమారుడు తుర్స ప్రతాప్, నందిని పెళ్లివేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గట్ల. గణేష్,మాజీ ఉపాసర్పంచ్ తొట్టి కృష్ణ కరుణ దంపతులు,మాజీ రైతు కోఆర్డినేటర్ కోట సతీష్,న్యూడేమోక్రాసి సీనియర్ నాయకులు ధర్మ గారు, బానోత్. కిషన్, వజ్జ, సురేష్, నరేష్, నాగరాజు,పందిపడే యూత్ కాంగ్రెస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అంజిరెడ్డి గెలుపుకు సంబరాలు చేసుకున్న బిజెపి శ్రేణులు



కొండపాక మార్చి06(వుదయం ప్రతినిధి): ఉమ్మడి కరీంనగర్,ఆదిలాబాద్, మెదక్, జామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ బిజెపి అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే.దీనిలో భాగంగా కొండపాక మండల బిజెపి పార్టీ నాయకులు గురువారం రోజు వెలికట్ట అడ్డు రోడ్డు సర్కిల్లో బాణాసంచా పేల్చి, మిఠాయిలు పంచారు.

అనంతరం వారు మాట్లాడుతూపట్టభద్రుల ఎమ్మెల్సీ ఎలక్షన్లో ఘన విజయం సాధించిన చిన్నమైల్ అంజిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో అభివృద్ధి దిశగా దూసుకుపోతుంది అన్నారు. రానున్న రోజుల్లో మనదేశంలోని ప్రతి రాష్టంలో బిజెపి జెండా ఎగరడం ఖాయం అన్నారు. ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చడంలో విఫలమైన కాంగ్రెస్ పార్టీ రేపు జరగబోయే స్థానిక ఎన్నికల్లో ఓటమి పాలవడం ఖాయం అన్నారు.ఈ కార్యక్రమం లో బిజెపి మండల అధ్యక్షులు నీల సత్యం, జిల్లా ఎస్సీ మోర్చా కార్యదర్శి బర్రె కిషన్, మండల ప్రధాన కార్యదర్శి నల్ల మల్లేశం, మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు తుప్పుడు స్వామి, యువ మోర్చా అధ్యక్షులు తాళ్లపల్లి ప్రవీణ్ గౌడ్, అభిలాష్ రెడ్డి ,జయరాములు, మంతూరి రాజు, బిక్షపతి,నారాయణరెడ్డి, కిషన్ రావు, రమేష్ తదుపరులు పాల్గొన్నారు

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

సంగెం మార్చి 6 వుదయం ప్రతినిధిమండలంలోని గవిచర్ల గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు కదురి కర్ణాకర్ రమ దంపతుల ద్వితీయ పుత్రిక కావ్య రాజిరెడ్డిల వివాహ వేడుకల్లో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గురువారం హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, నూతన వస్త్రాలను అందజేసి ఆత్మీయ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, స్థానిక మాజీ జడ్పిటిసి గూడ సుదర్శన్ రెడ్డి, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పసునూరి సారంగపాణి, మాజీ ఎంపీపీలు దోనికెల మల్లయ్య, బుక్క మల్లయ్య, మాజీ సర్పంచులు కందగట్ల నరహరి, దోనికెల రమ శ్రీనివాస్, పత్తిపాక రమేష్, సంగెం సొసైటీ చైర్మన్ వేల్పుల కుమారస్వామి, పంచాయతీ కార్యదర్శులు, మాజీ ఎంపీటీసీలు గూడ సంపత్ రెడ్డి, రంగరాజు నరసింహస్వామి, సుతారి బాలకృష్ణ ఏఈఓ సాగర్, వేలూరి రాజశేఖర్ దంపతులు, వివిధ గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు, ప్రముఖులు, సీనియర్ నాయకులతో పాటు తదితరులు పెద్ద ఎత్తున వివాహ



మహోత్సవ కార్యక్రమానికి తరలివచ్చరు.

## భవిష్యత్తు బీజేపీదే

నిర్మల్, మార్చి06(వుదయం ప్రతినిధి): ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో బీజేపీ ఘన విజయం సాధించడం పట్ల సోన్ మండలంలో గురువారం బీజేపీ శ్రేణులు సంబరాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకుడు రావుల రాంనాథ్ మాట్లాడుతూ తెలంగాణను భవిష్యత్తులో ఏలే సత్తా బీజేపీకే ఉందన్నారు. ఇందులో మండల అధ్యక్షుడు మారా గంగారెడ్డి, దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు సాగర్, మాజీ ఎంపీపీ హరీశ్వర్ రెడ్డి, నరేష్ తదితరులు ఉన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ శాఖమూరి.



ఖానాపురం మార్చి 6 వుదయం ప్రతినిధి.మండలంలోని భద్రుతండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు వాంకుడోత్ చేరాలులలిత దంపతుల కుమార్తె వివాహానికి నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు హాజరై నూతన వధూవరులు ఉజ్వలసంతోష్ లపై అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మూడు పూల్ సింగ్, గ్రామ పార్టీ అధ్యక్షులు పిండి కుమారు, నూనవత్ మోహన్, నాయకులు దేవినేని వేణుగోపాల్ రావు, కసుపాద సాంబయ్య, కందుల సాంబయ్య, మంచే వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# రాఘవేంద్ర స్వామి జయంతి సందర్భంగా చలివేంద్రం ప్రారంభం

నారాయణపేట టౌన్ మార్చి 06(వుదయం ప్రతినిధి) శ్రీ రాఘవేంద్ర స్వామి 340జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని స్వామి వారి భక్తులు కూరగాయలరవికుమార్ గౌడ్, వినోద్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముందర ఏర్పాటు చేసిన చలివెంద్రాన్ని తహసీల్దార్ అమరేందర్ కృష్ణ మాజీ మున్సిపల్ వైస్ చేర్మెన్ హరి నారాయణ్ బట్టడ్ లు ప్రారంబించారు. అంతకు ముందు చిల్డ్రన్స్ ఆసుపత్రి లో పండ్లు పంపిణి చేశారు. ఈసందర్బంగా తహసీల్దార్ అమరేందర్ కృష్ణ మున్సిపల్ వైస్ చేర్మెన్ హరి నారాయణ్ బట్టడ్ మాట్లాడుతు గత 10సంవత్సరాలనుండి రాఘవేంద్ర స్వామి భక్తులు వేసవి కాలం లో ప్రజల దాహర్తిని తీర్చేందుకు చలి వేంద్రం ఏర్పాటు చేయడం అభినందననీయమని అన్నారు.అనంతరం నిర్వాహకులు తహసీల్దార్, మున్సిపల్ వైస్ చేర్మెన్ లను శాలువ పూల మాలతో సత్కరించి స్వామి వారి ప్రసాదం





అందించారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు జి రాఘవేందర్ రెడ్డి, మోహన్, గందె ఉమాకాంత్, విద్వాన్,అనిల్ కుమార్,జ్యోషి, ప్రసాద్,శేషు, ధరణి ధర్ దీక్షిత్ గురు, శ్రీధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్టాండ్ లో తనిఖీ నిర్వహిస్తున్న ఎస్సై సిహెచ్ రవికుమార్

గోలసుల దొంగలు, లగేజీ మిస్సింగ్ పై అవగాహన కల్పిస్తున్న ఎస్సై సి హెచ్ రవికుమార్.



నర్సంపేట మార్చి06(వుదయం ప్రతినిధి): నర్సంపేట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో నర్సంపేట పట్టణ సబ్ ఇన్స్పెక్టర్ సి హెచ్ రవికుమార్ ఆధ్వర్యంలో ప్రజలకు చైన్ స్నాకింగ్, మరియు బ్యాగుల దొంగతనం(లగేజీ మిస్సింగ్) చిన్నపిల్లల అపహరణ పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రజలను జాగృత పరిచినారు. పరిచయం లేని వ్యక్తులను గుడ్డిగా నమ్మకూడదని, పరిచయం లేని వారు ఏదైనా తిను బండారాలు ఇస్తే తీసుకోవద్దని, గొలుసు దొంగలపై జాగ్రత్తగా ఉండాలని, ఎవరైనా అనుమానితంగా సంచరిస్తే పోలీస్ స్టేషన్లో తెలియపరచాలని ప్రజలకు వివరించారు. అసంఘటిత కార్యక్రమాలకు ఎవరైనా పాల్పడితే వెంటనే తెలియజేయాలని వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని నర్సంపేట పట్టణ మొదటి ఎస్సై సిహెచ్ రవికుమార్ తెలియపారు. ఈ కార్యక్రమంలో ఎండి యాకూబ్ పాషా, సతీష్, రవి తదితరులు పాల్గొన్నారు.

# జీఎం ను ఆహ్వానించిన ప్రగతి గ్రామ సమైక్య

జిఎం కు మహిళా దినోత్సవ ఆహ్వానం



భద్రాద్రి కొత్తగూడెం మార్చ్ 06 (వుదయం ప్రతినిధి ):భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం సింగరేణి కొత్తగూడెం ఏరియా జిఎం కార్యాలయంలో చుంచుపల్లి మండలం గౌతంపూర్ గ్రామపంచాయతీలో ప్రగతి గ్రామ సమైక్య వివోఏ పద్మ ఆధ్వర్యంలో మార్చి 11 మంగళవారం గౌతమ్ పూర్ గ్రామపంచాయతీ సింగరేణి కమ్యూనిటీ హాల్ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు జిఎం కార్యాలయంలో జి యం శాలెం రాజ్ కు ఆహ్వానం అందజేసిన గౌతమ్ పూర్ ప్రగతి గ్రామ సమాఖ్య సభ్యులు. సానుకూలంగా స్పందించిన జిఎం తప్పకుండా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు హాజరవుతానని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవనిర్వాహక కమిటీ సభ్యులు సుమలత ఉమాదేవి లావణ్య పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి.





ఖానాపురం మార్చి06(వుదయం ప్రతినిధి): మండలంలోని వేపచెట్టుతండా గ్రామపంచాయతీ పరిధిలోని రేవతండకు చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకుడు బానోతు బాలాజీతారమ్మ దంపతుల కుమార్తె వివాహానికి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి హాజరై నూతన వధూవరులు పూజహుస్సేన్ లపై అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఉ మ్మడి జిల్లా ఓడిసిఎంఎస్ మాజీ చైర్మన్ గుగులోతు రామస్వామినాయక్, మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు, మండల పార్టీ అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకన్ననర్సయ్య, నాయకులు భూక్య వెంకన్న, గుగులోతు బాలు, పీన్నపురెడ్డి తిరుపతిరెడ్డి, ముద్దుంగుల సంపత్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# రెండవ తరగతి విద్యార్థులకు సర్వే

ఆందోల్, మార్చి06(వుదయం ప్రతినిధి): ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు జిల్లాలో ఎంపిక చేసిన 55 పాఠశాలలో రెండవ తరగతి విద్యార్థులతో సర్వే నిర్వహిస్తున్నట్లు సమగ్ర శిక్ష ఎంఎంవో అనురాధ తెలిపారు. జిల్లా సైన్స్ కేంద్రంలో గురువారం శిక్షణ సమావేశం నిర్వహించారు. సర్వే కోసం డిగ్రీ కళాశాల విద్యార్థులను నియమించినట్లు చెప్పారు. విద్యార్థుల ప్రగతి తెలుసుకొనేందుకే ఈ సర్వే చేపట్టినట్లు పేర్కొన్నారు.

# కామ్రేడ్ మోదుగుల నర్సయ్య కు విప్లవ జోహార్లు.

-అమరుల ఆశయ సాధనకై ఉద్యమిద్దాం.

-సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ.

బయ్యారం(వుదయం ప్రతినిధి)మార్చి 6.సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ బాలాజీ పేట సీనియర్ గ్రామ కమిటీ సభ్యుడు కామ్రేడ్ మోదుగుల నర్సయ్య సంతాప సభ మార్చి 6 గురువారం బాలాజీ పేట గ్రామంలో సిపిఐ ఎమ్ ఎల్ న్యూ డెమోక్రసీ మహబూబాబాద్ జిల్లా నాయకులు తోకల వెంకన్న అధ్యక్షతన జరిపారు. ఈ సభలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య, రాష్ట్ర నాయకులు బండారు ఐలయ్య, నందగిరి వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడుతూ కామ్రేడ్ నరసయ్య తల్లి శాంతమ్మ పార్టీలో క్రియాశీలక పాత్ర పోషిస్తూ అనేక ప్రజా ఉద్యమాలలో పాల్గొన్నారు.శత్రువుల దాడులను అధిగమించి తప్పుడు కేసులు లెక్కచేయ్యకుండా జైలు జీవితాన్ని గడిపి ఉద్యమంలో కొనసాగుతు దృఢంగా నిలబడ్డారు.ఈ క్రమంలో తల్లి వారసత్వం కామ్రేడ్ నర్సయ్య కూడా విద్యార్థి దశ నుండి విప్లవోద్యమాలకు ఆకర్షతుడై సిపిఐ ఎంఎల్ పార్టీలో సభ్యునిగా చేరి ఈ ప్రాంతంలో జరిగే అనేక ప్రజా పోరాటాలలో ముఖ్య భూమిక పోషించాడు.నూతనంగా ఏర్పడ్డ బాలాజీ పేట గ్రామపంచాయతీలో పార్టీ లో నిజాయితీగా పనిచేస్తూ యువజన రంగంలో చురుకైన పాత్రను పోషించాడు. అనేక ఆటుపోట్లను ఎదుర్కొని పార్టీ విప్లవ రాజకీయాలను అణువణువునా జర్నించుకున్న వ్యక్తి కామ్రేడ్ నర్సయ్య. పార్టీని ఎవరు విమర్శించిన ప్రశ్నించి ఎదురు తిరిగి ధైర్యంగా మాట్లాడే వ్యక్తి.నికార్సైన విప్లవ పార్టీ సభ్యుడిగా కొనసాగాడని వారు అన్నారు. నేటి సమాజంలో యువత అనేక రకాల తప్పుడు మార్గంలో ప్రయాణిస్తున్నటువంటి సందర్భంలో





కామ్రేడ్ నరసయ్య పేద ప్రజల పక్షాన పోరాడుతున్నటువంటి సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాజకీయాల వెంట నిలబడడం గొప్ప విషయమని వారన్నారు. ఇలాంటి కామ్రేడ్ భౌతికంగా మన నుండి దూరం కావడం బాధాకరమని కామ్రేడ్ నరసయ్య ఏ రాజకీయాల కోసమైతే చివరి వరకు నిలబడ్డాడో ఆ రాజకీయాలను తుదకంట తీసుకెళ్లడమే కామ్రేడ్ నరసయ్యకు అర్పించే నిజమైన నివ్వాలని వారు పేర్కొన్నారు. ఈ సంతాప సభలో సిపిఐ ఎం ఎల్ డెమోక్రసీ జిల్లా నాయకులు మోకాళ్ళ మురళీకృష్ణ.ఎం యాకన్న. నేతగాని రాకేష్ తుడుం వీరభద్రం. రామచంద్రపు మురళి. గుడిపోయిన రమేష్. పిఓడబ్ల్యూ నాయకురాలు సింగన బోయిన సునీత. ఎర్రమళ్ళవెంకన్న.కొత్త రామదాసు. రేపాకుల రాజు లాకావత్ హరి సింగ్. విడబోయిన వీరభద్రం. నిమ్మరబోయినసహదేవ్.ఈడ బో ఈ న.సుగుణ . ఏర్ని సురేష్ చెక్కల వెంకన్న. ఖుషిని జోగేష్ తదితరులు పాల్గొన్నారు.

# వివాహ వేడుకకు హాజరైన ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి



అలంపూర్ మార్చి 6 (వుదయం ప్రతినిధి)జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి గురువారం అయిజ మండలం తొత్తినోనిదొడ్డి గ్రామానికి చెందిన శివకుమార్ కుమారుడు రవి కుమార్ సహస్ర ల వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులకు ఆశీర్వదించారు.

ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# రాఘవేంద్ర స్వామివారికి ప్రత్యేక పూజలు



జన్నారం,మార్చ్ 6(వుదయం విలేఖరి) జన్నారం పట్టణంలోని మేదరి వాడలో ఉన్న హనుమాన్ దేవాలయంలో శ్రీ రాఘవేంద్ర స్వామి వారికి భక్తులు, ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాఘవేంద్ర స్వామి వారి జన్మదినోత్సవం సందర్భంగా వారు గురువారం హనుమాన్ దేవాలయంలో రాఘవేంద్ర స్వామి వారి చిత్రపటానికి ఆలయ పురోహితుడు గుండి గణేష్ శర్మ అభిషేకము అర్చన, తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ జక్కు భూమేష్,భక్తులు జక్కు సత్తయ్య,శీల రమేష్, రంగ శ్రీనివాస్, ఉత్తూరి ప్రభాకర్, మాదంశెట్టి భూమేష్, కొత్త వేణు, గోలి చందు, లక్ష్మీనారాయణ, మహిళా భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండల స్థాయి టెన్త్ టాలెంట్ టెస్ట్.

## విజేతగా శారద హైస్కూల్ విద్యార్థి నేరెళ్ల వంశీ.




పరకాల మార్చి 6 (వుదయం ప్రతినిధి): పరకాల పట్టణంలోని ప్రభుత్వ గర్ల్స్ హైస్కూల్లో ఎస్ఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో టెన్త్ టాలెంట్ టెన్త్ విజేతల బహూకరణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షులు స్టాలిన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసే ప్రయత్నంగానే ప్రతి సంవత్సరం టెన్త్ టాలెంటెస్ట్ నిర్వహిస్తుందని అన్నారు. విద్యార్థులంతా తమ తల్లిదండ్రుల ఆశయాలను గురువుల ఆధ్వర్యంలో చదువుకొని పై కెదగాలని అన్నారు.సమాజంలోని సామాజిక రుగ్మతలకు అసమానతలకు వ్యతిరేకంగా వాటి పరిష్కారానికి పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల స్థాయి మొదటి బహుమతి గెలుచుకున్న శారద హై స్కూల్ విద్యార్థి నేరెళ్ల వంశీకి మరియు రెండవ బహుమతి మల్కాపేట సోషల్ వెల్ఫేర్ విద్యార్థి కే శ్రీజ లకు శాలువాతో సత్కరించి ఎగ్జామ్ ప్యాడ్ మరియు షీల్డ్ ను బహూకరించారు అలాగే పాఠశాల స్థాయి లో పాల్గొన్న వివిధ విద్యార్థులకు లిటిల్ ఫ్లవర్ స్కూల్ ఎల్ సిరి, ఎస్స్ .ర్ స్కూల్ టి దీప్తి, గర్ల్స్ హై స్కూల్ కీర్తన, ఆత్మకూర్ సోషల్ వెల్ఫేర్ ఎం త్రివేణి, శారదా స్కూల్ షేక్ హసన్, బాయ్స్ హై స్కూల్ రవితేజ, బాలాజీ స్కూల్ నుండి జి. సాయి ధృతి మరియు చైతన్య స్కూల్ నుండి రక్షిత లను గర్ల్స్ హై స్కూల్ ప్రిన్సిపల్ మధు చేతుల మీదుగా అలాగే పాఠశాల ఉపాధ్యాయుల చేతులమీదుగా ఎగ్జామ్ ప్యాడ్, షీల్డ్ లను బహూకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు బొచ్చు కళ్యాణ్ పరకాల మండల అధ్యక్షులు మడికొండ ప్రశాంత్ పరకాల పట్టణ అధ్యక్షులు బొచ్చు ఈశ్వర్ అలాగే ఉపాధ్యాయులు పుష్ప, రమాదేవి, సాంబయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు..

# నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వడమే కాంగ్రెస్ లక్ష్యం.

## పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి.



పరకాల మార్చి 6 (వుదయం ప్రతినిధి): పరకాల నియోజకవర్గం గీసుగొండ మండలం కొనాయమాకుల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ళకు ముగ్గుపోసి,భూమిపూజ కార్యక్రమంలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....
కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదలందరికీ సొంతింటి కల నెరవేర్చేందుకు ఇళ్లు లేని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను అందజేయాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు.ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి ఒక్కరికి సంక్షేమథకాలు అందిస్తున్నామని అన్నారు.ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం లబ్ధిదారులకు రూ.5 లక్షల వరకు ఆర్థిక సహాయం అందనుంది అని,ఈ నిధులను నాలుగు విడతల్లో ప్రభుత్వం అకౌంట్లో జమ చేస్తామని అన్నారు.ఇంటి నిర్మాణం స్థలం కలిగి ఉన్న కుటుంబాలకు మొదటి విడతలో అందజేస్తామన్నారు. ప్రాధాన్యత క్రమంలో అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు.సొంతింటి కల సహకారం కోసం ప్రజలు పదేళ్లుగా ఎదురు చూశారని, ఇచ్చిన మాట ప్రకారం ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభించామని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల ఇళ్ల నిర్మాణానికి, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తుందన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను మంజురుచేస్తామని ఇండ్ల కోసం ఎవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, విడతల వారీగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్లు మంజూరు అవుతాయన్నారు.

# మూఢనమ్మకాలపై మ్యాజిక్ షో




జన్నారం, మార్చ్ 6(వుదయం విలేఖరి) జన్నారం మండలంలోని కలమడుగు వివేకానంద పాఠశాలలో మూఢ నమ్మకాలపై ప్రముఖ మెజిషియన్ మహ్మద్ ఇస్మాయిల్ మ్యాజిక్ షో చేశారు.మాయలు, మంత్రాలు, దయ్యాలు, భూతాలు లేవని, మోసం చేయడానికి వచ్చే వారిని నమ్మవద్దని విద్యార్థులకు మ్యాజిక్ షో ద్వారా తెలియజేశారు.ఈ సందర్భంగా డబ్బాలో నుంచి జాతీయ పతాకం తీయడం , బ్లేడ్లను మింగడం, గుడ్డు మాయం చేయడం, డబ్బులు మాయం చేయడం ఎలాగో టెక్నిక్ తో చేసి చూపించాడు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సతీశ్‌గౌడ్, ఇంచార్జీ తిరుపతి తదితరులున్నారు.

# పుట్టినరోజు వేడుకలో పాల్గొన్న ఝాన్సీ రెడ్డి



పెద్దవంగర, మార్చి 6 (వుదయం ప్రతినిధి):మండలంలోని ఉప్పారిగూడెం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దుంపలు శ్యామ్ మనవడు జయాన్సు మొదటి పుట్టినరోజు వేడుకల్లో పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి పాల్గొని చిరంజీవిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు . ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ ఉపాధ్యక్షులు రంగు మురళి గౌడ్, ఇంచార్జి గంజి విజయ పాల్ రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి పొడిషెట్టి సైదులు, ఒరిగంటి సతీష్, మండల బీసీ సెల్ అధ్యక్షులు దాసరి శ్రీనివాస్, మండల ఎస్టి సెల్ అధ్యక్షులు సీతారాం నాయక్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు అనపురం శ్రీనివాస్, మార్కెట్ డైరెక్టర్ ముత్యాల పూర్ణచంధర్, గోపాల్ నాయక్,మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఎరుకల సమ్మయ్య గౌడ్,సీనియర్ నాయకులు సాంకేపెల్లి రవీందర్ రెడ్డి,దుంపల అశోక్, వేముల వెంకన్న,యూత్ నాయకులు ముసుకు శోభన్,సుధాకర్,ముత్తినేని సోమన్న,సాట్టు యాకన్న,పంతుల్ నాయక్, సుధాకర్, మోరయ్య, తదితరులు, ఉన్నారు..

# బిజెపి అభ్యర్థుల విజయోత్సవ సంబరాలు



కాసిపేట మార్చి 6 (వుదయం విలేకరి) భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు సూరం సంపత్ కుమార్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ముత్యం పల్లి బైపాస్ రోడ్ బిజెపి గద్దె వద్ద టీచర్స్ ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ చిన్మలై అంజిరెడ్డి విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బిజెపి కాసిపేట మండల నాయకులు పటాసులు పేల్చి స్వీట్లు పంచుకొని విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు ఈ కార్యక్రమంలో బిజెపి మండల సీనియర్ నాయకులు దేవునూరి సంతోష్ కుమార్, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి, రెడ్డి బాలరాజు, మండల ఉపాధ్యక్షులు బాకీ కిరణ్ ,పెద్దపెల్లి శంకర్, మండల కార్యదర్శి దోమల రామచందర్, బీజేవైఎం మండల అధ్యక్షులు మెస్రం తిరుపతి ఎస్సీ వోచ మండల అధ్యక్షులు రామటె%శీ%కి వినయ్ కుమార్ , బీజేవైఎం నాయకులు చొప్పదండి విష్ణువర్ధన్, ఎస్టి మోర్చా మండల అధ్యక్షులు ఇస్లావత్ సంపత్ నాయక్, వచ్చీసుబ్రభారీలు రంజిత్, తిరుపతి, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

# ఇందిరమ్మ ఇల్లు భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న పరకాల శాసనసభ్యులు రేవూరి.



పరకాల మార్చి 6 (వుదయం ప్రతినిధి): సంగెం మండలం కేంద్రం షాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ళకు ముగ్గుపోసి,భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....సొంతింటి కల సహకారం కోసం ప్రజలు పదేళు ్లగా ఎదురు చూశారని, ఇచ్చిన మాట ప్రకారం ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభించామని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల ఇళ్ల నిర్మాణానికి, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తుందన్నారు.బడుగు వర్గాల ఆత్మగౌరవం ఇందిరమ్మ ఇల్లు అని, వీటి పట్టాల పేరు మహిళల పేరు మీదనే ఉంటాయని అన్నారు.పనులు జరుగుతున్న క్రమంలో నిధులు విడుదల చేయడం జరుగుతుందని త్వరగా పనులు పూర్తిచేయాలని లబ్ధిదారులకు తెలియజేశారుఅర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను మంజురుచేస్తామని ఇండ్ల కోసం ఎవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, విడతల వారీగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్లు మంజూరు అవుతాయన్నారు.

# విద్యార్థులను పరీక్షా కేంద్రాలకు జాగ్రత్తగా తీసుకోని రావాలి



జయశంకర్ భూపాలపల్లి మార్చి 06(వుదయం ప్రతినిధి) విద్యార్థులను పరీక్ష కేంద్రాలకు తీసుకువచ్చే సమయంలో జాగ్రత్తలు పాటించాలని అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని11 కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు మరియు 6 ఆదర్శ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న ఇంటర్మీడియట్ స్పెషల్ ఆఫీసర్లు ప్రిన్సిపాల్ లతో అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి జూమ్ మీటింగ్ నిర్వహించరు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులను పరీక్షా కేంద్రాలకు రవాణా చేయు సందర్భాలలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని తప్పనిసరిగా ఒక ఉపాధ్యాయున్ని ఎస్కార్ట్ గా విద్యార్థులతో పంపాలని, దూర ప్రాంతం ఉన్న పాఠశాలలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీకి ఆదేశించారు. అలాగే విద్యార్థులు పరీక్ష వ్రాసి వచ్చిన తర్వాత ఆహార విషయాలలో శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థులు అందరూ పరీక్షకు హాజరయ్యే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి యం. రాజేందర్ ఆర్టీసీ, మైనారిటీ, సోషల్ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులు డిజిటల్ లెర్నింగ్ పై అవగాహన పెంచుకోవాలి

## నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



నారాయణపేట టౌన్ మార్చి 06(వుదయం ప్రతినిధి) విద్యార్థులు డిజిటల్ లెర్నింగ్ పై అవగాహన పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు.గురువారం జాజాపూర్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదివే పిల్లలతో డిజిటల్ లేర్నింగ్ పొందిన విద్యార్థుల ప్రెసెంటేషన్ చూసి జిల్లా కలెక్టర్ ప్రశంసించారు. గూగుల్ టూల్స్, ఈమెయిల్, వివిధ యాప్స్ వినియోగంతో స్కూల్ ప్రాజెక్టులు చేయడం చాలా బాగుందని గ్రామీణ విద్యార్థులకు ఇలా డిజిటల్ వినియోగం పట్ల అవగాహన కల్పిస్తున్న డిజిటల్ ఈక్వటీ సంస్థ ఓంకార్, స్థానిక డిగ్రీ కళాశాల సెంటర్ విద్యార్థులను అభినందించారు. అన్ని టాపికల్స్ పై పిల్లలు మంచిగా నేర్చుకున్నారని కలెక్టర్ డీఈవో హెడ్మాస్టర్ స్టూడెంట్స్ ని అభినందించారు. స్ఫూర్తి డిగ్రీ కళాశాల పిల్లలకు పది రోజుల శిక్షణ ఇవ్వడం అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ గోవిందరాజు ఎస్. ఓ.సాగర్, తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీడీవో ను ఆహ్వానించిన ప్రగతి గ్రామ సమైక్య

## సిహెచ్ సుభాషిని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కు మహిళా దినోత్సవ ఆహ్వానం



భద్రాద్రి కొత్తగూడెం మార్చ్ 06 (వుదయం ప్రతినిధి ):భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం పరిషత్ కార్యాలయంలో చుంచుపల్లి మండలం గౌతంపూర్ గ్రామపంచాయతీలో ప్రగతి గ్రామ సమైక్య వివోఏ పద్మ ఆధ్వర్యంలో మార్చి 11 మంగళవారం గౌతమ్ పూర్ గ్రామపంచాయతీ సింగరేణి కమ్యూనిటీ హాల్ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు పాల్గొనాలని చుంచుపల్లి మండల పరిషత్ అధికారిని సుభాషి కి ఆహ్వానం అందజేసిన గౌతమ్ పూర్ ప్రగతి గ్రామ సమాఖ్య సభ్యులు. సానుకూలంగా స్పందించిన ఎంపీడీవో తప్పకుండా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు హాజరవుతానని తెలియజేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవనిర్వాహక కమిటీ సభ్యులు సుమలత ఉమాదేవి లావణ్య పాల్గొన్నారు.

# రోడ్ తొలగించిన వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి..

## ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షులు ఎలుకటి రాజయ్య మాదిగ.





భూపాలపల్లి మార్చి06(వుదయం ప్రతినిధి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం కలికోట - ముత్తారం మండలం ఓడేడు గ్రామాల మధ్యలో ఉన్న మానేరు వాగులో ఉన్న మట్టి రోడ్ ను తొలగించిన వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ టీ ఎస్ జిల్లా అధ్యక్షులు ఎలుకటి రాజయ్య మాదిగ అన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానేరు వాగులో కొంతమంది వ్యక్తులు అక్రమంగా రోడ్ నిర్మాణం చేసి టోల్ టాక్సీ వసూలు చేస్తున్న విషయం గురించి గత కొన్ని రోజులుగా వివిధ పత్రికల్లో వార్తకథనాలు వచ్చిన నేపథ్యంలో స్పందించిన అధికారులు టోల్ టాక్స్ వసూలు చేయకుండా చర్యలు తీసుకోగా, సంబంధిత వ్యక్తులు కక్ష పూరిత చర్యల్లో భాగంగా మట్టి రోడ్ ను జేసీబీ ల సహాయంతో ధ్వంసం చేయడం దారుణం అని, రోడ్ ధ్వంసం చేయడం మూలంగా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, అనుమతి లేకుండా, వ్యక్తిగత స్వలాభం కోసం రోడ్ నిర్మాణం చేసి అక్రమంగా డబ్బులు వసూల్ చేసిందే కాకుండా, చట్టపరంగా అధికారులు టోల్ టాక్స్ వసూలు చేయకుండా చర్యలు తీసుకుంటే రోడ్ ధ్వంసం చేయడం హేయమైన చర్య అని ఇకనైనా సంబందిత అధికారులు స్పందించి అక్రమంగా రోడ్ ధ్వంసం చేసిన వ్యక్తులను గుర్తించి వారిపైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, మంత్రి శ్రీధర్ బాబు భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు స్పందించి మళ్ళీ రోడ్ నిర్మాణం చేసి ప్రయాణికుల బాధలు తీర్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# పరీక్షా కేంద్రాలను సందర్శించిన అదనపు కలెక్టర్



హనుమకొండ, మార్చి 06(వుదయం జిల్లా ప్రతినిధి) : హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎ. వెంకట్ రెడ్డి ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను గురువారం సందర్శించారు. హనుమకొండ వడ్డేపల్లి లోని ప్రభుత్వ పింగిళి బాలికల జూనియర్ కళాశాల, హనుమకొండ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, రెజోనేన్స్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి పరిశీలించారు.

పరీక్షా కేంద్రాలలో చేసిన తాగునీరు, తదితర ఏర్పాట్లను గురించి అధికారులను జిల్లా అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

# భక్త మార్కండేయ విగ్రహ ప్రతిష్టాపనలో మాజీ ఎమ్మెల్యే

నారాయణఖేడ్, మార్చి06(వుదయం ప్రతినిధి): నారాయణఖేడ్ మండలం వెంకటాపురం చౌరస్తా వద్ద నూతనంగా నిర్మించిన శ్రీ భక్త మార్కండేయ ఆలయంలో భక్త మార్కండేయ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహా రెడ్డి భూపాల్ రెడ్డి పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదములు స్వీకరించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్ నాయక్, తదితరులు ఉన్నారు.

# పేద ముస్లింలకు నిత్యవసరాలు పంపిణీ.



కోదాడ టౌన్ మార్చి 6(వుదయం) రంజాన్ పర్వదినం పురస్కరించుకొని బాబు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం కోదాడ పట్టణంలోని షాదిఖానా లో 700 మంది ముస్లిం పేదలకు నిత్యవసర సరుకుల కిట్లను పంపిణీ చేసినట్లు బాబు చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ మౌలానా అహ్మద్ నద్వి తెలిపారు. గత పది సంవత్సరాలుగా బాబు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.రంజాన్ మాసం మొత్తం పట్టణంలోని అన్ని వీధుల్లో పేదలను గుర్తించి అనేక సహాయ సహకారాలు అందించే కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా విద్యా, వైద్యం నిత్యవసరాలు కనీస అవసరాలు తీర్చడమే బాబు చారిటబుల్ ట్రస్ట్ లక్ష్యంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోదాడ ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదవశాస్తూ తాడిచెట్టు పైనుండి జారిపడ్డ గీత కార్మికుడు.



పరకాల మార్చి 6 (వుదయం ప్రతినిధి) పరకాల నియోజవర్గం నడి కూడా మండలం రాయపర్తి గ్రామానికి చెందిన మార్క సమ్మయ్య వయసు 48 సంవత్సరాలు తండ్రి సాంబయ్య వృత్తి రీత్యా గౌడ కులస్తుడైన సమ్మయ్య రోజు మాధురిగానే గురువారం సాయంత్రం 5:30 నిమిషాలకు తాడిచెట్టు ఎక్కి దిగుతున్న సందర్భంలో ప్రమాదవశాస్తు మోకు జారడంతో చెట్టు పై నుండి కింద పడడంతో కాళ్ళకి చేతులకి తీవ్రమైన గాయాలు కావడంతో తోటి గౌడ సంఘం సభ్యులు రాయపర్తి గ్రామ గౌడ సంఘం అధ్యక్షులు మార్క తిరుపతి సమ్మయ్య గౌడ్ ని హుటాహుటిన పరకాల ఆస్పత్రికి తరలించడం జరిగింది. ఈ సందర్భంగా గౌడ సంఘం అధ్యక్షులు మార్క తిరుపతి మాట్లాడుతూ... తాటి చెట్టు పై నుండి పడి తీవ్ర గాయాల పాలైన మార్క సమ్మయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

# జర్నలిస్టు రఘు కుటుంబానికి ఆర్థిక సహాయం



కోదాడ టౌన్ మార్చి 6(వుదయం) కోదాడ నియోజకవర్గ ఎలక్ట్రాక్ మీడియా అధ్యక్షులు పడిశాల రఘు ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన సంఘటన మీడియా రంగానికి తీవ్ర లోటని ఇండియన్ జర్నలిస్టు యూనియన్ జిల్లా అధ్యక్షులు గింజల అప్పిరెడ్డి అన్నారు. శుక్రవారం ఐ జే యు ఆధ్వర్యంలో రఘు కుటుంబాన్ని పరామర్శించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 20 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మీడియా రంగంలో రఘు కనబరిచిన ప్రతిభ ఎనలేనిదని కొనియాడారు.ఆయన మృతికి ఐ జే యు ప్రగాఢ సానుభూతి ప్రకటిస్తున్నట్లు తెలిపారు. జర్నలిస్టు రఘు కుటుంబానికి అండగా ఉంటామన్నారు.ఈ కార్యక్రమంలో కోదాడ ఐ జే యు ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు సలిగంటి మురళి,ఆవుల మల్లికార్జున్, శ్రీనివాస్, దామోదర్,అజయ్,కరుణాకర్, రమేష్, నాగరాజు తదితర జర్నలిస్ట్ లు పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్షా కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్



కోదాడ సూర్యాపేట మార్చి 6(వుదయం) సూర్యాపేట జిల్లాలో జరుగుతున్న ఇంటర్ సెకండియర్ పరీక్షా కేంద్రాలను కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.పరీక్ష నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించి, విద్యార్థుల హాజరు శాతం వివరాలను చీఫ్ సూపరింటెండెంట్ యాదయ్య ను అడిగి తెలుసుకున్నారు. సీ.సీ కెమెరా నిఘా నడుమ నిబంధనలకు అనుగుణంగా పరీక్ష నిర్వహించాలని, పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతి, అత్యవసర వైద్య సేవ కేంద్రం ఏర్పాటు, మరుగుదొడ్లు, కళాశాలలో ఎలాంటి వ్యర్థాలు లేకుండా పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సజావుగా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. పరీక్ష పూర్తయిన వెంటనే జవాబు పత్రాలను పోలీసు బందోబస్తు మధ్య క్లోస్డ్ వాహనంలో నిర్దేశిత కేంద్రాలకు తరలించాలని సూచించారు. పరీక్షలు పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. సెల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్ వాచీలు వంటి ఉపకరణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించకూడదని, నిశిత పరిశీలనతో విద్యార్థులను అనుమతించాలని స్పష్టం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి మందులను పరిశీలించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎండలు బాగ ఉండటంవలన విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.జిల్లా జరిగిన ఇంటర్మీడియట్ సెకండియర్ సెకండ్ లాంగ్వేజ్ పరీక్షలో 7695 విద్యార్థులకు గాను 7416 మంది పరీక్షలకు హాజరయ్యారని 279 గైర్హాజరయ్యారని తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్యామ్ సుందర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

- ప్రతి జర్నలిస్ట్ కి టీజేయూ అండగా ఉంటుంది
- టీజేయూ జిల్లా అధ్యక్షులు ఎం డి.షానూర్



యాదాద్రి భువనగిరి / మార్చి వుదయం ప్రతినిధి : తుర్కపల్లి మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ పాల్గొని మాట్లాడుతూ... ప్రతి జర్నలిస్ట్ కి టీజేయూ అండగా ఉంటుందని, జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న ఏకైక యూనియన్ టీ జే యూ అని అన్నారు.
జిల్లాలోని జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల సమస్యలను పరిష్కరించి పట్టాలు అందజేయాలనీ, ఇందిరమ్మ గృహ పథకంలో ప్రతి ఒక్క వర్కింగ్ జర్నలిస్టుకి ఇల్లు కట్టించాలని ప్రభుత్వాన్ని కోరారు. జర్నలిస్టులకు ఉచిత ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలని, జర్నలిస్టుల కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య సదుపాయాలు అందించాలని, 50 సం దాటిన ప్రతి వర్కింగ్ జర్నలిస్టుకు 15 వేల రూపాయల పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టి జె యు తుర్కపల్లి మండల అధ్యక్షులు షేక్ బురాన్, ఉపాధ్యక్షులు నరసింహులు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఫని పాల్గొన్నారు.

# అయిజ మున్సిపాలిటీ పరిధిలోని రేషన్ షాపులను తనిఖీ చేసిన

**ఎన్ఫోర్సుమెంట్ తహశీల్దార్ ప్రశాంత్ గౌడ్**



అలంపూర్ మార్చి 6 (వుదయం ప్రతినిధి)అయిజ మున్సిపాలిటీ పరిధిలోని 18 రేషన్ షాపులకు గాను కొన్ని షాపులను మాత్రమే ఎన్ఫోర్స్ మెంట్ తహశీల్దార్ ప్రశాంత్ గౌడ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేషన్ బియ్యం ను ఎవరు అమ్ముకోవద్దని, వాటిలో పోషకాలు ఎక్కువగా వుంటాయని తెలిపారు. ఈ బియ్యంలో విటమిన్ బి 12, ఫోరిక్ ఆమ్లం, ఐరన్ వంటి ఎన్నో పోషక విలువలు కలిగి ఉంటాయని తెలిపారు. కావున రేషన్ కార్డ్ దారులు బియ్యాన్ని అమ్ముకొనక, ఆరోగ్యం కొరకు తినండని తెలిపారు. డీలర్లు కూడా సమయపాలన పాటించి సక్రమంగా బియ్యం పంపిణీ చేయాలని తెలిపారు. రికార్డ్స్ ను, స్టాక్స్ ను తనిఖీ చేసి ఎటువంటి తేడాలు ఉండరాదని తెలిపారు.

# ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అంజిరెడ్డి విజయం సందర్భంగా సంబరాలు

**బిజేపి మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ**



అలంపూర్ మార్చి 6 (వుదయం ప్రతినిధి) జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలం బింగి దొడ్డి గ్రామంలో బిజేపి పార్టి మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో కరీంనగర్ మెదక్ నిజాంబాద్ ఆదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి అంజిరెడ్డి విజయం సాధించడం సందర్భంగా గ్రామ గ్రామాన బాణాలు పేల్చి అందరూ ఆనందంగా స్వీట్లు పంచుకోవడం జరిగింది. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ తెలంగాణలో బిజెపి ఎక్కడ ఉంది అన్న నాయకులకు ఈ విజయం నిదర్శనం, ఇప్పుడైనా కళ్ళు తెరుచుకొని చూడాలని అన్నారు. రెండు ఎమ్మెల్సీ స్థానాలు సాధించడం అంటే అంత సులభం కాదు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీని తలదన్ని ఎమ్మెల్సీ స్థానాలను బిజెపి కైవసం చేసుకున్నదని సంతోషం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో దేశ ప్రధాని మన ప్రియతమ నేత నరేంద్ర మోడీ దేశమే ముఖ్యం దేశ ప్రజల సంక్షేమమే చాలా ముఖ్యమని వారి అభివృద్ధి కోసం నీతిగా పనిచేస్తున్న వ్యక్తి మన నరేంద్ర మోడీ అని తెలిపారు. ఈరోజు భారతదేశంలోనే కాదు ప్రపంచంలోని ఆర్థికంగా ఎదుగుతున్న దేశం భారతదేశం అందుకు కృషి చేస్తున్న మన నరేంద్ర మోడీ కాబట్టి రాబోయే రోజుల్లో కూడా తెలంగాణ రాష్ట్రంలో గ్రామాలలో కూడా కాషాయం జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేయడం జరిగింది. వచ్చే అసెంబ్లీ ఎలక్షన్లలో కూడా కచ్చితంగా బిజెపి అధికారకం లోకి వస్తుంది. కాబట్టి దేశ భవిష్యత్తు కోసం బిజెపి మాత్రమే పనిచేస్తుందని ఈ కార్యక్రమం ద్వారా వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి బూత్ అధ్యక్షులు నరసింహులు, ఆంజనేయులు, కురువ సవారి, శ్రీనివాసులు, మద్దిలేటి, రామకృష్ణ, గ్రామ ప్రజలు యువకులు పాల్గొనడం జరిగింది.

# భక్త మార్కండేయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న GMR ఫౌండేషన్ చైర్మన్ గుబ్బపు మచ్చేందర్.



నారాయణఖేడ్ మార్చి06(వుదయం ప్రతినిధి): పట్టణంలో భక్త మార్కండేయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో GMR ఫౌండేషన్ చైర్మన్ గుబ్బపు మచ్చేందర్ మాట్లాడుతూ భక్త మార్కండేయుని జీవిత గాథ ప్రతి భక్తుడికి ఆదర్శప్రాయం అని, ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో సానుకూల భావజాలాన్ని పెంచుతాయని తెలిపారు.కార్యక్రమానికి నమ్లిమెట్ తాజా మాజీ సర్పంచ్ సత్యపాల్ రెడ్డి, అంజయ్య, నారాయణఖేడ్ 4వ వార్డ్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్ అనుమల, తుకారం, శ్రీనివాస్, సతీష్ , పండరి, తదితరులు పాల్గొన్నారు .

# మోటకొండూర్ లో బిజెపి నాయకుల విజయోత్సవ సంబరాలు



యాదాద్రి భువనగిరి / మోటకొండూర్ : మార్చి వుదయం ప్రతినిధి : కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీలు ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా మల్కా కొమురయ్య, పట్టభద్రులు ఎమ్మెల్సీగా అంజి రెడ్డి గెలుపొందిన సందర్భంగా మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మోటకొండూర్ మండల పార్టీ అధ్యక్షులు యెల్లంల శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి విజయోత్సవ సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పీసరి తిరుమలరెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు చిర్ర రవీందర్ జిల్లా కౌన్సిల్ మెంబర్ తండా కృష్ణ కిసాన్ మోర్చా అధికార ప్రతినిధి పాశం కృష్ణారెడ్డి జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు అనంతుల పాండురంగారెడ్డి మండల నాయకులు ఆలేటి నాగరాజు పల్ల జితేందర్ రెడ్డి బాల్ద నర్సింహులు భూమండ్ల సతీష్ సుల్తాన్ మహేందర్. బిజెపి నాయకులు శనివారం ప్రదీప్ భూమండ్ల మురళి పెరబోయిన నరేష్ రేగు మల్లేష్ గుర్రం అంజిరెడ్డి తొడిగల నరేందర్ రెడ్డి భూత్ అధ్యక్షులు నుచ్చు క్రాంతి కుమార్ పూర్ణ తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆక్రమణకు గురి అయిన కొత్త బావిని పునరుద్ధరించండి

**ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కో కన్వీనర్ శంకర ప్రభాకర్.**





గద్వాల మార్చి 6 (వుదయం ప్రతినిధి) గద్వాల సంస్థానాదీసుల కాలంనాటి కొత్త బావిపై అక్రమ కట్టడాలను ఆపి వారిపై తగు చర్యలు తీసుకోని ఆ బావిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పురావస్తు శాఖకు కు అప్పగించి పురాతన నీటి నిల్వ వ్యవస్థ రక్షించాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కో కన్వీనర్ శంకర ప్రభాకర్ డిమాండ్ చేశారు. గత జనవరి నెలలో మున్సిపల్ కమిషనర్, జిల్లా కలెక్టర్, జిల్లా అదనపు కలెక్టర్, గద్వాల ఎమ్మెల్యే లకు క్రీడా, ప్రజాసంఘాల, సీనియర్ సిటిజన్ ఫోరం, రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు వినతి పత్రం అందజేశామని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల పట్టణంలో బాలుర ఉన్నత పాఠశాల ముందర ఉన్న కొత్త బావి నీ కూల్చి అక్రమంగా షాపులను నిర్మిస్తున్నారని, అది రాజుల కాలం నాటి బావి అని దానిని కాపాడవలసిన బాధ్యత మనపై ఎంతైనా ఉందని, కానీ భావి ప్రాంగణంలో కమర్షియల్ కాంప్లెక్స్ కట్టి షెటర్స్ ను రోడ్డుకు పెట్టారని, పక్కన నే అనంత కన్వెన్షన్ హాల్ యొక్క ఎక్సిస్ట్ ఫ్యాన్లను క్రీడా మైదానం వైపు పెట్టారని దానివలన వాకర్స్, క్రీడాకారులు అనారోగ్యానికి గురి కావడం జరుగుతుందనీ, క్రీడా ప్రాంగణం ను కూడా ఆక్రమించుకున్నట్లు తెలుస్తుందని ఆక్రమణకు గురి అయిన ప్రాంగణమును పరిశీలించి వారిపై తగు చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో కరపత్రంలను ముద్రించి, ప్రజలకు అవగాహన కల్పించి తమ కార్యాచరణను మొదలు పెడతామని, గతంలో ఎన్నోసార్లు అధికారులను, ప్రజాప్రతినిధులను కూడా కలిసామని నేటి వరకు దానిపై ఎలాంటి చర్య తీసుకోకుండా అధికారులు, ప్రజా ప్రతినిధులు మౌనం పాటిస్తున్నారని ఆ మౌనం అంతర్యం ఏమో అర్థం కావడంలేదని, అక్రమనకు గురి అయిన కొత్త బావి, గద్వాల కోట కూడా అక్రమాలకు గురైందని వెంటనే ప్రభుత్వం స్వాధీనం చేసుకొని చారిత్రక కట్టడాలను పునరుద్ధరించాలని ఆయన ఈ సందర్భంగా అన్నారు. లేకపోతే ప్రజా ఉద్యమాలు ఉద్రిక్తం చేస్తామని ఆయన అన్నారు.

# వివాహ వేడుకలో పాల్గొన్న GMR ఫౌండేషన్ చైర్మన్ గుబ్బపు మచ్చేందర్.



నారాయణఖేడ్ మార్చి06(వుదయం ప్రతినిధి): నియోజకవర్గం పరిధిలోని కల్హేర్ మండలంలోని మార్ది గ్రామానికి చెందిన గుబ్బపు రాములు కుమారుడు గుబ్బపు మధు ( NRI ) వివాహ మహోత్సవం ఘనంగా నిర్వహించబడింది.ఈ వేడుకలో GMR ఫౌండేషన్ చైర్మన్ గుబ్బపు మచ్చేందర్. పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే వివాహానికి మాజీ రాష్ట్ర ఆత్మ కమిటీ డైరెక్టర్ అనుముల మారుతి, కృష్ణాపూర్ మాజీ సర్పంచ్ బేతయ్య, నాగిరెడ్డి, గుబ్బపు శ్రీనివాస్, పెద్ద రాజ, వెంకన్న, చంద్రశేఖర్, నర్సాపూర్ చరణ్, గుబ్బపు సాయిలు, సంగమేశ్వర్, రాషేకర్, సైదు గారి చిరంజీవిలు ( ex-MPTC ), నర్సింలు, శ్రీనివాస్, అనుముల తుకారం, మల్లేశం తదితర పాల్గొన్నారు.

# కలెక్టరేట్లో రెండో రోజు ఉత్సాహంగా క్రీడా పోటీలు


సంగారెడ్డి, మార్చి06(వుదయం ప్రతినిధి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో రెండో రోజు గురువారం మహిళా ఉద్యోగుల ఆటల పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు.

వివిధ శాఖలలో పనిచేసే మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా మ్యూజికల్ చైర్, రంగోలి,

చెస్, తదితర పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు ఈనెల 8వ తేదీన మహిళా దినోత్సవం సందర్భంగా బహుమతులు అందిస్తామని టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు జావిద్ తెలిపారు.

# ఎమ్మెల్సీల గెలుపుపై బీజేపీ విజయోత్సవ సంబరాలు

దేవరకద్ర, మార్చి06(వుదయం ప్రతినిధి): దేవరకద్ర మండల కేంద్రంలో బిజెపి నాయకులు గురువారం ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ విజయోత్సవ సంబరాలు మండల బీజేపీ అధ్యక్షులు కృష్ణంరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. రానున్న కాలంలో రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగురవేనున్నది అన్నారు.
ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రాచాల రాజు, ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి దేవన్న సాగర్, అమరేందర్ రెడ్డి, నాగిరెడ్డి, సత్యనారాయణ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్






## ఎట్టకేలకు నష్టాలకు తెర

రిలీఫ్ ర్యాలీతో బుధవారం దేశీయ స్టాక్ మార్కెట్ మంచి లాభాలతో ముగిసింది. సెన్సెక్స్ 740.30 పాయింట్ల లాభంతో 73,730.23 వద్ద, నిఫ్టీ 254.65 పాయింట్ల లాభంతో 22,337.30 వద్ద ముగిశాయి. దీంతో గత పది రోజుల నిఫ్టీ నష్టాలకు బ్రేక్ పడింది. ఈ రిలీఫ్ ర్యాలీతో బీఎసఈ లిస్టెడ్ కంపెనీల షేర్ల మార్కెట్ విలువ బుధవారం రూ.7.97 లక్షల కోట్లు పెరిగి రూ.393.04 లక్షల కోట్లకు చేరింది. యుటిలిటీస్, పవర్, సర్వీసెస్, మెటల్, టెలికాం, కమోడిటీస్, ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీల షేర్లకు పెద్ద ఎత్తున కొనుగోళ్ల మద్దతు లభించడం, ప్రధాన అంతర్జాతీయ మార్కెట్లు మంచి లాభాలతో ట్రేడవడంబీ మెక్సికో, కెనడాలపై విధించిన సుంకాలపై అమెరికా పునరాలోచిస్తోందన్న వార్తలు ఇందుకు తోడయ్యాయి. ప్రధాన కరెన్సీలతో అమెరికా డాలర్ మారకం రేటు బలహీనపడడం కూడా ఇందుకు కలిసొచ్చింది. అయితే ట్రంప్ ప్రారంభించిన వాణిజ్య యుద్ధం దీర్ఘకాలిక ప్రభావంపై ఇంకా అనిశ్చితి కొనసాగుతోందని జియోజిత్ ఫైనాన్సియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. దీంతో ఈ రిలీఫ్ ర్యాలీ ఎన్నాళ్లు కొనసాగుతుందనే దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మైసూరు కేంద్రంగా పనిచేసే ఎక్సెల్‌సాఫ్ట్ టెక్నాలజీస్ కంపెనీ రూ.700 కోట్ల ఐపీఓకు సిద్ధమవుతోంది. కంపెనీ ఇందు కోసం ఇప్పటికే సెబీకి దరఖాస్తు చేసింది. కొత్త షేర్ల జారీ ద్వారా రూ.210 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫఎస్) ద్వారా రూ.490 కోట్లు సమీకరించనున్నట్టు తెలిపింది.

కొత్త షేర్ల జారీ ద్వారా సమీకరించే నిధులను కంపెనీ అభివృద్ధి కార్యక్రమాల కోసం వినియోగించనున్నట్టు తెలిపింది.

## ద్విచక్ర వాహన రుణాల్లో మందగింపు



ఆర్థిక వ్యవస్థ ప్రగతి తీరుకు అద్దం పట్టే వాహన పరిశ్రమ అమ్మకాలు ఒత్తిడి ఎదుర్కొంటుంది. దీంతో ముఖ్యంగా ద్విచక్ర వాహన రంగ రుణాలు మందగిస్తున్నాయని విత్త సంస్థల వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రజలు ఎక్కువగా కొనుగోలు చేసే ప్రాథమిక స్థాయి ద్విచక్ర వాహన పరిశ్రమ మరింత ఒత్తిడిని ఎదుర్కొంటుంది. మరోవైపు రుణాలపై కొనుగోలు చేసిన వారు చెల్లింపులు చేయలేక విఫలం అవుతున్నారు. ఆదాయాలు సన్నగిల్లడమే ఇందుకు ప్రధాన కారణం. దాదాపు 75 శాతం ద్విచక్ర వాహనాలు రుణాలపైనే విక్రయించ బడుతున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో ద్విచక్ర వాహన అమ్మకాలు 6 శాతం తగ్గి 13.5 లక్షల యూనిట్లకు పరిమితమయ్యాయి. తీసుకున్న రుణాలు చెల్లించలేకపోవడం, కొత్త అమ్మకాలు లేకపోవడం ఫైనాన్స్ రంగంలోని విత్త సంస్థలను బెంబేలెత్తిస్తున్నాయి. గతేడాది సెప్టెంబర్ చివరి నాటికి 1.50 లక్షల కోట్ల ద్విచక్ర వాహన రుణ బకాయిలు పేరుకుపోయాయి. ఇంతక్రితం ఏడాది నాటికి ఈ సంఖ్య 1.19 లక్షల కోట్లుగా ఉంది. పెరుగుతున్న లోన్ డిఫాల్ట్‌లను అరికట్టడానికి 2019 తర్వాత మొదటిసారిగా రుణం ఇవ్వడంపై ద్విచక్ర వాహన ఫైనాన్షియర్లు వెనక్కి తగ్గుతున్నారు. ఇచ్చినప్పటికీ రుణ కాలపరిమితిని తగ్గిస్తున్నాయని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. మొత్తం ద్విచక్ర వాహన పరిశ్రమ రుణాల చెల్లింపులు వైఫల్యాలు 150 బేసిస్ పాయింట్లు పెరిగాయని హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ అఖిలేష్ రారు పేర్కొన్నారు. తమ బ్యాంక్‌లో డిఫాల్ట్‌లు తులనాత్మకంగా 10-15 బేసిస్ పాయింట్లు పెరిగాయన్నారు. ద్విచక్ర వాహన ఫైనాన్సింగ్ విభాగంలో పెరుగుతున్న ఒత్తిడిని గమనిస్తున్నామని మరో బ్యాంక్ అధికారి పేర్కొన్నారు.

## బిలియనీర్లలో భారత్‌కు మూడో స్థానం..



భారతదేశంలో మిలియనీర్లు, బిలియనీర్లు పెరుగుతున్నారని గ్లోబల్ ప్రాపర్టీ కన్సల్టెంట్ సంస్థ 'నైట్ ఫ్రాంక్' నివేదిక వెల్లడించింది. మిలియనీర్ల పరంగా భారత్ నాలుగో స్థానంలో నిలిచినట్లు నివేదిక స్పష్టం చేసింది. ఈ జాబితాలో అమెరికా, చైనా, జపాన్ తొలి మూడు స్థానాల్లో ఉన్నాయని పేర్కొంది. అలాగే అపర కుబేరుల జాబితాలో ఇండియా మూడో స్థానంలో ఉన్నట్లు తెలిపింది. తొలి రెండు స్థానాల్లో అమెరికా, చైనా ఉన్నాయి. మన దేశంలో 191 మంది బిలియనీర్లు ఉన్నట్లు వెల్లడించింది. అత్యంత ధనవంతులు.. కుబేరులు ఎక్కువగా పశ్చిమ దేశాల్లోనే ఉంటారని అందరూ అనుకుంటారు.. కానీ, ఇది అవాస్తవం..ఇప్పుడు మన భారత దేశంలోనూ మిలియనీర్ల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. గత ఏడాదితో పోలిస్తే దేశంలో మిలియనీర్ల సంఖ్య 6 శాతం మేర పెరిగినట్టు గ్లోబల్ ప్రాపర్టీ కన్సల్టెంట్ సంస్థ నైట్ ఫ్రాంక్ ఓ నివేదికలో వెల్లడించింది. బుధవారం విడుదల చేసిన ఈ నివేదిక ప్రకారం..2024లో భారతదేశ బిలియనీర్ జనాభా భారీగా పెరిగిందని ప్రకటించింది. కన్సల్టెంట్ తన 'ది వెల్త్ రిపోర్ట్ 2025'లో ఈ డేటాను వెల్లడించింది. భారతదేశం ఇప్పుడు 191 మంది బిలియనీర్లకు నిలయంగా ఉంది. వీరిలో 26 మంది గత సంవత్సరంలోనే ఈ జాబితాలో చేరారు. భారత దేశంలో ఇప్పుడు మొత్తం మిలియనీర్ల సంఖ్య 85,698కు చేరుకొన్నట్టుగా నైట్ ఫ్రాంక్ వివరించింది. సంపన్నులు ఎక్కువగా ఉన్న దేశాల జాబితాలో టాప్-3లో మన దేశం కూడా ఉన్నట్టు 'నైట్ ఫ్రాంక్' నివేదిక వెల్లడించింది. కనీసం రూ. 8,500 కోట్ల కంటే ఎక్కువ సంపద కలిగినవారిని బిలియనీర్లుగా పిలుస్తారు. కాగా ప్రపంచంలోని మొత్తం కుబేరుల సంపద విలువ ఏకంగా రూ.1,275 లక్షల కోట్లకు చేరింది. ప్రపంచంలోని మొత్తం కుబేరుల సంపద విలువ ఏకంగా రూ.1,275 లక్షల కోట్లకు చేరిందని నివేదిక స్పష్టం చేసింది. దేశంలో 396 మంది కుబేరులతో ముంబై అగ్రస్థానంలో ఉండగా, 217 మందితో ఢిల్లీ రెండో స్థానంలో నిలిచింది. ఇక, 104 మంది సంపన్నులతో హైదరాబాద్ ముచ్చటగా మూడో స్థానాన్ని దక్కించుకొన్నట్టు హురున్ ఇండియా రిచ్‌లిస్ట్-2024 నివేదికలో వెల్లడించింది. మొత్తంగా తెలంగాణలో 109 మంది, ఏపీలో 9 మంది సంపన్నులు ఉన్నట్టు నివేదిక వివరించింది. అలాగే, మన దేశంలో అత్యంత ధనిక కుటుంబాల జాబితాలో అంబానీ కుటుంబం 10.09 లక్షల కోట్లుతో మొదటి స్థానంలో ఉండగా, మిస్త్రీ కుటుంబం 3.25 లక్షల కోట్లుగా ఉంది. జిందాల్ కుటుంబం 2.43 లక్షల కోట్లు, బిర్లా కుటుంబం 1.99 లక్షల కోట్ల సంపదతో దేశంలోనే అత్యంత ధనవంతులుగా గుర్తింపు పొందారు.


## రూ.1500 కోట్లతో ఫుడ్ ప్రాసెసింగ్ ప్లాంట్



పతంజలి సంస్థ నాగ్‌పూర్‌లో 800 టన్నుల పండ్లను ప్రాసెస్ చేసే సామర్థ్యం గల భారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. సిట్రస్ పండ్లు, ఇతర పండ్లు, కూరగాయలను ప్రాసెస్ చేసి, రసం, జ్యూస్ కాన్సెంట్రేట్, గుజ్జు వంటి ఉత్పత్తులను తయారు చేస్తుంది. టెట్రా ప్యాక్ ప్యాకేజింగ్‌తో, రసాయనాలు లేకుండా, ప్రీమియం క్వాలిటీతో నాణ్యమైన ఉత్పత్తులు వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చేందుకు ఈ భారీ ప్లాంట్ ను నిర్మించింది.పతంజలి త్వరలో నాగ్‌పూర్‌లో పండ్లు, కూరగాయల ప్రాసెసింగ్ ప్లాంట్‌ను ప్రారంభించనుంది. ఈ ప్లాంట్ సిట్రస్ పండ్లు, కూరగాయలను ప్రాసెస్ చేయడం ద్వారా రసం, జ్యూస్ కాన్‌సెంట్రేట్, గుజ్జు, పేస్ట్, ప్యూరీలను ఉత్పత్తి చేస్తుంది. మిహాన్ (మల్టీ-మోడల్ ఇంటర్నేషనల్ కార్గో హబ్, విమానాశ్రయం)లోని పతంజలి మెగా ఫుడ్ అండ్ హెర్బల్ పార్క్ మార్చి 9న ప్రారంభం కానుంది. ఆరెంజ్ సిటీగా పిలువబడే నాగ్‌పూర్‌లో నారింజ, కిన్నో, స్వీట్ లైమ్, నిమ్మకాయ వంటి సిట్రస్ పండ్లు పుష్కలంగా లభిస్తాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఇక్కడ ఒక సిట్రస్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది పతంజలి సంస్థ. ఈ ప్లాంట్ రోజుకు 800 టన్నుల పండ్లను ప్రాసెస్ చేసే సామర్థ్యంతో నిర్మించారు. పూర్తిగా సహజమైన, ఎటువంటి అదనపు రసాయనాలు, లేదా చక్కెర ఉపయోగించకుండా ఇక్కడ ఫ్రుట్ జ్యూస్‌లు తయారు చేయనున్నారు. దీనితో పాటు, ఈ ప్లాంట్‌లో 600 టన్నుల ఉసిరి, 400 టన్నుల మామిడి, 200 టన్నుల జామ, 200 టన్నుల బొప్పాయి, 200 టన్నుల ఆపిల్, 200 టన్నుల దానిమ్మ, 200 టన్నుల స్ట్రాబెర్రీ, 200 టన్నుల ప్లం, 200 టన్నుల బేరి, 400 టన్నుల టమోటా, 400 టన్నుల బాటిల్ సొరకాయ, 400 టన్నుల కాకరకాయ, 160 టన్నుల క్యారెట్, 100 టన్నుల కలబంద వంటి పండ్లను కూడా ప్రాసెస్ చేస్తారు. ప్రపంచ ప్రమాణాల ప్రకారం రసం, రసం గాఢత, గుజ్జు, పేస్ట్, పురీని ఉత్పత్తి చేయడానికి ప్రతిరోజూ వీటిని ప్రాసెస్ చేస్తారు. పండ్ల నుండి నేరుగా ప్రాసెస్ చేసే ప్రక్రియను ప్రాథమిక ప్రాసెసింగ్ అంటారు. అలాగే నాగ్‌పూర్ ఫ్యాక్టరీలో టెట్రా ప్యాక్ యూనిట్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నారు. వినియోగదారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, టెట్రా ప్యాక్ ప్యాకేజింగ్‌లో ఎలాంటి ప్రిజర్వేటివ్‌లు లేదా చక్కెరను ఉపయోగించకుండా ప్రీమియం విభాగంలో ఉత్పత్తులను అందించనున్నారు.

## యూపీఐ ఖాతాదారులకు అలెర్ట్..

### ఏప్రిల్ 1 నుంచి కొత్త నిబంధనలు



భారతదేశంలో నోట్ల రద్దు తర్వాత నగదు లావాదేవీలను తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం ఎన్‌పీసీఐ ద్వారా యూపీఐ సేవలను పౌరులకు అందుబాటులోకి తీసుకొచ్చింది. తక్కువ సమయంలోనే యూపీఐ సేవలను ప్రజలను ఆకర్షించాయి. చిన్న మొత్తాల చెల్లింపులకు చాలా మంది యూపీఐను వాడుతున్నారు. ఈ నేపథ్యంలో బ్యాంకులు యూపీఐ రూల్స్‌ను ఏప్రిల్ 1 నుంచి మార్చనున్నాయి. ఆ కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ఏప్రిల్ 1 నుంచి యూపీఐ సేవల విషయంలో కొత్త నిబంధనలు అమల్లోకి తీసుకురానుంది. ముఖ్యంగా బ్యాంకులు డిస్‌కనెక్ట్ చేసిన, లేదా సరెండర్ చేసిన నంబర్‌లను ఎప్పటికప్పుడు తొలగించడం ద్వారా వారి జాబితాను క్రమం తప్పకుండా అప్‌డేట్ చేయాలని ఎన్‌పీసీఐ స్పష్టం చేసింది. నంబర్ ఆధారిత యూపీఐ చెల్లింపుల్లో వినియోగదారు సౌలభ్యాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా ఈ కీలక అప్‌డేట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. జూలై 16, 2024న స్టీరింగ్ కమిటీ సమావేశంలో చర్చించిన అంశాలకు అనుగుణంగా ఈ కొత్త నిబంధనను ఎన్‌పీసీఐ రూపొందించింది. తాజా మార్గదర్శకాల ప్రకారం బ్యాంకులు మొబైల్ నంబర్ రద్దు జాబితా తెలుసుకోవడానికి డిజిటల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్‌ను ఉపయోగించాలి. అలాగే కనీసం వారానికోసారి క్రమం తప్పకుండా వారి డేటాబేస్‌ను అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. యూపీఐ నంబర్‌ను సీడింగ్ లేదా పోర్ట్ చేయడానికి యూపీఐ యాప్‌లు స్పష్టమైన ఆప్ట్-అవుట్ ఎంపికతో స్పష్టమైన యూజర్ యాక్సెప్టెన్సీ పొందాలి. యూపీట్క యాప్ తప్పుదారి పట్టించే/బలవంతపు సందేశాలు లేకుండా స్పష్టమైన కమ్యూనికేషన్‌ను అందించాల్సి ఉంటుంది. ఎట్టిపరిస్థితుల్లోనూ లావాదేవీ సమయంలో లేదా సమయంలో యూజర్ యాక్సెప్టెన్సీను తీసుకోకూడదు. ఈ చర్యల కారణంగా యూపీఐ నంబర్ సీడింగ్ లేదా పోర్టింగ్ కమ్యూనికేషన్‌లు తప్పుడు కమ్యూనికేషన్‌ను తొలగించవచ్చు. ఈ నూతన మార్గదర్శకాలను బ్యాంకులు, పేమెంట్ సర్వీస్ సంస్థలు మార్చి 31, 2025 లోపు పాటించాలని ఎన్‌పీసీఐ స్పష్టం చేసింది. మార్చి 31, 2025 నాటికి అన్ని బ్యాంకులు, యూపీఐ సర్వీస్ ప్రొవైడర్లు ఈ కొత్త నియమాలను పాటించాలి. ఏప్రిల్ 1, 2025 నుంచి ఎన్‌పీసీఐతో వివరణాత్మక నెలవారీ నివేదికలను కూడా పంచుకోవాల్సి ఉంటుంది. మొబైల్ నంబర్లకు లింక్ చేసిన యూపీఐ ఐడీలు, నెలకు క్రియాశీల ప్రత్యేక వినియోగదారుల వివరాలను వెల్లడించాలి. అలాగే అప్‌డేట్ చేసిన మొబైల్ నంబర్ వ్యవస్థను ఉపయోగించి నిర్వహించిన లావాదేవీల సంఖ్యను కూడా పేర్కొనాల్సి ఉంటుంది. అలాగే స్థానికంగా పరిష్కరించిన యూపీఐ నంబర్ ఆధారిత లావాదేవీల వివరాలను తెలపాల్సి ఉంటుంది. ఎన్‌పీసీఐ చర్యల కారణంగా బ్యాంకులు వారానికోసారి మొబైల్ నంబర్ రికార్డులను అప్‌డేట్ చేయాలి. ఇలా చేస్తే విఫలమైన లేదా తప్పుదారి పట్టించే లావాదేవీల ప్రమాదం గణనీయంగా తగ్గుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## భారత్, చైనాపై ప్రతీకార టారిఫ్‌ల మోత



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత్, చైనాతో సహా అనేక దేశాలపై ఏప్రిల్ 2 నుంచి ప్రతీకార టారిఫ్‌లు విధిస్తున్నట్లు ప్రకటించారు. దశాబ్దాలుగా ఇతర దేశాలు అమెరికాపై టారిఫ్‌లు విధిస్తున్నాయని, ఇప్పుడు తమ సమయం వచ్చిందని ఆయన పేర్కొన్నారు. భారత్ 100% కంటే ఎక్కువ ఆటో టారిఫ్‌లు విధించిందని ఆయన గుర్తుచేశారు. అమెరికా విధించబోయే టారిఫ్‌లు భారత, చైనా ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. భారత్, చైనా సహా పలు దేశాలపై అమెరికా అధినేత డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌ల బాదుడుకు సిద్ధమయ్యారు. అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక తొలిసారి కాంగ్రెస్ జాయింట్ సెషన్‌లో ప్రసంగించిన ట్రంప్ కీలక ప్రకటన చేశారు. రెండోసారి పదవి చేపట్టిన ఆరు వారాల్లో తాను చేసిన పనులు సాధించిన విజయాలను గుర్తు చేసుకున్నారు. ఈ క్రమంలోనే పలు దేశాలపై విధిస్తున్న సుంకాలు గురించి ప్రస్తావించారు. భారత్, చైనా సహా పలు దేశాలపై ఏప్రిల్ 2 నుంచి ప్రతీకార సుంకాలు అమలు చేస్తామని వెల్లడించడం సంచలనంగా మారింది. కొన్ని దేశాలు దశాబ్దాలుగా తమపై టారిఫ్‌లు విధిస్తున్నాయని, ఇప్పుడు తమ టైమ్ వచ్చిందని అన్నారు. ఐరోపా సమాఖ్య, చైనా, బ్రెజిల్, భారత్ లాంటి చాలా దేశాలు తమ నుంచి అధికంగా టారిఫ్‌లు వసూలు చేస్తున్నాయని, అందులోనూ భారత్ 100శాతానికి పైగా ఆటో టారిఫ్‌లు విధించిందని గుర్తు చేశారు. ప్రస్తుత వ్యవస్థలతో అమెరికాకు ఎక్కడా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ఏప్రిల్ 2 నుంచి ఆయా దేశాలపై తాము కూడా ప్రతీకార సుంకాలు విధిస్తామని స్పష్టం చేశారు. ఆయా దేశాలు ఎంత టారిఫ్‌లు విధిస్తే, అదే స్థాయిలో తామూ వసూలు చేస్తామని తెలిపారు. ప్రతీకార టారిఫ్‌లతో అమెరికా మరింత సంపన్న దేశంగా, గొప్ప దేశంగా మళ్లీ అవతరిస్తుందన్నారు డొనాల్డ్ ట్రంప్.

# జాతీయం – అంతర్జాతీయం



## 'చలో చండీగఢ్'పై పోలీస్ నిర్బంధం

సుదీర్ఘ కాలంగా ఉన్న డిమాండ్ల సాధన కోసం సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కెఎం) బ్యానర్ కింద బుధవారం జరిగిన 'చలో చండీగఢ్' మార్చ్‌ను పంజాబ్ పోలీసులు అడ్డుకున్నారు. వివిధ వాహనాలతో బయలుదేరిన రైతులను చండీగఢ్ చేరుకోకుండా పోలీసులు నిరోధించారు. ఈ మార్చ్‌తో చండీగఢ్‌కు చేరుకున్న తర్వాత అక్కడ వారం పాటు ధర్నాకు రైతులు నిర్ణయించారు. అయితే, పోలీసులు అడ్డుకోవటంతో రైతుల కార్యాక్రమాలకు అవాంతరాలు ఎదురయ్యాయి. ఈ మార్చ్ నేపథ్యంలో పంజాబ్ అంతటా పోలీసులు బారికేడ్లు, చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. పలువురు రైతు నాయకులను అదుపులోకి తీసుకున్నారు. చండీగఢ్‌లోని దాదాపు అన్ని ప్రవేశ ద్వారాల వద్ద కూడా పోలీసులు భద్రతను పెంచారు. చండీగఢ్ పోలీసులు చండీగఢ్–మొహాలి సరిహద్దు వద్ద రైతులు నగరంలోకి ప్రవేశించకుండా నిరోధించడానికి బారికేడ్లను ఏర్పాటు చేశారు. అన్ని ప్రవేశ మార్గాల వద్ద భద్రతను ముమ్మరం చేశారు. పోలీసు సిబ్బంది అన్ని వాహనాలను తనిఖీ చేసింది. అల్లర్ల నిరోధక వాహనాలు, అంబులెన్స్‌లు, అగ్నిమాపక దళాలు, ఇసుకతో నిండిన టిప్పర్లను అన్ని సరిహద్దు పాయింట్ల వద్ద మోహరించారు. ఈ తీవ్రమైన భద్రతా చర్యల కారణంగా, సరిహద్దు క్రాసింగ్‌ల వద్ద వాహనాల పొడవైన క్యూలు ఏర్పడ్డాయి, దీనివల్ల ప్రయాణికులకు ఇబ్బంది కలిగింది. బుధవారం ఉదయం ట్రాక్టర్–ట్రాలీలు, ఇతర వాహనాలలో చండీగఢ్‌కు బయలుదేరిన రైతులను పంజాబ్ పోలీసులు అనేక చోట్ల ఆపారు. దీంతో గ్రామీణ లింక్ రోడ్ల ద్వారా చండీగఢ్‌కు చేరుకోవడానికి తాము ప్రయత్నిస్తున్నామని రైతు నాయకులు తెలిపారు. రాష్ట్రంలో అతిపెద్ద రైతు సంఘమైన బికెయు ఏక్తా–ఉగ్రహన్ అధ్యక్షుడు జోగిందర్ సింగ్ ఉగ్రహన్‌ను సంగ్రూర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయనను ఘరాచోన్ గ్రామం సమీపంలో అరెస్టు చేసి చాజ్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారని ఆయన సహచరుడు జగ్తర్ కలార్ఝర్ తెలిపారు.

## అమెరికాతో ఏరకమైన యుద్ధానికైనా సిద్ధం

బీజింగ్ : చైనా దిగుమతులపై 20 శాతం సుంకాలు విధిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న చర్యలపై చైనా స్పందించింది. అమెరికా మొదలు పెట్టిన వాణిజ్య యుద్ధంలో చివరివరకు పోరా డటానికి తాము సిద్ధమేనని చైనా పేర్కొంది. " అగ్రరాజ్యం మాతో యుద్ధం చేయ డానికి నిశ్చయించుకుంటే అది సుంకాల యుద్ధమైనా, వాణిజ్య యుద్ధమైనా, మరే రకమైన యుద్ధమైనా, చివరివరకు పోరాడడానికి మేము సిద్ధంగా ఉన్నాం " అని అమెరికా లోని చైనా రాయబార కార్యాలయం ప్రకటించింది. న తమపై విధిస్తున్న టారిఫ్‌కు ప్రతిగా అమెరికా ఉత్పత్తులపై తాము 1015 శాతం సుంకాలు విధిస్తామని తెలిపింది. ఫెంటనిల్ డ్రగ్స్ అక్రమ రవాణాను అడ్డుకోవడంలో బీజింగ్ విఫలమవడం వల్లే టారిఫ్‌లను రెట్టింపు చేస్తున్నట్టు ట్రంప్ పేర్కొంటున్నప్పటికీ ఫెంటనిల్ సంక్షోభం దాని సొంతపనే అని డ్రాగన్ ఆరోపించింది. " ఈ మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకోవడానికి మేము చేస్తున్న ప్రయత్నాలను గుర్తించకుండా యూఎస్ తిరిగి మమ్మల్నే నిందిస్తోంది. సుంకాల పేరుతో ఒత్తిడి చేసి, బ్లాక్‌మెయిల్ చేయడానికి ప్రయత్నిస్తోంది. ఇంతకాలం వారికి సహాయం చేసినందుకు వారు మమ్మల్ని శిక్షిస్తున్నారు. " అని చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ పేర్కొంది. ప్రపంచ దేశాలపై అమెరికా అనుసరిస్తోన్న సుంకాలు, బెదిరింపు వ్యూహాలు తమపై ప్రభావం చూపవని తెలిపింది. యూఎస్ సుంకాలపై చైనా ప్రతీకార చర్యలకు దిగింది. అగ్రరాజ్యం నుంచి దిగుమతి అవుతున్న బొగ్గు, ద్రవీకృత సహజవాయువుపై (ఎల్ఎన్‌జీ) 15 శాతం సుంకం విధిస్తున్నట్టు చైనా ఆర్థిక మంత్రిత్వశాఖ ప్రకటించింది. ముడి చమురు, వ్యవసాయ పరికరాలు, పెద్ద ఇంజిన్ల కార్లపై 10 శాతం సుంకాన్ని వసూలు చేయనున్నట్టు తెలిపింది.




## పిఒకెను పాక్ ఖాళీ చేయడమే కాశ్మీర్ సమస్యకి పరిష్కారం

ఆక్రమిత కాశ్మీర్ (పిఒకె)ను పాకిస్థాన్ ఖాళీ చేస్తే కాశ్మీర్ సమస్య పరిష్కారమవుతుందని విదేశాంగ మంత్రి ఎస్.జయశంకర్ వ్యాఖ్యానించారు. లండన్‌లోని చాథమ్ హౌస్‌లో ప్రేక్షకులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. చాథమ్‌హౌస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ బ్రోన్వెన్ మాడాక్స్ మాట్లాడుతూ.. కాశ్మీర్‌లో మానవహక్కులపై అనేక ప్రశ్నలు ఉన్నాయని అన్నారు. లేబర్ ఎంపి సారాస్మిత్ నేతృత్వంలో "జమ్మూకాశ్మీర్‌లో మానవహక్కులకు ప్రభుత్వ మద్దతు" అనే చర్చను హౌస్ ఆఫ్ కామన్స్ గురువారం నిర్వహించింది. కాశ్మీర్ సమస్యను పరిష్కరించడానికి ప్రధాని మోడీ అమెరికా అధ్యక్షుడు టంప్‌తో తనకున్న సంబంధాన్ని ఉపయోగించుకోగలరా అని ప్రశ్నించారు.

ఆర్టికల్ 370 తొలగించడం అనేది మొదటి అడుగు అని అన్నారు. అప్పుడు కాశ్మీర్‌లో వృద్ధి, ఆర్థిక కార్యకలాపాలు, సామాజిక న్యాయాన్ని పునరుద్ధరించడం రెండవ అడుగు అని అన్నారు. అత్యధిక ఓటింగ్‌తో ఎన్నికలు నిర్వహించడం మూడవ అగుడు అని అన్నారు. కాశ్మీర్‌లో కొంత భాగం చట్టవిరుద్ధంగా పాక్ ఆక్రమణలో ఉందని, దాన్ని తిరిగిస్తే కాశ్మీర్ సమస్య పరిష్కారమవుతుందని అన్నారు.

## ఏప్రిల్ 2 నుండి భారత్, చైనాలపై ప్రతీకార సుంకాలు



భారత్, చైనాలపై ప్రతీకార సుంకాలు ఏప్రిల్ 2 నుండి అమలు చేస్తున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. సుదీర్ఘకాలంగా చైనా, భారత్‌లతో సహా పలు దేశాలు అమెరికా ఉత్పత్తులపై టారిఫ్‌లు విధిస్తున్నాయని ఇది సరికాదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే తాము కూడా వచ్చే నెల నుండి ప్రతీకార సుంకాలు విధించాలని నిర్ణయించామని చెప్పారు. అమెరికా కాంగ్రెస్ ఉభయ సభల సంయుక్త సమావేశంలో ట్రంప్ తొలిసారిగా మంగళవారం రాత్రి ప్రసంగించారు. "దశాబ్దాల తరబడి ఇతర దేశాలు మాపై టారిఫ్‌లు అమలు చేస్తూ వచ్చాయి. ఇప్పుడు మా వంతు వచ్చింది. ఆ చర్యలనే ఆ దేశాలపై వేం ప్రయోగిస్తాం. యురోపియన్ యూనియన్, చైనా, బ్రెజిల్, భారత్, మెక్సికో, కెనడా ఇలా లెక్కలేనన్ని దేశాలు మన ఉత్పత్తులపై అధికంగా టారిఫ్‌లు విధిస్తున్నాయి. ఇదంతా అన్యాయం" అని ఆయన వ్యాఖ్యానించారు. వంద శాతానికి పైగా ఆటో టారిఫ్‌లను భారత్ తమపై విధించిందని ఆయన చెప్పారు. కాంగ్రెస్ సమావేశంలో ట్రంప్ సుదీర్ఘ ప్రసంగం చేశారు. గంటా 28నిముషాల పాటు ప్రసంగించిన రికార్డు ఇప్పటివరకు అధ్యక్షుడు బిల్ క్లింటన్ పేరిట వుండగా, ఇప్పుడు ట్రంప్ దాన్ని అధిగమించి గంటా 40నిముషాల పాటు ప్రసంగించారు. అనేక అంశాలను ప్రస్తావిస్తూ సుదీర్ఘంగా మాట్లాడారు. మొదటి ఆరు వారాల్లో తమ ప్రభుత్వం తీసుకువచ్చిన సాహసోపేతమైన సామాజిక, ఆర్థిక విధానాలను ఆయన వివరించారు. అమెరికన్ల కలలు నెరవేరే సమయం ఆసన్నమైందని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వాలు నాలుగేళ్ళలో లేదా ఎనిమిదేళ్ళలో చేయలేనివి తాము కేవలం 43 రోజుల్లో చేశామని చెప్పుకున్నారు. గత ఆరు వారాల్లో వంద ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై సంతకాలు చేశానని చెప్పారు. మరో 400 కార్యనిర్వహణా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డోజ్ పనితీరును ప్రస్తావిస్తూ మస్క్‌పై ప్రశంసలు కురిపించారు. ఇప్పుడే ప్రయాణం ఆరంభమైందని ఆయన వ్యాఖ్యానించారు. ట్రంప్ ప్రసంగిస్తుండగా రిపబ్లికన్ పార్టీ సభ్యుల నుండి హర్షాతిరేకాలు వ్యక్తమవగా, డెమోక్రటిక్ సభ్యుడొకరు ఆరోగ్య సంరక్షణ వ్యయంలో కోత గురించి ప్రస్తావిస్తూ విమర్శలు చేశారు. దాంతో ఆ సభ్యుడిని బయటకు పంపాల్సిందిగా స్పీకర్ ఆదేశించారు. వాణిజ్య యుద్ధం గురించి ప్రస్తావిస్తూ ట్రంప్, టారిఫ్‌ల వల్ల కొన్ని ఇబ్బందులను అమెరికా ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొనాల్సి రావాల్సి వస్తుందని చెప్పారు.

## కోట్లు విలువ చేసే బంగారం

### స్మగ్లింగ్.. నటి అరెస్ట్





కన్నడ నటి రన్యా రావు దగ్గర నుంచి బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో రూ. 12.56 కోట్లు విలువ చేసే బంగారు కడ్డీలను తాము స్వాధీనం చేసుకున్నట్లు డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్ (డిఆర్ఐ) బుధవారం వెల్లడించింది. రన్యా రావు సీనియర్ ఐపిఎస్ అధికారి రామచంద్ర రావు సవతి కుమార్తె అని పోలీస్ సీనియర్ అధికారి ఒకరు 'పిటిఐ'తో చెప్పారు. డిజిపి ర్యాంక్ అధికారి అయిన రామచంద్రరావు ప్రస్తుతం కర్నాటక రాష్ట్ర పోలీస్ గృహనిర్మాణ, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ సిఎండిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కేసులో మొత్తం స్వాధీనం చేసుకున్న బంగారం, ఆస్తుల విలువ రూ. 17.29 కోట్లు. వాటిలో రూ. 4.73 కోట్లు విలువ చేసే ఆస్తులు కూడా ఉన్నాయి. సంఘటిత బంగారం అక్రమ రవాణా నెట్‌వర్క్‌లకు ఆ స్వాధీనం పెద్ద దెబ్బే. డిఆర్ఐ అధికారుల సమాచారం ప్రకారం, 14.2 కిలోల బంగారం స్వాధీనం ఇటీవలి కాలంలో బెంగళూరు విమానాశ్రయంలో బంగారం స్వాధీనం చేసుకున్న అతిపెద్ద ఘటనల్లో ఒకటి. రన్యా రావు బంగారాన్ని తొడలు, నడుముతో సహా తన శరీరానికి బంగారాన్ని టేప్‌తో అంటించుకోవడం ద్వారా, తన దుస్తుల లోపల, సవరించిన జాకెట్ లోపల గోప్యంగా ఉంచడం ద్వారా భద్రత సిబ్బంది తనిఖీని తప్పించుకున్నట్లు అధికారులు తెలియజేశారు. రన్యా రావు గత ఏడాదిగా 30 సార్లు దుబాయికి వెళ్లి, ప్రతి ట్రిప్‌లోను కిలోల కొద్దీ బంగారం తీసుకువస్తుండేది. అక్రమ రవాణా చేసిన కిలో బంగారానికి ఒక లక్ష రూపాయలు వంతున ఆమెకు చెల్లించారని, అలా ఆమె ట్రిప్‌నకు రూ. 1213 లక్షలు ఆర్జించిందని అభిజ్ఞ వర్గాలు తెలిపాయి. ఆమె తన స్మగ్లింగ్ కార్యకలాపాల కోసం సవరించిన జాకెట్లు, నడుము బెల్ట్‌లు వాడుతుండేదని దర్యాప్తులో వెల్లడైంది. ఆమె తన ప్రయాణాలకు ఒకేవిధమైన జాకెట్లు, బెల్ట్‌లు ధరిస్తుండేది. ఈ దఫా ఆమె సవరించిన తన జాకెట్‌లో బంగారం కడ్డీలు దాచింది. సోమవారం రాత్రి ఎమిరేట్స్ విమానంలో దుబాయి నుంచి వచ్చిన రన్యా రావుపై తరచు అంతర్జాతీయ ప్రయాణాల కారణంగా డిఆర్ఐ వర్గాలు నిఘా వేసి ఉంచాయి. డిఆర్ఐ ప్రోటోకాల్స్ ప్రకారం, ఆ ప్రాంతానికి పదే పదే ట్రిప్‌లు వేస్తుండే ప్రయాణికులను నిశితంగా తనిఖీ చేస్తుంటారు. భద్రత తనిఖీని తప్పించుకోవడానికి రన్యా రావు తన పలుకుబడిని వినియోగించుకుందని, బెంగళూరుకు రాగానే ఆమె తనకు ఇంటి వరకు రక్షణగా రావడానికి స్థానిక పోలీస్ సిబ్బందిని పిలిపించిందని తెలుస్తోంది. రాజకీయ ప్రముఖులు, వాణిజ్యవేత్తలు, పోలీస్ అధికారుల కుటుంబాలతో సహా భారీ స్మగ్లింగ్ నెట్‌వర్క్‌తో ఆమెకు గల సంబంధాలను కూడా అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. విమానాశ్రయంలో బసవరాజ్ అనే పోలీస్ కానిస్టేబుల్ రన్యా భద్రత తనిఖీలు తప్పించుకునేందుకు సాయం చేసినట్లు తెలుస్తోంది. ఈ దఫా డిఆర్ఐ అధికారులు రన్యను నిలదీసినప్పుడు బసవరాఝ్ జోక్యం చేసుకుని, 'ఆమె ఎవరో మీకు తెలుసా? ఆమె డిజిపి రామచంద్రరావు కుమార్తె' అని చెప్పినట్లు సమాచారం. అయితే, ముందస్తు సమాచారం ఆధారంగా వ్యవహరించిన డిఆర్ఐ ఆమెను అడ్డుకుని, బంగారం సరకులతో ఆమెను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నది. ఇటీవలే లావెల్లి రోడ్‌లోని ఒక అపార్ట్‌మెంట్‌లోకి మారిన రన్య ప్రముఖ ఆర్కిటెక్ట్ జితిన్ హుక్కెరిని మూడు నెలల క్రితమే తాజ్ వెస్ట్ ఎండ్‌లో వైభవంగా వివాహం చేసుకున్నది.

## గాజాలో క్షీణించిన పరిస్థితులు



గాజా : గాజాలోకి నిత్యావసరాలైన ఆహార పదార్థాలు, ఇంధనం, ఔషధాలు, ఇతర సరఫరాలను రాకుండా ఇజ్రాయిల్ అడ్డుకోవడంతో అక్కడ పరిస్థితులు దారుణంగా మారాయి. ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పాటూ మానవతా సంక్షోభం నెలకొంది. ఫలితంగా నానాటికి తరిగిపోతున్న నిల్వలను అత్యంత అవసరంలో వున్నవారికి పంచిపెట్టడానికి మానవతా గ్రూపులు తీవ్రంగా పాట్లు పడుతున్నాయి. కాల్పుల విరమణ ఒప్పందం మొదటి దశలో భాగంగా గత ఆరువారాలుగా తాము కొద్దో గొప్పో సాధించిన పురోగతి అంతా కూడా ఈ సహాయ ప్రతిష్టంభనతో మరింత ప్రమాదంలో పడిందని సహాయ కార్యకర్తలు పేర్కొంటున్నారు. 16మాసాలకు పైగా కొనసాగిన దాడులతో గాజాలోని జనాభా అంతా పూర్తిగా ట్రక్కుల ద్వారా వచ్చే ఆహారం, ఇతర సాయంపైనే ఆధారపడ్డారు. వీరిలో చాలామంది నిర్వాసితులే. వారందరికీ ఆశ్రయం కావాల్సి వుంది. ఆస్పత్రులు, నీటి సరఫరా, బేకరీలు, టెలికమ్యూనికేషన్స్ పనిచేయడాలంటే ఇంధనం కావాలి. ట్రక్కులు ఆహార సరఫరాలను చేరవేయాలన్నా కూడా ఇంధనం కావాల్సిందే, అటువంటి ఇందన సరఫరాలు నిలిచిపోవడంతో పరిస్థితి మరీ అధ్వాన్నంగా తయారైంది. గాజాలో శిబిరాలు తగినన్ని లేవు, దీంతో శీతల పరిస్థితులను ఎదుర్కొనడం ప్రజలకు దుర్భరంగా మారింది. తమ కాల్పుల విరమణ ప్రతిపాదనలను ఆమోదించేలా హమాస్‌పై ఒత్తిడి తీసుకువచ్చేందుకే తాము సహాయాన్ని నిలిపివేసినట్లు ఇజ్రాయిల్ ప్రకటించింది. అవసరమైతే గాజా మొత్తానికి విద్యుత్‌ను నిలిపివేసే అవకాశాన్నికూడా తోసిపుచ్చలేమని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు చెప్పారు. కాగా ఇదంతా కరువును సృష్టించే చర్యలని మానవ హక్కుల గ్రూపులు విమర్శిస్తున్నాయి.

## నితిశ్ కూటమి ఓటమి తప్పదు



బీహార్ లో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో అధికార బీజేపీ, జెడియూ కూటమి దారుణంగా ఓటమి పాలవుతుందని.. ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత కిశోర్ జోస్యం చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల లో ఓటమి తర్వాత.. బీజేపీని వీడి, మళ్లీ సీఎం అయ్యేందుకు మరో పార్టీతో జేడీయూ అధినేత నితిశ్ కుమార్ జతకడతారని అతడు అన్నారు. గతంలో జేడీయూ నుంచి బహిష్కరణకు గురై స్వయంగా జన సురాజ్ పార్టీ స్థాపించిన ప్రశాంత కిశోర్ చంపారణ్ జిల్లాలో ప్రచారం సందర్భంగా మీడియాతో మాట్లాడారు. ఈ ఏడాది జరగనున్న బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార పక్షం దారుణంగా ఓటమి పాలు కాగలదని ఆయన పేర్కొన్నారు. నితిశ్ కుమార్ గ్రాఫ్ దారుణంగా పడిపోయిందని చెప్పారు. అయినా నితిశ్ కుమార్ మళ్లీ సీఎం కావాలనే కోరుతున్నారని, ఏదో ఒక పార్టీతో కూటమి కట్టి సీఎం గద్దెను ఎక్కే అవకాశం లేకపోలేదని ప్రశాంతకిశోర్ చెప్పారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమ సీఎం అభ్యర్థిగా నితిశ్ కుమార్ ను ప్రకటించేందుకు బీజేపీ సిద్ధంగా లేదని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో అంతకుముందే నితిశ్ కుమార్ ఎన్డీఏకు గుడ్ పై చెబుతారనే మాట బహిరంగంగానే విన్పిస్తోంది. బీజేపీ – జెడియూ కూటమిగానే నితిశ్ రానున్న ఎన్నికల్లో పోటీ చేస్తారని తాను భావిస్తున్నట్లు ప్రశాంత్ కిశోర్ అభిప్రాయపడ్డారు. నితిశ్ కుమార్ కు రోజురోజుకూ ప్రజాదరణ తగ్గుతున్నందు వల్ల వచ్చే ఎన్నికల తర్వాత ఆయనను మరో సారి సీఎం చేస్తామని ప్రకటించే స్థితిలో ప్రధాని మోదీ, హెూం మంత్రి అమిత్ షా లేరని ఆయన స్పష్టం చేశారు. నితిశ్ కారణంగా బీజేపీకూడా చాలా చోట్ల ఓటమి పాలు కాగలదని అన్నారు.

## అమెరికాపై డబ్ల్యుటిఓలో కెనడా ఫిర్యాదు




అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విపరీతంగా టారిఫ్‌లను పెంచేయడంపై కెనడా ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఓ)లో ఫిర్యాదు చేసింది. డబ్ల్యుటిఓ బుధవారం ఆ విషయాన్ని ధృవీకరించింది. అమెరికా తీసుకున్న నిర్ణయంతో ఫిర్యాదు చేయడం మినహా తమకు మరో అవకాశం లేకుండా పోయిందని డబ్ల్యుటిఓలో కెనడా రాయబారి నదియా థియోడర్ పేర్కొన్నారు. ఈ మేరకు లింక్డిన్‌లో పోస్టు పెట్టారు. అదనపు టారిఫ్‌ల విషయమై డబ్ల్యుటిఓలో అమెరికాపై కెనడా వివాద పరిష్కార చర్యలు చేపట్టినట్లు డబ్ల్యుటిఓ అధికారి ఒకరు మీడియాకు ధృవీకరించారు. చైనా కూడా ఇదే రీతిలో అమెరికాపై ఫిర్యాదు నమోదు చేసింది. అక్రమ వలసలను, డ్రగ్ రవాణాను నిరోధించడంలో విఫలమయ్యారంటూ కెనడా, మెక్సికోల దిగుమతులపై ట్రంప్ 25శాతం టారిఫ్‌లు విధించారు. ఆ తర్వాత వాటి అమలును తాత్కాలికంగా నిలిపివేశారు. ఆ రెండు అంశాల్లో ఎలాంటి పురోగతి లేదని పేర్కొంటూ తిరిగి మంగళవారం ఆ టారిఫ్‌లు అమలవుతాయని ట్రంప్ ప్రకటించారు. కెనడా, మెక్సికోల విషయంలో ట్రంప్ ఏదో ఒక చర్య తీసుకుంటారని భావిస్తున్నట్లు అమెరికా వాణిజ్య శాఖ మంత్రి హొవార్డ్ లుత్నిక్ వ్యాఖ్యానించారు. కెనడా దిగుమతులపై టారిఫ్‌లు అమల్లోకి వచ్చిన వెంటనే కెనడా ప్రధాని ట్రూడే స్పందిస్తూ, వాషింగ్టన్ వాణిజ్య యుద్ధానికి దిగుతోందని విమర్శించారు. కెనడా ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చాలని ట్రంప్ భావిస్తున్నారని, అప్పుడు అమెరికాలో కలిపేసుకోవడానికి సులభం అవుతుందని భావిస్తున్నారని వ్యాఖ్యానించారు.

# చక్కని ఆరోగ్యం

## మట్టికుండలోని పెరుగు చేసే మ్యాజిక్



వేసవిలో పెరుగు తినడం వల్ల చల్లదనం మరియు అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. ఇది శరీరంపై సహజంగా రిఫ్రెషింగ్ ప్రభావాన్ని కలిగిస్తుంది. వేడిని తగ్గించడంలో మరియు వేడి వాతావరణం నుండి ఉపశమనం కలిగించడంలో సహాయపడుతుంది. ప్రోబయోటిక్స్ సమృద్ధిగా ఉన్న పెరుగు జీర్ణక్రియకు సహాయపడుతుంది, పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది మరియు జీర్ణ సమస్యలను నివారిస్తుంది. ఇందులోని అధిక నీటి శాతం హైడ్రేషన్ మరియు ఎలక్ట్రోలైట్లను తిరిగి నింపడంలో సహాయపడుతుంది. మట్టి పాత్రల్లో వంట చేసుకునే సంప్రదాయం ఈనాటిది కాదు. భారతీయులకు ఇది ఎప్పటినుంచో అలవాటు. తరాలు మారుతున్న కొద్దీ వీటి వాడకం కూడా కనుమరుగైపోతుంది. మళ్లీ ఇప్పుడు మట్టి పాత్రల వాడకంపై ప్రజల్లో అవగాహన పెరుగుతోంది. కుండలో పెట్టి వండిన ఆహార పదార్థాలకు నగరంలోనూ డిమాండ్ పెరుగుతోంది. ఐస్ క్రీం, బిర్యానీ, లస్సీ ఇలా అనేక రకాల ఫుడ్స్ ను మట్టి కుండలో పెట్ట అమ్ముతున్నారు. ఇవి మాత్రమే కాదు.. మట్టి పాత్రల్లో తోడు పెట్టిన పెరుగంటే నగరవాసులు మనసు పారేసుకుంటున్నారు. చూడగానే నోట్లో నోరూరించే కుండ పెరుగును అనేక రెస్టారెంట్లతో సహా పలు దుకాణాల్లోనూ అమ్మకానికి ఉంచుతున్నారు. రుచి విషయం అటుంచితే అసలు ఇలా మట్టి కుండలో పెరుగును తయారు చేసుకుని తినడం వల్ల ఏమైనా ప్రయోజనాలున్నాయా.. అంటే అవుననే అంటున్నారు ఆరోగ్య నిపుణులు అవేంటో చూడండి. పెరుగు పోషకాలతో సమృద్ధిగా ఉంటుంది, రోగనిరోధక శక్తిని పెంచుతుంది. వడదెబ్బను సైతం తట్టుకోగల శక్తినిస్తుంది. ఎండలో కాలిపోయిన చర్మానికి ఉపశమనం ఇస్తుంది. పెరుగు వేసవి భోజనాలను మరింత రుచికరంగా మారుస్తుంది. ఎండా కాలంలో మొత్తం శ్రేయస్సును ప్రోత్సహిస్తుంది. అయితే పెరుగును తోడేసేందుకు మీరు ఎంచుకునే పాత్రలు కూడా చాలా ముఖ్యం. సరైన పాత్రను ఇందుకు వాడినప్పుడే అది మన శరీరానికి అవసరమైన అన్ని పోషకాలను అందించగలదు.

మట్టి పాత్రల్లో తయారు చేసే పెరుగులో ప్రొబయోటిక్స్ ఎక్కువగా ఉంటాయి. స్టీలు, గాజు వంటి పాత్రల్లో చేసిన పెరుగు కంటే మట్టి పాత్రల్లో చేసిన పెరుగులో ఇవి అధికంగా ఉంటాయి. ప్రొబయోటిక్స్ జీర్ణక్రియను, రోగ నిరోధక శక్తిని మెరుగుపరుస్తాయి. మట్టిలో ఉండే పోరస్ స్వభావం లోపల గాలిని ప్రసరించడానికి అనువుగా ఉంటుంది. మట్టి కుండలో తయారు చేసే పెరుగు ఎక్కువ శాతం గడ్డ కట్టి ఉంటుంది. పెరుగును ఇలా తినడానికి ఎంతో మంది ఇష్టపడుతుంటారు. నిజానికి ఇలా గడ్డకట్టడం వెనుకు ఉన్నకారణం ఏమిటంటే.. మట్టి సహజంగానే నీటిని పీల్చుకుంటుంది. కాబట్టి అందులో పేరుకునే అదనపు నీటిని అందులో ఉండే పిలుపును మట్టి పీల్చేస్తుంది. గడ్డపెరుగుకు అసలు సీక్రెట్ ఇదే.

## బ్లాక్ కాఫీలో వీటిని కలిపి తాగారంటే..



బ్లాక్ కాఫీ మెదడు ఆరోగ్యానికి మంచిది. ఇది అల్జీమర్స్, పార్కిన్సన్స్ వ్యాధులను తగ్గించడంలో సహాయపడుతుంది. బ్లాక్ కాఫీలో ఉండే క్లోరోజెనిక్ యాసిడ్ జీవక్రియను పెంచుతుంది. బరువు తగ్గడంలో సహాయపడుతుంది. బ్లాక్ కాఫీలోని కెఫిన్ జీవక్రియ రేటును పెంచుతుంది. అంటే, మీ శరీరం ఎక్కువ కేలరీలను బర్న్ చేయడం ప్రారంభిస్తుంది. బ్లాక్ కాఫీ.. చాలా మంది దీనిని బరువు తగ్గించుకోవడానికి ఎక్కువగా తీసుకుంటారు. బ్లాక్ కాఫీలోని కెఫిన్ మన మెదడును ఉత్తేజపరిచి శక్తిని పెంచుతుంది. బ్లాక్ కాఫీ ఏకాగ్రతను పెంచుతుంది. అయితే, ఇందులో కొన్ని పదార్థాలు కలిపితే తీసుకుంటే అది మ్యాజికల్ డ్రింక్‌లా మారి మరింత ఎఫెక్టివ్‌గా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు. బ్లాక్ కాఫీలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. శరీరం నుండి హానికరమైన ఆక్సిడెంట్లను తొలగించడంలో సహాయపడుతుంది. బ్లాక్ కాఫీ మెదడు ఆరోగ్యానికి మంచిది. ఇది అల్జీమర్స్, పార్కిన్సన్స్ వ్యాధులను తగ్గించడంలో సహాయపడుతుంది. బ్లాక్ కాఫీలో ఉండే క్లోరోజెనిక్ యాసిడ్ జీవక్రియను పెంచుతుంది.

బరువు తగ్గడంలో సహాయపడుతుంది. బ్లాక్ కాఫీలోని కెఫిన్ జీవక్రియ రేటును పెంచుతుంది. అంటే, మీ శరీరం ఎక్కువ కేలరీలను బర్న్ చేయడం ప్రారంభిస్తుంది. కెఫిన్ కొవ్వు కణాల నుండి కొవ్వు ఆమ్లాలను విడుదల చేయడానికి సహాయపడుతుంది. ఇవి శక్తిగా ఉపయోగపడతాయి. బ్లాక్ కాఫీ బరువు తగ్గించడంలో సహాయపడే అనేక ప్రయోజనాలను కలిగి ఉంది.

## ఈ పండు క్యాన్సర్‌కు దివ్యౌషధం..

### ఏడాదికి ఒక్కసారైనా తినాల్సిందే



ఈ పండును సంవత్సరానికి ఒకసారి తింటే ఎన్నో రోగాలను అరికడుతుంది. ఇది క్యాన్సర్ కు దివ్యౌషధమని నిపుణులు అంటున్నారు. ఈ ఆకుపచ్చ పండు ముళ్ళు కలిగి ఉంటుంది. బయటి నుండి గట్టిగా కనిపిస్తుంది. కానీ లోపల మృదువుగా, జ్యుసిగా ఉంటుంది. ఇది ఆరోగ్యానికి అవసరమైన పోషక విలువలతో నిండి ఉంటుంది. దీని ఆకులు, పండ్లు, విత్తనాలు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులతో పోరాడే అద్భుతమైన సామర్థ్యాలను కలిగి ఉంటాయని నిపుణులు అంటున్నారు. ప్రకృతితో సహజసిద్ధంగా దొరికే కొన్ని పండ్లు, ఆహారాలు మన ఆరోగ్యానికి నిజంగానే వరం లాంటివి. ముఖ్యంగా ఈ ఆకుపచ్చ ముళ్ల పండు అలాంటి అద్భుతమైన పండ్లలో ఒకటి. ఈ పండు క్యాన్సర్‌కు వ్యతిరేకంగా పోరాడే శక్తివంతమైన ఆయుధం. దీని పేరు 'సోర్సోప్' లేదా 'గ్రావియోలా' పండు అంటారు. దీనిని లక్ష్మణ పండు, హనుమాన్ పండు అని కూడా అంటారు. ఈ ఆకుపచ్చ పండుకి చుట్టూ ముళ్ళు ఉంటాయి. బయటి నుండి గట్టిగా కనిపిస్తుంది. కానీ లోపల మృదువుగా, జ్యుసిగా ఉంటుంది. ఇది ఆరోగ్యానికి అవసరమైన పోషకాలతో నిండి ఉంటుంది. దీని ఆకులు, పండ్లు, విత్తనాలు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులతో పోరాడే అద్భుతమైన సామర్థ్యాలను కలిగి ఉంటాయని నిపుణులు అంటున్నారు. మధ్య, దక్షిణ అమెరికాలో సాంప్రదాయ వైద్యంలో భాగమైన ఈ పండు ఆరోగ్య ప్రయోజనాలకు ఎంతో ప్రసిద్ధి చెందుతోంది. క్యాన్సర్ తో పోరాడటం నుంచి గుండెపోటును నివారించడం వరకు అనేక ప్రయోజనాలు అందిస్తుంది. లక్ష్మణ పండు రుచి స్ట్రాబెర్రీలు, అరటిపండ్ల మిశ్రమంలా ఉంటుంది. దీని గుజ్జు చాలా క్రీమీగా ఉంటుంది. పోషకాల విషయానికొస్తే కప్పు లక్ష్మణ పండులో 148 కేలరీలు, 7.42 గ్రాముల ఫైబర్, 37.8 గ్రాముల కార్బోహైడ్రేట్లు ఉంటాయి. ఇందులో విటమిన్ సి, పొటాషియం, మెగ్నీషియం, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇందులో తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉన్నందున, ఇది మధుమేహ రోగులకు కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. కడుపు నొప్పి, జ్వరం, పరాన్నజీవి ఇన్ఫెక్షన్లు, అధిక రక్తపోటు వంటి సమస్యలకు చికిత్స చేయడానికి లక్ష్మణ పండును ఉపయోగిస్తారు. క్యాన్సర్‌తో పోరాడడంలో లక్ష్మణ పండు ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. జర్నల్ ఆఫ్ మెడిసినల్ కెమిస్ట్రీలో ప్రచురితమైన ఒక అధ్యయనంలో ఈ పండులోని లాక్టోబాసిల్లస్‌లోని సమ్మేళనాలు రొమ్ము క్యాన్సర్ కణాలను నాశనం చేయడంలో కీమోథెరపీ కంటే ఎక్కువ ప్రభావవంతంగా ఉన్నాయని కనుగొన్నారు. 2016లో 'సైంటిఫిక్ రిపోర్ట్స్'లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం ప్రోస్టేట్ క్యాన్సర్‌పై లక్ష్మణ పండు తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. 2024 సమీక్షలో లాక్టోబాసిల్లస్ పండ్లు క్యాన్సర్ కణాలను చంపే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని కనుగొన్నారు. దీనిలోని అసిటోజెనిన్లు, ఆల్కలాయిడ్స్, ఫ్లేవనాయిడ్స్ వంటి సమ్మేళనాలు క్యాన్సర్‌ను నివారించడంలో సహాయపడతాయి. అయితే ఈ లక్ష్మణ పండు వల్ల కూడా కొన్ని దుష్ప్రభావాలు ఉన్నాయి. 2022 అధ్యయనం ప్రకారం.. అధిక స్థాయిలో అసిటోజెనిన్‌లు తీసుకుంటే ఒంట్లో విషపూరితం కావచ్చని, ఇది పార్కిన్సన్స్ వంటి వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుందని హెచ్చరించింది. అందుకే ఈ పండ్లను మితంగా మాత్రమే తీసుకోవాలి. అమితంగా తింటే అనర్థాలు తప్పవన్నమాట.

## మీల్ మేకర్ తింటున్నారా..?



మీల్ మేకర్ అనేది ప్రోటీన్ అధికంగా కలిగిన శాకాహార ఆహారం. ఇది శరీరానికి అవసరమైన పోషకాలను అందించడంతో పాటు కండరాల బలాన్ని పెంచుతుంది. అయితే దీన్ని అధిక మోతాదులో తీసుకోవడం వల్ల కొన్ని ఆరోగ్య సమస్యలు రావొచ్చు. మీల్ మేకర్ అనేది ప్రోటీన్, ఫైబర్, విటమిన్లు, మినరల్స్ కలిగి ఉన్న ఒక పోషకాహారం. ప్రతి 100 గ్రాములలో 52 గ్రాముల ప్రోటీన్, 13 గ్రాముల ఫైబర్, 35 గ్రాముల విటమిన్లు, మినరల్స్ ఉంటాయి. ఇది శరీరానికి కావలసిన ప్రోటీన్ ను అందిస్తుంది. అందువల్ల కోడిగుడ్లు, మాంసం వంటి ఆహారాలకు సమానంగా దీనిని పరిగణించవచ్చు. మీల్ మేకర్ తినడం ద్వారా మన ఆరోగ్యానికి మేలుచేస్తుంది. మీల్ మేకర్ లో ఉన్న ప్రోటీన్, ఫైబర్ మన శరీరానికి బలాన్నిస్తుంది. శరీరంలోని కండరాలు బలపడేందుకు, శక్తి పెరగడానికి ఈ ఆహారం సహాయపడుతుంది. ఈ ఆహారంలో ఉండే విటమిన్లు, మినరల్స్ అనేవి శరీరానికి అవసరమైన పోషకాలుగా పనిచేస్తాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. శరీరంలోని విటమిన్ లోపాలను తీరుస్తాయి. ఈ ఆహారం తినడం ద్వారా శారీరక శక్తి పెరుగుతుందంటూ నిపుణులు చెబుతున్నారు. మగవారు ఈ ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవడం వల్ల కొన్ని ఆరోగ్య సమస్యలు ఎదురుకావచ్చు. ముఖ్యంగా మీల్ మేకర్ ఎక్కువగా తీసుకున్నప్పుడు ఛాతి పరిమాణం పెరగడం వంటి ఇబ్బందులు రావచ్చు. అలాగే అధిక ప్రోటీన్ తీసుకోవడం వల్ల విరోచనాలు, మలబద్ధకం వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. ఎక్కువసార్లు మూత్రానికి వెళ్లాల్సిన అవసరం కూడా ఉండవచ్చు.

అందుకే మగవారు ఈ ఆహారాన్ని తక్కువ పరిమాణంలో తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. మహిళలు ఈ ఆహారాన్ని ఎక్కువ మోతాదులో తీసుకుంటే చర్మంపై ప్రభావం చూపవచ్చు. ముఖ్యంగా మొటిమలు వంటి సమస్యలు రావచ్చు. ఈ ఆహారంలోని కొన్నిరకాల పోషకాలు అధిక మోతాదులో ఉండటంతో శరీరంలో కొన్ని మార్పులు జరిగే అవకాశం ఉంది. కనుక మహిళలు కూడా ఈ ఆహారాన్ని సరైన మోతాదులో మాత్రమే తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. మీల్ మేకర్ తినే ముందు కొంచెం జాగ్రత్తలు తీసుకోవాలి. సాధ్యమైనంత వరకు ఈ ఆహారాన్ని ఓ పౌషక ఆహారం అనిపించే స్థాయిలో మాత్రమే తీసుకోవాలి. అత్యధికంగా తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన పోషకాలు పొందడంలో కొన్ని ఇబ్బందులు ఉండవచ్చు. కాబట్టి సరైన పరిమాణంలో తీసుకోవడం ద్వారా దీని ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు.

## పొట్ట సమస్యలకు పరమ ఔషధం..



నేటి తరం అనారోగ్యకరమైన జీవనశైలి, సరైన ఆహారం లేకపోవడం వల్ల పెద్ద ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటోంది. వీటిలో యువత కూడా ఉంటున్నారు. వీరు ఎదుర్కొనే అత్యంత సాధారణ వ్యాధులు కడుపుకు సంబంధించినవే ఉంటున్నాయి. కడుపు నొప్పి, మలబద్ధకం, అసిడిటీ, పేగు ఇన్ఫెక్షన్లు, గ్యాస్, అజీర్తి వంటివి ముఖ్యంగా వేదిస్తున్నాయి. అయితే, ఈ సమస్యలతో రోజూ ఇబ్బందిపడే బదులు ఇప్పుడే మీ పొట్ట సమస్యలకు చెక్ పెట్టేయండి. ఈ పేగు సమస్యలకు కారణం శరీరంలో ప్రీబయోటిక్స్ మరియు ప్రోబయోటిక్స్ లేకపోవడమేనని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. అటువంటి పరిస్థితిలో, కడుపులో ఎక్కువ గ్యాస్ ఏర్పడుతుంది, దీనివల్ల అజీర్ణం వంటి సమస్యలు వస్తాయి. ఇలాంటి సమస్యలు ఎదుర్కొనే వారికి ఇక్కడ ఒక సులభమైన మార్గం ఉంది. ఇది చాలా ఎఫెక్టివ్ గా కూడా పనిచేస్తుంది. గట్ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి డైటీషియన్ మరియు పోషకాహార నిపుణులు ప్రొబయోటిక్ సలాడ్ ను సూచిస్తున్నారు. ప్రీబయోటిక్స్‌తో నిండిన ఈ రుచికరమైన, ఆరోగ్యకరమైన సలాడ్‌ను తయారు చేయడానికి మీరు మార్కెట్లో లభించే ఏవైనా సీజనల్ కూరగాయలను ఉపయోగించవచ్చు. దీనికి క్యారెట్లు, దుంపలు, దోసకాయలు, టమాటాలు, ఉల్లిపాయలు, ఆలివ్స్, వేయించిన నువ్వులు, ఆలివ్ ఆయిల్, మిరియాల పొడి, కొన్ని పచ్చి మిరపకాయలు, పెరుగు జోడించవచ్చు. ప్రొబయోటిక్ సలాడ్ సిద్ధం చేయడానికి, మీ వంటగదిలో అందుబాటులో ఉన్న కావలసిన కూరగాయలను పొడవుగా ముక్కలుగా కట్ చేసుకోండి. మీ దగ్గర క్యారెట్లు, బీట్‌రూట్లు, దోసకాయలు, పచ్చి మిరపకాయలు ఉంటే, వాటిని ఒక గిన్నెలోకి మార్చండి. ఈ కూరగాయల పైన కొద్దిగా వెనిగర్, తగినంత పింక్ సాల్ట్ వేయండి. వెనిగర్ మోతాదు మించకుండా ఒక స్పూన్ వరకే తీసుకోవాలి. అందులో పెరుగును కూడా కలుపుకోవచ్చు. వీటన్నింటిని మిక్స్ చేసి అందులో కాస్త మిరియాల పొడి చల్లుకుని కనీసం ఒక గంట పాటు దీనిని అలానే ఉంచాలి. కడుపు సమస్యల నుండి మిమ్మల్ని రక్షించే విటమిన్లు మరియు ఖనిజాలతో నిండిన ఈ సలాడ్, ఒక గంట తర్వాత తినవచ్చు. మీరు దీన్ని ఆహారంతో పాటు లేదా నేరుగా తినవచ్చు. ఇది కడుపు సమస్యల నుండి మీకు ఉపశమనం కలిగిస్తుంది. దీనితో పాటు, ఇది శరీరానికి అనేక ఇతర ప్రయోజనాలను కూడా అందిస్తుంది. కడుపు సమస్యలను నివారించడానికి, ముందుగా ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకోండి. ఈ సమస్యలను అనేక విధాలుగా పరిష్కరించవచ్చు, కారం ఎక్కువగా ఉండే ఆహారాలు తినకపోవడం, ఆహారంలో ఫైబర్ మొత్తాన్ని పెంచడం, భోజనం మానేయకపోవడం, తగినంత నీరు త్రాగడం మరియు ఒత్తిడిని తగ్గించడం వంటివి. పేగు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి, మీ జీవనశైలిపై శ్రద్ధ వహించండి. మంచి ఆరోగ్యం బాగుండాలంటే ముందు మీ పొట్ట బాగుండాలి. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం మరియు రోజువారీ వ్యాయామం లేదా యోగా చేయడం వల్ల ఈ సమస్యల నుండి ఉపశమనం పొందవచ్చు.

## ప్రెగ్నెన్సీటైంలో ఆఫీసుకు వెళ్తున్నారా..!

ప్రెగ్నెన్సీ సమయంలో కూడా తప్పదు జాబ్ చేసుకోవాలి అనుకునేవారు, ఆఫీస్ కి వెళ్లేవారు తప్పకుండా కొన్ని రకాల విషయాలను గుర్తుంచుకోవాలి అని చెబుతున్నారు. మామూలుగా ప్రెగ్నెన్సీ గా ఉన్నప్పుడు స్త్రీలు ఎక్కువగా టైర్డ్ అవుతూ ఉంటారు. తక్కువ పని చేస్తూ ఎక్కువ విశ్రాంతి తీసుకోమని వైద్యులు కూడా చెబుతూ ఉంటారు. బరువైన పనులు చేయకూడదని చెబుతూ ఉంటారు. అయితే ప్రస్తుత రోజుల్లో చాలామంది ఉద్యోగాలు చేస్తే తప్ప ఇల్లు గడవని పరిస్థితి. అటువంటి వారు గర్భవతి అయినా సరే ఆఫీసులకు వెళుతూ ఉంటారు. ప్రెగ్నెన్సీ సమయంలో గంటల తరబడి పొజిషన్ లో కూర్చొని ఆఫీస్ లో పనిచేస్తూ ఉంటారు. ఇలా ఎక్కువ సేపు గంటల తరబడి ఒకే పొజిషన్లో కూర్చుని పనిచేయడం వల్ల తల్లితో పాటు బిడ్డ ఆరోగ్యం కూడా ప్రమాదంలో పడుతుందని హెచ్చరిస్తున్నారు ఆరోగ్య నిపుణులు. ప్రెగ్నెంట్ స్త్రీలు ఆఫీస్ కు మీరే డ్రైవ్ చేసుకుంటూ వెళుతున్నట్లయితే కేవలం రెండో నెల వరకు మాత్రమే ఇలా వెళ్లవచ్చుట. మూడో నెల పడినప్పటి నుంచి ఇలా చేయడం మంచిది కాదని డ్రైవింగ్ చేయడం వల్ల చాలా రకాల అసౌకర్యాలు కలుగుతాయని అలా మీరు ఒక్కరే ప్రయాణించడం కూడా మంచిది కాదని చెబుతున్నారు. అలాగే మీరు ఒక్కరే ప్రయాణించడం సేఫ్ కాదు.

అందుకే ఇలాంటి సమయంలో మీరు ఒక డ్రైవర్ ను నియమించడం లేదా ఇంటి వాళ్లను ఆఫీసుదాకా తీసుకెళ్లడం మంచిదని చెబుతున్నారు. ముఖ్యంగా రద్దీగా ఉండే పబ్లిక్ ప్లేస్లోకి వెళ్ళడం చాలా వరకు తగ్గించాలని చెబుతున్నారు. ఎందుకు అంటే రద్దీగా ఉన్న ప్రదేశాలలో మనుషులు వెళ్లడానికి కూడా ప్లేస్ ఉండదు. కాబట్టి అలాంటి ప్రదేశాలలోకి నిండు గర్భిణీలు వెళ్లకపోవడమే మంచిది అని చెబుతున్నారు. మీ ఇంటికి, ఆఫీసుకు మధ్య దూరం ఎక్కువగా ఉన్నట్లైతే మధ్యలో టీ, కాఫీలను తాగడం మానుకోవాలి. ఎందుకంటే దీనివల్ల మీరు పదే పదే టాయిలెట్ కు వెళ్లాల్సి వస్తుంది. దారిలో వేరే మార్గం లేకపోతే టాయిలెట్ ఆపాల్సి ఉంటుంది. ఇది ఆరోగ్యానికి మంచిది కాదట. ఆఫీసులో వికారంగా, వాంతులు వచ్చినట్టుగా అనిపిస్తే అల్లం, నిమ్మకాయను వెంట ఉంచుకోవడం మంచిది. ఎక్కువ సేపు సీట్లో కూర్చోకూడదు. కాబట్టి అప్పుడప్పుడూ సీట్లోంచి లేచి నడుస్తూ ఉండాలి. ఇలా చేయడం వల్ల వెన్నునొప్పి తగ్గుతుందట. అలాగే కాళ్లలో రక్త ప్రసరణ కూడా సక్రమంగా ఉంటుందట. కాళ్ల వాపు వచ్చే అవకాశం కూడా తగ్గుతుందని చెబుతున్నారు. అలాగే ఖాళీ కడుపుతో అంటే ఏమీ తినకుండా ఆఫీసుకు వెళ్లకూడదు. ఇది మిమ్మల్ని బలహీనంగా చేస్తుందట. మీ కడుపులో ఉన్న మీ బిడ్డ ఆరోగ్యానికి కూడా మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలాగే ఆఫీసులలో మూడో నెల నుంచి కంఫర్టబుల్గా ఉండే కుర్చీలో మాత్రమే కూర్చోవాలట. అలాగే మీరు కాళ్లు వేలాడదీసి ఎక్కువ సేపు కూర్చోకూడదట. పాదాలకు మద్దతు ఇవ్వడానికి కుర్చీ కింద ఒక స్టూల్ ను పెట్టడం వల్ల పాదాల వాపు వచ్చే సమస్య ఉండదట.

# సినిమా



## ఒకప్పుడు టాలీవుడ్ లవర్ బాయ్..

### ఇప్పుడేమో సినిమాలకే దూరం..

టాలీవుడ్ నటుడు తరుణ్ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. దిగ్గజ నటి రోజా రమణి, నిర్మాత చక్రపాణి దంపతుల కుమారుడైన తరుణ్ గురించి అందరికీ తెలిసిన విషయమే. బాలనటుడిగా వెండితెరపై తన ప్రస్థానాన్ని ప్రారంభించిన తరుణ్, చిన్న వయసులోనే సినీ రంగంలోకి అడుగుపెట్టాడు. తెలుగు, తమిళం, మలయాళం అని తేడా లేకుండా అన్ని భాషల్లో నటించి ప్రేక్షకులను మెప్పించాడు. ఇక బాలకృష్ణ ఆదిత్య 369 సినిమాతో పాటు వెంకటేశ్ సూర్య ఐపీఎస్ వంటి చిత్రాలు తరుణ్‌కి బాలనటుడిగా మంచి గుర్తింపును తెచ్చిపెట్టాయి. అయితే బాల నటుడిగానే కాకుండా కొన్ని రోజులు క్రికెటర్‌గా రాణించిన తరుణ్ 2000 సంవత్సరంలో నువ్వేకావాలి చిత్రంతో హీరోగా ఎంట్రీ ఇచ్చాడు. తొలి సినిమాతోనే బ్లాక్ బస్టర్ సాధించడమే కాకుండా టాలీవుడ్‌లో స్టార్ నటుడిగా ఎదిగాడు. ఆ తర్వాత 'నువ్వు లేక నేను లేను', 'నువ్వే నువ్వే' వంటి సూపర్ హిట్‌లను అందుకున్నాడు. అయితే కెరీర్‌లో ఎక్కువగా ప్రేమకథా చిత్రాలపైనే దృష్టి సారించిన తరుణ్ లవర్ బాయ్‌ని ఇమేజ్‌ని తెచ్చుకోగా.. మాస్‌లో ఇమేజ్‌లో మాత్రం విఫలమయ్యాడు. దీంతో డిఫరెంట్‌గా ట్రై చేద్దాం అనుకున్న ప్రతిసారి ఆయన పరజయాలు చవిచూశాడు. ఇక చివరిగా ఆయన నటించిన చిత్రం ఇది నా లవ్ స్టోరీ. 2018లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌ని నమోదు చేసింది. ఇక అప్పటినుంచి సినిమాలకు దూరంగా ఉంటూ వస్తున్నాడు తరుణ్. ఇక సినిమాలకు దూరమైన తరుణ్ ప్రస్తుతం బిజినెస్ రంగంలోకి దిగినట్లు తెలుస్తుంది. ఇక సినిమాలు వదిలేసిన తరుణ్ లైఫ్‌లో కూడా ఒక లవ్‌స్టోరీ ఉన్నట్లు తెలుస్తుంది. తరుణ్ నువ్వే కావాలి సినిమా సమయంలో ఒక హీరోయిన్‌తో డేటింగ్‌లో ఉన్నట్లు అప్పట్లో వార్తలు వచ్చాయ. సినిమా షూటింగ్ సమయంలో వీరిద్దరి మధ్య సన్నిహిత స్నేహం ఏర్పడినట్లు, అది తర్వాత ప్రేమగా మారి విడిపోయే స్థాయికి వచ్చిందని కొన్ని గాసిప్‌లు వచ్చాయి. అయితే, ఈ విషయంపై తరుణ్ లేదా ఆ నటి నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఈ సినిమా తర్వాత ఎవరి కెరీర్ వారు చూసుకున్నారని సమాచారం. అయితే తరుణ్ ఆ హీరోయిన్‌ను మర్చిపోయి ఆ బాధ నుంచి కోలుకోవడానికి చాలా కాలం పట్టిందని ఇండస్ట్రీలో టాక్.

## శ్రీలీల వల్ల 'ధమాకా' ఆడడమేంటి?

మాస్ రాజా రవితేజ కెరీర్లో బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచిన చిత్రం.. ధమాకా. మిక్స్ టాక్, యావరేజ్ రివ్యూస్‌తో మొదలైన ఈ చిత్రం.. ఎవ్వరూ ఊహించని విధంగా రూ.100 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టి ఆశ్చర్యపరిచింది. ఐతే టాక్, రివ్యూలు గొప్పగా లేకపోయినా తట్టుకుని ఈ సినిమా అంత పెద్ద విజయం సాధించడానికి ఇందులోని పాటలు, శ్రీలీల గ్లామర్-డ్యాన్సులు ముఖ్య కారణం అనే చర్చ అప్పట్లో జరిగింది. ఇదే మాట ఆ సినిమా రైటర్ ప్రసన్న కుమార్ బెజవాడ దగ్గర ప్రస్తావిస్తే అతను ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. కేవలం హీరోయిన్ గ్లామర్, డ్యాన్సుల వల్ల సినిమా ఆడేస్తుందా అని అతను ప్రశ్నించాడు. శ్రీలీల 'ధమాకా' తర్వాత కూడా చాలా సినిమాలు చేసింది కదా.. వాటిలోనూ అందంగా కనిపించింది, అదిరిపోయే డ్యాన్సులూ వేసింది.. మరి అవన్నీ హిట్టయ్యాయా అని అతను ప్రశ్నించాడు. ఏ సినిమా అయినా బాగా ఆడిందీ అంటే అందుకు ప్రధాన కారణం కథేనని ప్రసన్న కుమార్ అభిప్రాయపడ్డాడు. ఒక సినిమాలో పాటు మహా అయితే 20 నిమిషాలు ఉంటాయని.. ఆ 20 నిమిషాలు ప్రేక్షకులకు మంచి ఫీలింగ్ వస్తే సినిమా ఆడేస్తుందా అని అతను ప్రశ్నించాడు. మిగతా రెండు గంటల పాటు కథను ఆసక్తికరంగా నడిపిస్తేనే ప్రేక్షకులు ఎంగేజ్ అవుతారని అతనన్నాడు. కథ బాగుండి అది సినిమాను డ్రైవ్ చేస్తే.. హీరోయిన్ గ్లామర్, డ్యాన్సులు లాంటివి బోనస్ అవుతాయని.. సినిమా ఇంకా పెద్ద స్థాయికి వెళ్లడానికి తోడ్పడతాయని ప్రసన్న అభిప్రాయపడ్డాడు. అంతే తప్ప హీరోయిన్ గ్లామర్, డ్యాన్సులతో ఏ సినిమా ఆడదన్నాడు.





## అఖిల్ ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్..

## ఓటీటీకి 'ఏజెంట్'

టాలీవుడ్ యంగ్ హీరో అక్కినేని అఖిల్ నటించిన ఫుల్ యాక్షన్ చిత్రం 'ఏజెంట్'. 2023 ఏప్రిల్ 28న థియేటర్లలో రిలీజైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టింది. సురేందర్ రెడ్డి డైరెక్షన్‌లో తెరకెక్కించిన ఈ మూవీలో మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి కీలక పాత్రలో కనిపించారు. ఇందులో అఖిల్ సరసన సాక్షి వైద్య హీరోయిన్‌గా మెప్పించింది. అయితే అభిమానుల భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా డిజాస్టర్‌గా నిలిచింది. ఈ చిత్రాన్ని రూ . 70 కోట్లతో అనిల్ సుంకర ఈ చిత్రాన్ని నిర్మించారు. అయితే ఈ మూవీ విడుదలై దాదాపు రెండేళ్లు కావొస్తోంది. కానీ ఇప్పటివరకు ఓటీటీకి రాలేదు. గతంలో సోనీలివ్‌లో స్ట్రీమింగ్‌కు రానుందని ప్రకటించారు. కొన్ని అనివార్య కారణాలతో ఓటీటీ రిలీజ్ వాయిదా పడుతూనే ఉంది. గతంలో పలుసార్లు డేట్స్ అనౌన్స్ చేసినప్పటికీ స్ట్రీమింగ్‌కు రాకపోవడంతో అఖిల్ ఫ్యాన్స్ తీవ్ర నిరాశకు గురయ్యారు. అయితే తాజాగా అఖిల్ అభిమానులకు ఎట్టకేలకు ఓ గుడ్ న్యూస్ వచ్చేసింది. తాజాగా ఏజెంట్ మూవీ ఓటీటీ స్ట్రీమింగ్ తేదీని ఖరారు చేశారు. మార్చి 14వ తేదీ నుంచి సోనీ లివ్‌లో స్ట్రీమింగ్ కానుందని వెల్లడించారు. ఈ విషయాన్ని ఓటీటీ సంస్థ సోనీ లివ్ అధికారికంగా ప్రకటించింది. దీంతో అక్కినేని ఫ్యాన్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు

## బ్యాడ్ డైరెక్టర్స్ గురించి ప్రశాంత్ నీల్



సౌత్ ఇండియాలోనే కాదు బాలీవుడ్ లోనూ చాలా క్రేజ్ ఉన్న దర్శకుల్లో ప్రశాంత్ నీల్ ఒకరు. కెజిఎఫ్ వల్ల ఆయన పేరు మారుమ్రోగిపోయింది. షారుఖ్ ఖాన్ పోటీని తట్టుకుని ఇమేజ్ లేని హీరోతో బ్లాక్ బస్టర్ సాధించడం గురించి అప్పట్లో బోలెడు మాట్లాడుకున్నారు. సలార్ సైతం భారీ విజయం నమోదు చేసుకుని ప్రభాస్ వన్ అఫ్ ది బెస్ట్ గా నిలిచింది. ప్రస్తుతం జూనియర్ ఎన్టీఆర్ తో డ్రాగన్ (ప్రచారంలో ఉన్న టైటిల్) పనిలో బిజీగా ఉన్న ఈ క్రేజీ డైరెక్టర్ ఇంకో పది నెలల్లో సరికొత్త ప్రపంచాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నాడు. ఇక బ్యాడ్ డైరెక్టర్స్ అని ఎవరిని అన్నాడో చూద్దాం. ఇటీవలే ఫిలిం స్టూడెంట్స్ కోసం అక్కినేని అమల నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ప్రశాంత్ నీల్ కొన్ని ఆసక్తికరమైన ముచ్చట్లు పంచుకున్నారు. " సినిమా చూడటం వేరు. తీయడం వేరు. 2014 ఉగ్రంకు ముందు ఇప్పటిదాకా సినిమాలు తీసినవాళ్లంతా బ్యాడ్ డైరెక్టర్స్ అనుకునే వాడిని. ఇండస్ట్రీలో నేనే మార్పు తేవాలని ఫీలయ్యేవాడిని. కానీ సెట్లోకి అడుగు పెట్టి షూటింగ్ స్టార్ట్ చేసి కొంత భాగం పూర్తయ్యాక అసలైన కష్టమంటే ఏంటో తెలిసొచ్చింది. నేను తీసింది పది మంది చూసినా చాలనుకునేవాడిని. టెన్నిస్ లాంటి ఫిలిం మేకింగ్ ని క్రికెట్ అనుకున్నా. పరిశ్రమలో టీమ్ వర్క్ ఉంటేనే విజయం వరిస్తుంది." చూశారుగా ప్రశాంత్ నీల్ తొలినాళ్లలో ఎలాంటి ఆలోచనలతో ఉన్నారో. సాధారణంగా ప్రాథమిక దశలో దర్శకుల ఆచరణలు ఇదే విధంగా ఉంటాయి. మనమే తోప్ అనుకుని కెమెరా, యాక్షన్ అంటూ మెగా ఫోన్ పట్టుకుంటారు. కానీ నీల్ చెప్పిన జీవిత సత్యం వింటే రియాలిటీ ఎంత భయపెట్టేలా ఉందో అర్థమవుతుంది.

# మేం త్వరలో బీజేపీకి మరో గిఫ్ట్ ఇస్తాం'

-మొదటిపేజీ తరువాయి

' మేం బీజేపీకి ఎన్నో గిఫ్టులు ఇచ్చాం. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి రంజాన్ గిఫ్ట్ ఇచ్చయా?, మేం కూడా బీజేపీకి త్వరలోనే మరో గిఫ్ట్ ఇస్తాం. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఒప్పందాలు బయటకి వస్తున్నాయి. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఓటర్ల తీర్పును గౌరవిస్తున్నాం. నరేందర్ రెడ్డికి ఓటేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. క్రియాశీలకంగా పని చేసిన కార్యకర్తలకు ధన్యవాదాలు. కాంగ్రెస్ అభ్యర్థిని ఓడగొట్టేందుకు బీఆర్ఎస్ బీజేపీ చీకటి ఒప్పందం చేసుకున్నాయి. బీజేపీ, బీఆర్ఎస్ ల ఫెవికాల్ బంధం గట్టిగా చేసేందుకు చేసిన కృషి అందరూ చూశారు. బీఆర్ఎస్ తమ అభ్యర్థిని ఎందుకు నిలబెట్టలేదు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రవీందర్ సింగ్ కి వచ్చిన ఓట్లు ఎన్ని?, తనకి బీఆర్ఎస్ సంపూర్ణ సహకారం ఇచ్చిందని రవీందర్ సింగ్



అన్నాడు. బీజేపీకి తోడుగా బీఆర్ఎస్ నిలబడింది' అని శ్రీధర్ బాబు విమర్శించారు.

బీజేపీ, బీఆర్ఎస్ కలవడమనేది వారి పతనానికి తొలి అడుగు అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించుకోవడానికి బీఆర్ఎస్ బాగా శ్రమించిందని విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి తమకు ఎమ్మెల్సీ ఎన్నికల రూపంలో రంజాన్ గిఫ్ట ఇచ్చిందని భావిస్తే, త్వరలో తామూ ఇస్తామని వ్యాఖ్యానించారు. గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతిచ్చిన రవీందర్ సింగ్‌కు వచ్చిన ఓట్లు ఆయనకు వ్యక్తిగతంగా వచ్చినవే అన్నారు.

**రెండు పార్టీలు కలిసి ఓడించాయి: పొన్నం ప్రభాకర్**

బీజేపీ, బీఆర్ఎస్ కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఓడించాయని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. అభ్యర్థిని పెట్టకుండా బీఆర్ఎస్... బీజేపీతో కుమ్మక్కైందని మండిపడ్డారు. కేటీఆర్, హరీశ్ రావు నియోజకవర్గాల్లో జరిగిన ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వారు ఎవరికి ఓటేశారో చెప్పాలని నిలదీశారు. ఈ ఓటమిని తాము సమీక్షించుకుంటామని అన్నారు.

# 'సేవ్ తెలంగాణ - సపోర్ట్ బీజేపీ మా నినాదం'

**హైదరాబాద్:** ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీని తెలంగాణ ప్రజలు ఆదరిస్తున్నారని, అందుకు ఈ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి. ఎమ్మెల్సీ ఎన్నికల విజయం.. తెలంగాణ సమాజానికి అంకితమన్న కిషన్ రెడ్డి.. ఈ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు.

'పదేళ్లు అధికారంలో ఉంటామంటున్న కాంగ్రెస్ కు ఈ ఎన్నికల్లో కర్రకాల్చి వాత పెట్టారు. మా సంస్థాగత ఎన్నికలు కూడా పూర్తి కావొచ్చాయి. రానున్న రెండు నెలల్లో అన్ని కమిటీలు పూర్తి చేసుకుంటాం. రాష్ట్రంలో పూర్తి బలోపేతం దిశగా పని చేస్తాం. అసెంబ్లీలో ఈ ప్రభుత్వాన్ని ప్రజల తరపున అడుగడుగునా ప్రశ్నిస్తాం. తెలంగాణ ప్రజల గుండె చప్పుడు శాసన సభ, శాసన మండలిలో వినిపిస్తాం. త్రిశూలం మాదిరి మండలిలో ముగ్గురు సభ్యులు బీజేపీకి ఉన్నారు . కార్యకర్తల మీద కేసులు, కుట్రలు చేసినా బీజేపీ గెలిచింది. ఈ విజయంతో మేమేమి అతి ఉత్సాహం చూపించడం లేదు, మా బాధ్యత మరింత పెరిగింది.

ఈ ప్రభుత్వం మీద మరింత పోరాడాలని, ప్రశ్నించాలని బాధ్యత పెట్టారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటం చేస్తాం. రాష్ట్రంలో వ డబుల్ ఇంజిన్ సర్కారు రావాల్సిన అవసరం ఉంది బీజేపీ బలపడి తెలంగాణను రక్షించాలి. సేవ్ తెలంగాణ – సపోర్ట్ బీజేపీ మా నినాదం. రెఫరెండం అని ఎవరు అన్నారో వాళ్లే ఆత్మ పరిశీలన చేసుకోవాలి. తెలంగాణ ప్రజల మద్దతు, ఉపాధ్యాయులు, గ్రాడ్యుయేట్ల, ఉద్యమకారుల సపోర్టుతో



గెలిచాం.

ఆ రెండు బీఆర్ఎస్ కాంగ్రెస్సే కలిసాయి కానీ మేము ఎప్పుడు ఎవరిని కలవలేదు. ఎవరిని కలిసే ప్రసక్తే కూడా లేదు. సమస్యలపై ఎవరితోనైనా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాం . పనికిమాలిన ఆరోపణలు చేస్తే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాంటి తీర్పు వచ్చిందో అదే రిపీట్ అవుద్ది. కాంగ్రెస్ అధికారంలో ఉన్న మూడు రాష్ట్రాల్లో ఓడించి తీరుతాం. ఖమ్మం, వరంగల్, నల్గొండ ఉమ్మడి జిల్లాల్లో పార్టీని బలోపేతం చేయడమే మా నెక్స్ట్ టార్గెట్' అని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

**రేవంత్‌ను ఎవరూ పట్టించుకోవడం లేదు..**

**ఇది చెంప పెట్టులాంటి తీర్పు**

తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ గెలుపుపై కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర చీఫ్ కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికలతో పాలక పక్షంపై ఉన్న ప్రజా వ్యతిరేకత బయటపడిందని, తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ రావడం ఖాయమని అన్నారాయన.

కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు సాధారణ విషయమేమీ కాదు. ఇది బీజేపీ సాధించిన సమిష్టి విజయం. తెలంగాణలో పాలకులు మారినా.. మార్పు రాలేదు. గత పార్లమెంట్ ఎన్నికల్లో 37 శాతం మంది బీజేపీని ఆదరించారు. ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో మేధావులు, విద్యావంతులు బీజేపీకి అండగా నిలిచారు. .. కాంగ్రెస్‌కు, రేవంత్‌కు చెంప పెట్టులాంటి తీర్పు ఇచ్చారు. రేవంత్‌ను ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజా వ్యతిరేకత అర్థమైంది. తెలంగాణ ప్రజలు బీజేపీ ప్రత్యామ్నాయంగా చూస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ రావడం పక్కా" అని అన్నారాయన.

ఇక పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపొందిన అంజిరెడ్డి సాక్షితో మాట్లాడుతూ.. ఈ విజయం బీజేపీ కార్యకర్తలందరిదని అన్నారు. కిషన్ రెడ్డి, సంజయ్ తో పాటు, అందరి సహకారంతో ఈ విజయం సాధించాం. మేము ఊహించినట్టే విజయం దక్కింది. మండలిలో ఉద్యోగుల సమస్యలపై గళం విప్పుతా" అని అన్నారు.

ఇది బీజేపీ కార్యకర్తల విజయం. కాంగ్రెస్ ప్రభుత్వానికి, పార్టీకి చెంపపెట్టు ఈ విజయం. తెలంగాణాలో బీజేపీ బలపడుతుందనేందుకు ఈ ఎమ్మెల్సీ ఎన్నికల విజయాలు నిదర్శనం. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపైనా ఈ విజయం ప్రభావం తప్పకుండా ఉంటుంది అని అన్నారు.

# వ్యూహాల్లో కిషన్... మండలి ఎన్నికల్లో స్వీప్

**హైదరాబాద్ :** ఎవరైనా గట్టిగా కొడతారు.. లేకపోతే గురి చూసి కొడతారు.. ఈయనేంట్రా పద్దతిగా అంటు కట్టినట్లుగా కొట్టాడు" అని ఓ సినిమాలో డైలాగ్ ఉంటుంది. ఇది ప్రస్తుత తెలంగాణ రాజకీయాలలో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి సరిగ్గా సరిపోతుంది. తెలంగాణలో జరిగిన మూడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు బీజేపీ గెల్చుకుంది. అభ్యర్థుల ఎంపిక నుంచి.. పోలింగ్ లో ఓట్లు వేయించుకునే వ్యూహం వరకూ తనదైన వ్యూహాలతో నడిపించిన కిషన్ రెడ్డి సైలెంట్ గా కాంగ్రెస్ పార్టీని చావు దెబ్బకొట్టారు. అధికారంలో ఉన్న పార్టీ నుంచి పట్టభద్రుల ఎమ్మెల్సీని గెలుచుకోవడం అంటే చిన్న విషయం కాదు. కానీ ఉత్తర తెలంగాణలోని నాలుగు జిల్లాల్లో బీజేపీని బలోపేతం చేయడమే కాదు... సానుభూతి పరుల్ని ఓటర్లుగా మార్చే వ్యూహంలో కిషన్ రెడ్డి తనదైన నాయకత్వాన్ని చూపించారు. తెలంగాణలో బీజేపీకి ప్రజల మద్దతు పూర్తి స్థాయిలో లభిస్తోందని దాన్ని ఓట్లుగా మార్చుకునే మెకానిజాన్ని కిషన్ రెడ్డి ఓ ప్లాన్ ప్రకారం ఏర్పాటు చేసుకుంటూ పోయారు. ఎమ్మెల్సీ ఎన్నికలు వస్తాయని తెలిసిన వెంటనే.. కార్యాచరణ ప్రారంభించారు. పట్టభద్రుల నియోజకవర్గం నాలుగు ఉత్తర తెలంగాణ ఉమ్మడి జిల్లాల్లో ఉంటుంది. అంటే టీచర్స్ నియోజవర్గాలు రెండింటిని కలుపుకుంటే 13 జిల్లా, 42 అసెంబ్లీ స్థానాలు, 270 మండలాలు, ఆరు లోక్ సభ నియోజకవర్గాల పరిధిలో ఈ ఎన్నికలు జరిగాయి. అన్ని చోట్లా ప్రతి గ్రాడ్యుయేట్, టీచర్ ఓటర్‌ను చేరేలా పకడ్బందీ ప్రచార ప్రణాళికను .. ప్రతి ఒక్క ఓటర్‌ను మూడు, నాలుగు సార్లు కలిసేలా ఓ వ్యవస్థను ఏర్పాటు చేసి కిషన్ రెడ్డి ప్రచారం చేశారు. ఈ వ్యూహాన్ని కాంగ్రెస్ అర్థం చేసుకోలేకపోయింది.. ఛేధించలేకపోయిందని.. ఫలితాలను బట్టి అర్థమవుతోంది. టీచర్స్ నియోజకవర్గంలో తొలి ప్రాధాన్యత ఓట్లతోనే కొమురయ్య గెలిచారు. పట్టబద్రుల నియోజకవర్గంలో అత్యంత హోరాహోరీగా జరిగినా ఓట్లు చీల్చే వ్యూహాలను కాంగ్రెస్ పార్టీ పాటించినా బీజేపీ విజయాన్ని ఆపలేకపోయారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మరోసారి తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన కిషన్ రెడ్డికి .. ఆ ఎన్నికలను ఎదుర్కొనే విషయంలో సమయం సరిపోలేదు. ఓ వైపు కేంద్ర మంత్రిగా ఈశాన్య రాష్ట్రాల గురించి పట్టించుకుంటూనే తెలంగాణలో ఎన్నికలు ఎదుర్కోవాల్సి వచ్చింది. అయినప్పటికీ.. పార్టీ ఒక్క అసెంబ్లీ




స్థానం నుంచి ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు చేరింది. ఓటు బ్యాంక్ 14 శాతానికి చేరింది. అంతకు ముందు ఈ ఓటు బ్యాంక్ ఆరు శాతం వరకే ఉండేది. ఈ ఉత్సాహంతో కిషన్ రెడ్డి పార్లమెంట్ ఎన్నికలపై గురి పెట్టారు. ఐదు నెలల్లోనే పార్టీని ఆయన బలోపేతం చేశారు. మోదీ చరిష్మాను ఉపయోగించుకుని .. లోక్ సభ ఎన్నికల్లో గరిష్టంగా సీట్లు తీసుకురావడంలో సక్సెస్ అయ్యారు. ఎనిమిది పార్లమెంట్ సీట్లలో బీజేపీ తిరుగులేని విజయం సాధించింది. రెండు, మూడు చోట్ల మినహా అన్ని చోట్ల రెండో స్థానంలో నిలిచింది. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఓటు బ్యాంక్ 35 శాతానికి పెరిగింది. అంటే అధికార కాంగ్రెస్ పార్టీతో సమానంగా ఉంది. లోక్ సభ ఎన్నికల్లో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా వచ్చిన మెజార్టీలు చూస్తే.. 40 స్థానాల్లో బీజేపీ ఆధిక్యం లభించింది. ఆ తర్వాత ఇక వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం లేకుండా పోయింది. భారతీయ జనతా పార్టీలో కింది స్థాయి నుంచి ఎదిగిన నేత కిషన్ రెడ్డి. ఆయనకు పార్టీ భావజాలంపై, విధానాలపై పూర్తి స్థాయిలో అవగాహన ఉంటుంది. ఏ మాత్రం పార్టీ లైన్ దాటరు. ఇప్పటి వరకూ ఆయన వివాదాస్పదంగా చేసిన ఒక్క ప్రకటన ఉండదు. అలాగని పార్టీ విధానాలను బలంగా చెప్పలేదన్న అభిప్రాయం కూడా ఉండదు. బీజేపీ ఐడియాలజీని ఎంత బలంగా చెబుతారంటే..ఆయన మాటల్ని ఎవరూ వివాదాస్పదం చేయలేరు. అలాంటి రాజకీయంతోనే బీజేపీని బలోపేతం చేస్తూ వస్తున్నారు. ఇతర నేతలపై పరుషంగా మాట్లాడితేనో.. తిట్లందుకుంటేనో వార్తల్లో ఉంటామని.. దాని వల్ల పార్టీకి నష్టం జరుగుతుంది. అందుకే ఎప్పుడు అలాంటి రాజకీయం చేయరు. కానీ రాజకీయంగా ఎప్పుడూ పార్టీ విధానాలు, భావజాలం విషయంలో రాజీపడరు. తెలంగాణ బీజేపీకి అలాంటి పునాదులు వేసిన కిషన్ రెడ్డి .. ఇప్పుడు విజయాల పరంపరంలోనూ కీలక పాత్ర పోషిస్తున్నారు. తెలంగాణలో పార్టీని బలోపేతం చేయడంలో కిషన్ రెడ్డి స్టైల్ ను జాతీయ నాయకత్వాన్ని కూడా ఆకర్షించింది. అందుకే పార్టీ పరంగా అయినా పాలన పరంగా అయినా కీలకమైన బాధ్యతల్ని అప్పగిస్తూ వస్తున్నారు. మొదటగా కేంద్ర సహాయ మంత్రిగా ప్రమాణ చేశారు కానీ కొద్ది కాలానికే ఆయనకు కేబినెట్ మంత్రిగా ప్రమోషన్ లభించింది. ఐదుగురు సహాయ మంత్రులు కిషన్ రెడ్డి శాఖలను చూసేందుకు ఉండేవారు. వెంటనే మరోసారి మోదీ కేబినెట్ లో చోటు దక్కించుకున్నారు. కిషన్ రెడ్డి పనితీరుపై నమ్మకంతోనే కేంద్రమంత్రిగా ఉంటూనే తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా కూడా కొనసాగించారు. మామూలుగా అయితే కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే.. పార్టీ పరమైన బాధ్యతల నుంచి విముక్తి చేస్తారు. రెండింటికి న్యాయం చేయలేరని అనుకుంటారు. కానీ కిషన్ రెడ్డి పనితీరుపై కేంద్ర పెద్దలకు ఉన్న నమ్మకం వల్ల ఆయనను కొనసాగించారు. గతంలో అమిత్ షా మాత్రమే జాతీయ అధ్యక్షుడిగా, కేంద్ర మంత్రిగా కొనసాగారు. ప్రధాని మోదీతో కలిసి కింది స్థాయి నుంచి కలిసి పని చేశారు కిషన్ రెడ్డి. ఆయన నిజాయితీ, కష్టపడే తర్వాత మోదీకి బాగా తెలుసు. జాతీయ నాయకత్వం మద్దతుతో కిషన్ రెడ్డి తెలంగాణలో బీజేపీని బలోపేతం చేస్తున్నారు. కిషన్ రెడ్డి దశాబ్దాల రాజకీయంలో అధికారంలో పదవులు చేపట్టింది చాలా తక్కువ. పార్టీ కార్యకర్త, పార్టీ నేతగానే ఎక్కువగా పని చేస్తూ వచ్చారు. తెలంగాణలో పార్టీ బలోపేతం వెనుక కిషన్ రెడ్డి వేసిన పునాదులే కీలకం. ఇప్పుడు ఆయనే తెలంగాణలో బీజేపీని అజేయశక్తిగా మారుస్తున్నారు. ఇప్పటికిప్పుడు అసెంబ్లీ ఎన్నికలు జరిగితే.. బీజేపీదే విజయం అన్నంతగా తెచ్చారు. ఇప్పుడు బీజేపీ ఎదురుచూస్తోంది.. పోరాడుతోంది.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం కోసమే. ఈ విజయం వెనుక కిషన్ రెడ్డి ముద్ర చాలా బలంగా కనిపిస్తుంది. అందులో సందేహం ఉండదు. మొదటి నుంచి కనిపించిన పోటీ

## తెలంగాణ ప్రజలకు ధన్యవాదాలు: ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ :** తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై దేశ ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. బీజేపీ అభ్యర్థులను గెలిపించిన తెలంగాణ ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతూ గురువారం ఉదయం ఓ సందేశం విడుదల చేశారాయన. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీని ఆశీర్వదించి గెలిపించిన తెలంగాణ ప్రజలకు ధన్యవాదాలు. కొత్తగా ఎన్నికైన మా అభ్యర్థులకు అభినందనలు. గొప్ప శ్రద్ధతో పని చేసిన పార్టీ కార్యకర్తలను చూసి నేను గర్విస్తున్నా" అని ఎక్స్ పోస్టులో సందేశం ఉంచారాయన.

ఇదిలా ఉంటే.. కరీంనగర్%–%మెదక్%–%నిజామాబాద్%–%ఆదిలాబాద్ జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య గెలిచారు. ఇక.. ఉత్కంఠ భరితంగా సాగిన ఉమ్మడి కరీంనగర్– ఆదిలాబాద్– నిజామాబాద్– మెదక్ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా చిన్నమైల్ అంజిరెడ్డి నెగ్గారు. టీచర్స్ ఎమ్మెల్సీగా కొమురయ్య మొదటి ప్రాధాన్యత ఓట్లతోనే గెలవగా, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కౌంటింగ్ మాత్రం ఉత్కంఠ భరితంగా సాగింది. చివరకు.. తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీకి చెందిన అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డిపై 5,106 ఓట్ల ఆధిక్యంతో అంజిరెడ్డి జయకేతనం ఎగురవేశారు.

## బీజేపీలో కొత్త ఉత్తేజం..

-మొదటిపేజీ తరువాయి

త్వరలోనే ఎమ్మెల్యే ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులతో ప్రధాని మోదీతో సమావేశం ఏర్పాటు చేసేందుకు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు సమన్వయం చేస్తున్నారు. కాగా.. ఈరోజు బీజేపీ కార్యాలయంలో రెండు ఎమ్మెల్సీ (టీచర్ ఎమ్మెల్సీ , గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ) లపై గ్రాండ్ గా సంబురాలు చేసుకోనున్నారు. కాగా.. కరీంనగర్–నిజామాబాద్–ఆదిలాబాద్–మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంతో పాటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాన్ని కూడా బీజేపీ కైవసం చేసుకోవడంతో ఆ పార్టీ నేతల్లో సంబరాలు అంబరాన్నంటాయి. కరీంనగర్–నిజామాబాద్–ఆదిలాబాద్–మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో బీజేపీ అభ్యర్థి గెలుపొందారు. ఆ పార్టీ బలపరిచిన మల్క కొమరయ్య తొలి ప్రాధాన్యత ఓట్లతో టీచర్స్ ఎమ్మెల్సీగా విజయం సాధించారు. మరోవైపు ఉమ్మడి కరీంనగర్ %–% అదిలాబాద్ %–% నిజామాబాద్ %–% మెదక్ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీకి చెందిన నరేంద్ర్ రెడ్డిపై 5,106 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ఈ స్థానానికి మొత్తం 2,52,029 ఓట్లు పోల్ కాగా, 28,686 ఓట్లు చెల్లకుండా పోయాయి. చెల్లుబాటైన 2,23,343 ఓట్లలో గెలుపు కోసం 1,11,672 ఓట్లను కోటా ఓట్లుగా నిర్ధారించారు. మొదటి ప్రాధాన్యత ఓట్లు లెక్కింపు పూర్తయ్యాక బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి 75,675 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి 70,565 ఓట్లు, బీఎస్పీ అభ్యర్థికి 60,419 ఓట్లు వచ్చాయి. ఏ అభ్యర్థికీ గెలుపు టార్గెట్ కోటా అయిన 1,11,672 ఓట్లు రాలేదు. మిగిలిన 53 మంది కలిపి 16,684 ఓట్లు పోలయ్యాయి. దీంతో మొదటి ప్రాధాన్య ఓట్లలో ఎవరికీ కోటా ఓటు రాకపోవడంతో రెండో ప్రాధాన్య ఓట్లను లెక్కించారు. రెండో ప్రాధాన్యత ద్వారా బీజేపీ అభ్యర్థికి 98,637 ఓట్లు రాగా.. కాంగ్రెస్ అభ్యర్థికి 93,531 ఓట్లు పోలయ్యాయి. ఈ క్రమంలో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి 5,106 ఓట్ల తేడాతో విజయం సాధించారు.

**మోదీ అభినందలు**

తెలంగాణలో కొత్తగా ఎన్నికైన బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు మల్క కొమరయ్య, అంజిరెడ్డిలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అభినందనలు తెలియజేశారు. ఎక్స్ వేదికగా మోదీ స్పందిస్తూ.. "బీజేపీ అభ్యర్థులను గెలిపించిన ప్రజలకు ధన్యవాదలు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్సీ అభ్యర్థులకు అభినందనలు. ప్రజల మధ్య ఉంటూ వారి కోసం ఎంతో శ్రద్ధతో పనిచేస్తున్న బీజేపీ కార్యకర్తలను చూసి నేను చాలా గర్వపడుతున్నాను" అంటూ ప్రధాని మోదీ ట్వీట్ చేశారు.

## ఎస్సీ వర్గీకరణకు గ్రీన్ సిగ్నల్

-మొదటిపేజీ తరువాయి

అందుకే ఎస్సీలకు ఇచ్చిన 15 శాతం రిజర్వేషన్‌ను తిరిగి, కులాల మధ్య విభజించి పంచాలనే డిమాండ్ వినిపించింది. ప్రధానంగా రిజర్వేషన్ ఫలితాలు మాలలు వారు ఎక్కువ అనుభవించారు కాబట్టి, ఎస్సీ కులాలను వర్గీకరణ జరపాలంటూ మాదిగలు పోరాడారు. మందకృష్ణ మాదిగ తెలుగునాట ఆ పోరాటంలో ముందు ఉండి అందరిని నడిపించారు.

**జానారెడ్డితో సీఎం రేవంత్ భేటీ.. కారణం అదేనంటూ చర్చ..**

సీఎం రేవంత్ రెడ్డి.. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జానారెడ్డి నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా సుమారు అరగంటకు పైగా వీరి మధ్య పలు అంశాలపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. అయితే జానారెడ్డితో సీఎం రేవంత్ భేటీపై ప్రభుత్వ వర్గాలలో ఆసక్తికర చర్చ నడుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి.. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జానారెడ్డి నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా సుమారు అరగంటకు పైగా వీరి మధ్య పలు అంశాలపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. అయితే జానారెడ్డితో సీఎం రేవంత్ భేటీపై ప్రభుత్వ వర్గాలలో ఆసక్తికర చర్చ నడుస్తోంది. జానారెడ్డిని ప్రభుత్వ ముఖ్య సలహాదారుగా జానారెడ్డిని నియమిస్తారని ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వం అడిగితే సలహాలు ఇస్తానని జానారెడ్డి బుధవారం మీడియాతో తెలిపారు. దీంతో వీరి భేటీపై అంతా ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. జానారెడ్డి వ్యాఖ్యల వల్లే.. ముఖ్య సలహాదారు పదవి ఆఫర్ చేయడానికి సీఎం వెళ్లారంటూ చర్చించుకుంటున్నారు. త్వరలో కేబినెట్ విస్తరణ ఉంటుందనే ఊహాగానాలతో ఈ భేటీ ప్రాధాన్యతతలను సంతరించుకుంది.

## తెలంగాణ ప్రభుత్వానికి ఎదురు దెబ్బ..



-మొదటిపేజీ తరువాయి

చేశారు. కౌంటర్? దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది ధర్మాసనం లగచర్లలో ఫార్మా కంపెనీ ఏర్పాటు నిమిత్తం భూసేకరణ కోసం ప్రభుత్వం నోటిఫికేషన్‌ను జారీ చేసింది. లగచర్లలో ఫార్మా కంపెనీ ఏర్పాటును స్థానిక రైతులు వ్యతిరేకించారు. భూసేకరణపై రైతుల అభిప్రాయం తీసుకునేందుకు కలెక్టర్ లగచర్లకు వెళ్లిన సమయంలో దాడి కూడా జరిగింది. కలెక్టర్ మీద దాడికి సంబంధించి అరెస్టులు కూడా జరిగాయి. ఈ నేపథ్యంలో లగచర్లలో ఫార్మా కంపెనీలను ఏర్పాటు చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లను విచారించిన న్యాయస్థానం స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. నోటిఫికేషన్‌ను రద్దు చేసింది. తదుపరి విచారణను వాయిదా వేసింది. హకీంపేట భూసేకరణ నోటిఫికేషన్‌ను శివకుమార్ అనే వ్యక్తి హైకోర్టులో సవాల్ చేశారు. భూసేకరణ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని కోరారు. నోటిఫికేషన్‌ను రద్దు చేసేంత వరకు స్టే విధించాలని కోరారు. ప్రభుత్వం గత ఏడాది నవంబర్ 29న భూసేకరణపై నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఇక్కడ ఇండస్ట్రియల్ పార్కు కోసం 351 ఎకరాల భూసేకరణకు నోటిఫికేషన్ ఇచ్చింది. అయితే, 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించడం లేదంటూ పిటిషనర్ కోర్టుకు తెలిపారు.

Printed, Published & Owned by SIRIKONDA MARIA, Printed at Sai Sree Offset Printers, # 7-17-166, 3rd line, Srinagar, Guntur - 522002 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : SIRIKONDA MARIA, RNI No. APTEL/2014/57702. E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.